www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 21-4-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 22 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి రా. 1.12 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తర సా. 5.08 తదుపరి హస్త; వర్జ్యం: రా.2.31-4.19; దుర్ముహూర్తం: సా.4.49-5.39; అమృతఘడియలు: ఉ.9.00-10.49; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.29 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

65 ఏళ్లు దాటినా ఆరోగ్య బీమా

హెల్త్ ఇన్సూరెన్స్ వయో పరిమితి రద్దు

క్యాన్సర్, గుండెజబ్బులు, ఎయిడ్స్ బాధితులకూ బీమా సదుపాయం కల్పించాలి

ఇన్సూరెన్స్ వెయిటింగ్ కాలవ్యవధి 48 నెలల నుంచి 36 నెలలకు తగ్గింపు

జబ్బుల గురించి పాలసీదారులు వెల్లడించకపోయినా బీమా వర్తించాల్సిందే

మారటోరియం 8 ఏళ్ల నుంచి ఐదేళ్లకు.. వేర్వేరు వ్యాధుల చికిత్సకు నిర్ణీత బీమా సొమ్ము ఇచ్చేలా కంపెనీలు చర్యలు చేపట్టాలి.. ఐఆర్‌డీఏఐ కీలక నిర్ణయాలు

నోటిఫికేషన్ విడుదల.. బీమా రంగ నిపుణుల హర్షం

12



మైగ్రెయిన్ మాయం!

న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్‌తో బాధ నుంచి శాశ్వత విముక్తి

ఆసియాలోనే తొలిసారి ఏఐజీలో చికిత్స

నొప్పి సంకేతాలు మెదడుకెళ్లకుండా ఏర్పాటు

మారిషస్ యువతికి ఆపరేషన్ సక్సెస్

అన్ని రకాల దీర్ఘకాలిక నొప్పులకూ ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది: డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

2



ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్‌లోనూ అవినీతిపై ఫిర్యాదు: ఏసీబీ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ద్వారా అవినీతిపై ఫిర్యాదులు చేసేలా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. శనివారం నుంచి ఈ సేవలు ప్రారంభమయ్యాయి. ఇంతకు ముందు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్, అధికారిక ఈ-మెయిల్, వెబ్‌సైట్, వాట్సాప్ లేదా నేరుగా మాత్రమే ఫిర్యాదు చేసే అవకాశాలుండేవి. ఇకపై ఎక్స్(గతంలో ట్విటర్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల ద్వారా కూడా అవినీతిపై ఫిర్యాదు చేయవచ్చని అధికారులు వెల్లడించారు.



జనగామ జిల్లా ఉప్పుగల్లులో నేలకొరిగిన వరి పంట

చల్లబరిచి.. నష్టపరిచి!

ఈదురుగాలుల వాన.. చేతికొచ్చే దశలో పంట నష్టం

పలు జిల్లాల్లో నేలకొరిగిన వరి, మొక్కజొన్న పంటలు

కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యం

కూలిన విద్యుత్తు స్తంభాలు, చెట్లు

పిడుగుపాట్లకు పలుచోట్ల మూగజీవాలు బలి

హైదరాబాద్‌లో ట్రిప్పయిన 200 ఫీడర్లు

పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం

జనగామ జిల్లా నర్మెటలో 4.9 సెం.మీ వర్షపాతం

రాష్ట్రంలో మరో 4 రోజుల పాటు వర్షాలు

ఆదిలాబాద్ జిల్లా బేల చప్రాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత

అధికారులూ.. వచ్చే 2, 3 వారాలు జాగ్రత్తగా ఉండాలి

పంటల కోసం అందుబాటులో రెండు లక్షలకు పైగా టార్పాలిన్ కవర్లు

ప్రాథమిక నివేదికల మేరకు 2,200 ఎకరాల్లో పంటలకు నష్టం: మంత్రి తుమ్మల

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా శనివారం పలుచోట్ల వర్షం కురిసింది. నిప్పులు చిమ్ముతున్న ఉష్ణోగ్రతల మధ్య వాతావరణం కాస్త చల్లబడింది. ఫలితంగా మండే ఎండలు.. ఉక్కబోతతో చెమటలు కక్కుతూ హైరానా పడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఒక రోజు వ్యవధిలో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల మేరకు తగ్గాయి. అయితే కురిసిన వాన కొన్నిచోట్ల ఈదురుగాలు, వడగళ్లతో విరుచుకుపడటంతో చేతికొస్తున్న దశలో వివిధ పంటలకు

మిగతా 14వ పేజీలో...



హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ప్రధాన రహదారిపై నిలిచిన నీరు





మెదక్‌లో జరిగిన రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని; (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి నీలం మధు

కేడీని దించేశాం..

ఇక మోదీనే!

ఢిల్లీ మోదీ.. గజ్వేల్ కేడీల కుట్రలు.. ఎవరొచ్చినా మా ప్రభుత్వాన్నేం చేయలేరు

కేసీఆర్.. నువ్వు ఖాళీ చేయడానికిది ఫుల్‌బాటిల్ కాదు

కాంగ్రెస్ సర్కారు జోలికొస్తే బట్టలూడదీసి కొట్టిస్తా

ఉచిత విద్యుత్తు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నరు

కేసీఆర్ కారు పనైపోయింది.. ఫాంహౌస్ చుట్టూ పాత సామాన్ల వాళ్లు తిరుగుతున్నారు

మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి దుర్మార్గుడు

దుబ్బాకలో రఘునందన్‌ను గెలిపిస్తే ఏం చేశాడు?

మెదక్ రోడ్‌షోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి ఢిల్లీ మోదీ, గజ్వేల్ కేడీలు కుట్రలు పన్నుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వారిద్దరూ చీకట్లో మాట్లాడుకుంటున్నారన్నారు. మోదీ వచ్చినా, ఆయన తాత దిగి వచ్చినా తమ ప్రభుత్వాన్ని ఏమీ చేయలేరని చెప్పారు. వంద రోజుల్లోనే ఐదు గ్యారెంటీలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. శనివారం మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. మెదక్‌లో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో

మిగతా 13వ పేజీలో...

గుజరాతోళ్లే గొప్పోళ్లా?

26 సీట్లు ఇచ్చిన గుజరాత్‌కు 7 మంత్రి పదవులు

27 సీట్లు గెలిపించిన కర్ణాటకకు ఒక్కటేనా?

70 మంది తెలుగు, కన్నడ ఎంపీలకు ఇద్దరేనా?

వాళ్లే మొనగాళ్లా.. మనం ప్రభుత్వాలు నడపలేమా?

బెంగళూరు ప్రచారంలో కన్నడ ప్రజలను ప్రశ్నించిన సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌ను 20 సీట్లలో గెలిపించాలని విజ్ఞప్తి

13

తొలిదశలో 65%

చాలా రాష్ట్రాల్లో గత ఎన్నికల కంటే తక్కువే

లక్షద్వీప్‌లో అత్యధికంగా 83.88%

బిహార్‌లో అత్యల్పంగా 48.50 శాతం

12

రాష్ట్రంలో మూడో రోజు 77 నామినేషన్లు

లోక్‌సభ ఎన్నికలకు భారీగా..

మరో సెట్ దాఖలు చేసిన ఈటల

బీఆర్ఎస్ తరఫున కరీంనగర్‌లో వినోద్, జహీరాబాద్‌లో అనిల్

మూడు రోజుల్లో 194 నామినేషన్లు

13

మేడిగడ్డ పునరుద్ధరణకు ఏం చేయాలో చెప్పండి

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి తెలంగాణ లేఖ

14

ఏం తినాలన్నా భయమే!

అడ్డగోలుగా ఆహార కల్తీ

ప్రమాణాలు పాటించని హోటళ్లు

కాలం చెల్లిన ఉత్పత్తుల వాడకం

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో బయటపడుతున్న బాగోతాలు

పలు హోటళ్లకు నోటీసులు

2



కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల హామీ పత్రాన్ని చూపిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి. చిత్రంలో బూర నర్సయ్యగౌడ్

బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే.. పార్టీ మారరని చెప్పగలరా?

ఎమ్మెల్యేలను కాపాడుకోలేని కేసీఆర్ ఏ మొహం పెట్టుకుని ఓట్లడుగుతారు

గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం.. ఆ పార్టీకి ప్రజలు ఓట్లేయొద్దు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): "ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన వాళ్లు పార్టీ మారరని చెప్పగలరా..? అసలు నామినేషన్ల ఉప సంహరణ వరకైనా వారు పార్టీలో ఉంటారా..? పోలింగ్ వరకైనా కొనసాగుతారా..? ఎమ్మెల్యేలను కాపాడుకోలేని స్థితిలో ఉన్న మీరు.. ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారు..?" అని కేసీఆర్‌ను కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాదు.. డిపాజిట్ల కోసం ప్రయత్నించాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచినా.. ఆ పార్టీలో ఉంటారన్న నమ్మకం లేదని చెప్పారు. వరంగల్ అభ్యర్థిని కేసీఆర్ ప్రకటిస్తే.. ఆమె కాంగ్రెస్ తరఫున పోటీచేస్తున్నారని పేర్కొన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఓటమిని కేసీఆర్, కేటీఆర్ ఇంకా జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. పార్టీ నుంచి వలసలు, ఫోన్ ట్యాపింగ్, కవిత అరెస్టుతో సతమతమవుతూ.. బీజేపీని విమర్శిస్తున్నారని చెప్పారు. జై శ్రీరామ్ అనండి.. బీజేపీని తొక్కండని కేటీఆర్ మాట్లాడారని.. ఆయన తండ్రిని కామారెడ్డి ప్రజలు బీజేపీ జెండా పట్టుకుని తొక్కారన్న విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై రాష్ట్ర ప్రజలకు సోనియమ్మ రాసిన ఉత్తరం ఏమైందని సీఎం రేవంత్‌ను కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్

మిగతా 2వ పేజీలో...

బీజేపీ అధికారంలోకి వస్తే.. మళ్లీ ఎన్నికల బాండ్లు

దీనిపై అన్ని వర్గాలతో సంప్రదింపులు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

మంత్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్

12

వయనాడ్ నుంచీ రాహుల్ పరారే!

వేరే సీటు చూసుకోవలసిందే: మోదీ

కేరళలో లెఫ్ట్-కాంగ్రెస్ లడాయి

కాంగ్రెస్ తొలి దశలోనే ఓటమిని అంగీకరించింది.. ఎన్డీయే వైపే ప్రజలు

నన్ను దించడానికి శక్తిమంతులంతా ఏకమయ్యారు: ప్రధాని మోదీ

న్యాయ వ్యవస్థ గౌరవం తగ్గేలా..!

నియంతలు-దుర్మార్గుల గురించి జనం తెలుసుకోవడానికి కొంత సమయం పడుతుంది. హిట్లర్‌లోని నియంతను గుర్తించడానికి జర్మన్లకు టైమ్ పట్టింది. హిట్లర్ గురించి తెలుసుకొనేసరికి జర్మనీకి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. మన మధ్య తిరుగుతూ, మన ఓట్లతో అధికారం వెలగబెడుతున్న నియంతలు మారీచుల వలె రూపాలను మార్చుకుంటున్నారు. జర్మనైజేషన్ పీరియడ్ అన్న హిట్లర్ మాటలను జర్మన్లు విశ్వసించారు. చివరకు దారుణంగా నష్టపోయారు. తాను పేదల పెన్నిధినని, ఆ పేదల జీవితాలు బాగుపడాలంటే, వాళ్లకు మేళ్లు జరగాలంటే తనకు అధికారం ఇవ్వాలని అంటున్న సీఎం జగన్‌ను కూడా నాటి జర్మన్లవలె మన ప్రజల్లోనూ కొందరు ఎంతో కొంత నమ్ముతున్నారు.

జగన్మోహన్ రెడ్డికి నవరస నటనా సార్వభౌముడు అన్న బిరుదు ఇవ్వవచ్చు. ముఖంలో దీనత్వం, క్రూరత్వాలను ఏకకాలంలో ప్రదర్శించగలరు. జనంలోకి వెళ్లినప్పుడు ఒకలా, జనంలో లేనప్పుడు మరోలా ఉంటారని ఆయన చుట్టూ ఉన్న వాళ్లు చెబుతారు. గత ఎన్నికల్లో తండ్రిని కోల్పోయిన బిడ్డను అని, తండ్రి రాజశేఖర రెడ్డిని హత్య చేయించారని ప్రచారం చేసి ప్రజల సానుభూతిని పొందారు. అప్పుడు ఆయనకు తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల వంతపాడారు. మద్దతుగా ప్రచారం చేశారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇడుపులపాయ అంతఃపురానికి బీటలు వారాయి. తల్లీ చెల్లీ దూరమయ్యారు. దీంతో ప్రజలను మరో మారు మాయచేయడానికై 'నేను ఒంటరి వాడిని, నాకు వ్యతిరేకంగా తోడేళ్ల గుంపు ఒక్కటైంది' అంటూ ప్రచారం చేస్తున్నారు. కమ్యూనిస్టులకు మాత్రమే పరిమితమైన క్లాస్ వార్ పదాన్ని కూడా అందిపుచ్చుకున్నారు. తాను పేదల ప్రతినిధినని, పేదలకోసమే తన తపన అంతా అని చెప్పుకొంటూ చంద్రబాబు అండ్ కోను పెత్తందారులని దూషిస్తున్నారు.

4

ప్రజల బలహీనతలను బొపోసనపట్టిన జగన్ రెడ్డి వంటి వారే క్లాస్ వార్ సిద్ధాంతాన్ని తెర మీదకు తెస్తారు. 'మీరు చెబుతున్నది నిజమే అయితే వేల కోట్ల సామ్రాజ్యాన్ని మీరు ఎలా నిర్మించుకున్నారు? మేమెందుకు పేదలగానే మిగిలిపోయాం?' అని ఒకే ఒక ప్రశ్న వేస్తే జగన్ రెడ్డి వంటి వారి నిజ స్వరూపం బట్టబయలు అవుతుంది.

గత ఎన్నికల్లో తనకు ఉపయోగపడిన వివేకా చావు ఈ ఎన్నికల్లో నష్టం చేయకుండా ఉండేందుకు న్యాయస్థానాలను ఉపయోగించుకొనే ప్రయత్నాన్ని జగన్ రెడ్డి చేస్తున్నారు.

వివేకా హత్య గురించి షర్మిల, సునీతతోపాటు ప్రతిపక్షాలకు చెందిన వారెవరూ ప్రస్తావించకుండా న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వులను పరిశీలిస్తే న్యాయ వ్యవస్థపై ఉండే గౌరవం సన్నగిల్లుతుంది. పిటిషనర్ కోరింది మాత్రమే కాకుండా ప్రతిపక్షాలపై మరిన్ని పరిమితులు విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటో అర్థం కాదు. ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందా? అహేతుకమైన ఉత్తర్వులు ఇచ్చిన న్యాయస్థానంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేసే అవకాశం ఉండదా? ప్రభుత్వ యంత్రాంగంలో కింది స్థాయిలో తప్పు జరిగినట్టు ఫిర్యాదు వస్తే పైస్థాయిలో చర్యలు తీసుకుంటారు కదా? న్యాయ వ్యవస్థలో కూడా కింది స్థాయి కోర్టులు తప్పుచేసినా, పరిధి దాటినా ఉన్నత న్యాయస్థానం చర్యలు తీసుకోలేదా? అంటే తీసుకోవచ్చు!



కొత్త పలుకు

కడప న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. కడప కోర్టు ఇచ్చిన తీర్పుతోనే ఇది మొదలు కావాలి. ఎవరో ఒకరు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తేనే న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుంది. తమకు కూడా జవాబుదారీతనం ఉంటుందని కింది స్థాయి న్యాయ వ్యవస్థకు గుర్తు చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. లేని పక్షంలో బాధితులు నిందితులుగా మారిపోతారు. నిందితులు నిర్దోషులుగా ప్రకటించుకుంటూ విర్రవీగుతారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్ర చూడ్ తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల సారాంశానికి భిన్నంగా కడప కోర్టు ఆదేశాలు ఉండటం గమనార్హం!

మైగ్రెయిన్ మాయం

న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్‌తో శాశ్వత విముక్తి


పేషంట్‌కు అమర్చిన న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్

- ఆసియాలోనే తొలిసారిగా ఏఐజీలో చికిత్స
- విదేశీ యువతికి విజయవంతంగా ఆపరేషన్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విపరీతమైన మైగ్రెయిన్‌తో బాధపడుతున్నారా? ఎన్ని చికిత్సలు తీసుకున్నప్పటికీ ఉపశమనం లేదా? అయితే, ఈ వార్త మీ కోసమే! దీర్ఘకాలిక మైగ్రెయిన్‌కు ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. కొన్నేళ్లుగా మైగ్రెయిన్‌తో బాధపడుతున్న ఓ విదేశీ యువతికి ఏఐజీ ఆస్పత్రి.. న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్ వైద్య ప్రక్రియతో ఆ బాధ నుంచి విముక్తి కల్పించింది. ఈ ప్రక్రియ నిర్వహించిన రెండురోజులకే ఆ యువతికి మైగ్రెయిన్ పూర్తిగా తగ్గిపోయిందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ తరహా చికిత్సతో మైగ్రెయిన్‌ను నివారించటం ఆసియాలోనే ఇది మొదటిసారి అని చెప్పారు. మారిషస్‌కు చెందిన ఓ 24 ఏళ్ల యువతి దీర్ఘకాలికంగా మైగ్రెయిన్‌తో బాధపడుతున్నారు. తల, మెడ, కడుపు, వెన్ను భాగాల్లో భరించలేని నొప్పితో ఆమె సతమతమవుతున్నారు. గదిలో లైట్లు వేస్తే చూడలేని పరిస్థితి ఏర్పడటంతో ఆమె ఎక్కువసేపు చీకటిలోనే గడిపేవారు. పలు దేశాలకు వెళ్లి రకరకాల చికిత్స తీసుకున్నా కూడా ఉపశమనం లభించలేదు. చివరకు ఆమె హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి వచ్చారు. ఆమెను పరీక్షించిన న్యూరో సర్జికల్ బృందం, తొలుత మందులతో నయం చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం రాలేదు. దీంతో ఆమెకు హై సర్వైకల్ స్పైనల్ కార్డ్ స్టిమ్యులేటర్ ఇంప్లాంటేషన్ (న్యూరో స్టిమ్యులేటర్) ప్రక్రియను నిర్వహించారు. వెన్ను కింది భాగంలో పేస్ మేకర్ లాంటి పరికరం ఏర్పాటు చేసి దాని ద్వారా సన్నని తీగలను తలలోని నరాలకు అనుసంధానించారు. దీని పనితీరును డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, న్యూరో మోడ్యులేషన్ డాక్టర్ సిద్ధార్థ్ చావలి వివరిస్తూ.. న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్‌లో అమర్చిన సీసం ద్వారా చిన్న విద్యుత్ సంకేతాలు వెలువడతాయని, ఇవి నొప్పి సందేశాలు మెదడుకు చేరుకోకముందే అడ్డగిస్తాయని, ఫలితంగా రోగులకు నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. తలనొప్పి, వెన్నునొప్పి మాత్రమే కాకుండా.. ఏ రకమైన దీర్ఘకాలిక నొప్పితో బాధపడే వారికైనా ఈ ప్రక్రియ ద్వారా నయం చేయవచ్చునన్నారు. ఇంప్లాంట్‌ను ఏర్పాటు చేసిన రెండు రోజులకే మారిషస్ యువతిలో అన్ని రకాల నొప్పులు తగ్గిపోయాయని, వాటి నుంచి ఆమెకు విముక్తి లభించినట్లేనని తెలిపారు. పదేళ్ల పాటు ఇంప్లాంట్‌లోని బ్యాటరీ పనిచేస్తుందని, తర్వాత బ్యాటరీ మార్చుకుంటే సరిపోతుందన్నారు. అత్యాధునిక వైద్య ప్రక్రియలను ఆవిష్కరిస్తూ రోగుల జీవితాలను మెరుగుపరిచే కృషిని ఏఐజీ ఆస్పత్రులు కొనసాగిస్తాయని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	43.8	25.7
ఆదిలాబాద్	42.8	29.2
నిజామాబాద్	42.4	25.0
నల్లగొండ	40.0	24.8
రామగుండం	35.4	28.0


సీఎం రేవంత్‌ను కలిసిన అనన్య, కుటుంబ సభ్యులు

సివిల్స్ మూడో ర్యాంకర్ అనన్యరెడ్డిని అభినందించిన సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సివిల్స్-2023లో మూడో ర్యాంకు సాధించిన దోనూరి అనన్యరెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. శనివారం అనన్య కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా సీఎంను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అనన్యతో పాటు సివిల్స్‌కు ఎంపికైన మిగతా తెలుగు అభ్యర్థులకు కూడా రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎంపికైన వారంతా దేశ సేవలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కాగా, సివిల్స్-2023 ఫలితాల్లో 27వ ర్యాంకు సాధించిన అభ్యర్థి నందాల సాయికిరణ్‌కు ఆర్థిక సాయం అందించామని రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఆరుగురు అభ్యర్థుల నుంచి ఆర్థిక సాయం కోసం స్టడీ సర్కిల్‌కు 6 దరఖాస్తులు వచ్చాయని శనివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించామని, వారిలో సాయికిరణ్ ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తనకు ఆర్థిక సాయం అందించిన ప్రభుత్వానికి, సహకరించిన అధికారులకు సాయికిరణ్ ధన్యవాదాలు తెలిపారు.

రేపు కృష్ణాబోర్డు ప్రత్యేక భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలు నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం ప్రత్యేకంగా బోర్డు సమావేశం నిర్వహించాలని కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) నిర్ణయించింది. ప్రస్తుతం బోర్డు వద్ద ఉన్న నిధులు ఈ నెల వేతనాలకు కూడా సరిపోయే పరిస్థితి లేదు. నిధులు లేకపోవడంతో బోర్డు కార్యకలాపాలు కష్టంగా మారాయి. దాంతో నిధుల కోసం తెలుగు రాష్ట్రాలపై ఒత్తిడి పెంచడానికి వీలుగా ఈ భేటీని బోర్డు హైబ్రిడ్ విధానం(ప్రత్యక్షంగా లేదా వర్చువల్)లో నిర్వహించనుంది.

టెయిల్‌పాండ్ నుంచి నీటి విడుదలను అడ్డుకోండి

- కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ నుంచి అనుమతి లేకుండా ఏపీ జెన్‌కో నీటిని వదులుతోందని, దీని వల్ల జల విద్యుత్ కేంద్రం నిర్వహణపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బోర్డు చైర్మన్ శివ్‌నందన్ కుమార్‌కు ఈఎన్‌సీ (జనరల్) జి. అనిల్‌కుమార్ లేఖ రాశారు. సాగర్ జల విద్యుత్ కేంద్రం అవసరాల కోసమే టెయిల్‌పాండ్ నిర్మించారని, దానిలో 6.737 టీఎంసీల నీటి నిల్వ ఉండగా ఈ నెల 13వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో నీటిని దిగువకు (పులిచింతల) వదిలిపెట్టారని ఫిర్యాదు చేశారు. తర్వాత 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో 28,930 క్యూసెక్కులు వదిలిపెట్టారని తెలిపారు. పులిచింతల నీటి అవసరాలు తీర్చడానికి టెయిల్‌పాండ్ కట్టలేదని, దాన్ని జల విద్యుత్ కేంద్రంలో రివర్సబుల్ పంపింగ్ కోసం కట్టారని గుర్తుచేశారు. కృష్ణా బోర్డు జోక్యం చేసుకుని, తక్షణమే నీటి విడుదలను నిలిపివేయాలని కోరారు.

చిలుకూరు ఆలయంలో నేటి 'కల్యాణప్రాప్తి' రద్దు

- ప్రధానార్చకులు రంగరాజన్ వెల్లడి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించే 'కల్యాణప్రాప్తి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం జరిగిన 'గరుడ ప్రసాదం' పంపిణీలో భక్తులు భారీగా తరలిరావడంతో ఇబ్బంది తలెత్తిన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 'గరుడ ప్రసాదం' స్వీకరించిన మహిళలు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోందని, అయితే భక్తుల రద్దీ దృష్ట్యా 'కల్యాణప్రాప్తి' కార్యక్రమాన్ని రద్దు చేశామని పేర్కొన్నారు. దీనిని భక్తులు గమనించి ఆలయానికి రావొద్దని తమ ఇళ్ల వద్దే స్వామివారిని ప్రార్థించుకోవాలని సూచించారు. అయితే ఆదివారం సాయంత్రం జరిగే కల్యాణోత్సవం యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు

- బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి : గిరిజన శక్తి

పంజాగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, గిరిజనులు కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గిరిజన శక్తి పిలుపునిచ్చింది. గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి డి.రవీంద్ర నాయక్, సంస్థ అధ్యక్షుడు శరత్ నాయక్ తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంలో బంజారా సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గిరిజనులను చేసింది ఏమి లేదన్నారు. కేసీఆర్ హయాంలో నియంత పాలన కొనసాగిందని, దానిని భరించలేకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారన్నారు.

కేసీఆర్‌ను ప్రజలు నమ్మబోరు: లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర కాదు కదా.. మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు ఆయనను నమ్మబోరని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వందకు పైగా ఎమ్మెల్యేలున్న తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నించిందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎలా వదిలిపెడుతుందంటూ కేసీఆర్ రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ పట్ల, ప్రధాని మోదీ పట్ల రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, అందుకే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆయన ఆరోపించారు.

శ్రీవారిసేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్నాథ్ గౌడ్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఏం తినాలన్నా భయమే!

అడ్డగోలుగా ఆహార కల్తీ.. ప్రమాణాలు పాటించని హోటళ్లు.. కాలం చెల్లిన ఉత్పత్తుల వాడకం

- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో బయటపడుతున్న బాగోతాలు
- పలు హోటళ్లకు నోటీసులు
- ఫిర్యాదుల కోసం 9100105795


హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వంటగదిని తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

- హైదరాబాద్ సోమాజీగూడ నాగార్జున సర్కిల్ వద్ద గల ఓ హోటల్‌లో వంట గది శుభ్రంగా లేదు. ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలు తయారుచేస్తున్నారు.
- జూబ్లీహిల్స్‌లోని ఓ బార్ అండ్ కిచెన్‌లో కాలంచెల్లిన అల్కలైన్ వాటర్ బాటిల్స్ సరఫరా చేస్తున్నారు. ఈ హోటళ్లు, బార్‌కు అధికారులు నోటీసులు జారీ చేశారు.

ఇదీ రాష్ట్ర రాజధానిలోని ప్రముఖ హోటళ్లలో పరిస్థితి. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది. ఏం తినాలన్నా.. కనీసం మంచినీళ్లు తాగాలన్నా కూడా భయపడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. 4 రోజులుగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని హోటళ్లు, ఆహార పదార్థాల తయారీ యూనిట్లపై దాడులు చేస్తోంది. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ భారత ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందంలో ముగ్గురు ఫుడ్ సేఫ్టీ అధికారులు, మరికొందరు సభ్యులు ఉన్నా రు. ఈ బృందం ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో దాడులు నిర్వహిస్తోంది. జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఈ దాడుల్లో ప్రముఖ హోటళ్లతో పాటు వివిధ ఆహార ఉత్పత్తులు తయారు చేసే సంస్థల బాగోతాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఫుడ్ బిజినెస్ రోజూ కోట్ల రూపాయల్లో జరుగుతోంది. ఇంతపెద్ద వ్యాపారంపై కనీసం తనిఖీలు ఉండటం లేదు. కొన్ని హోటళ్ల యాజమాన్యాలు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి.

కఠిన చర్యలకు ఆదేశం

రోజురోజుకూ ఆహార పదార్థాల కల్తీ, హోటళ్ల ఇష్టారాజ్యంపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో కమిషనర్ కర్ణన్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు. ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపాలని సూచించారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు ఇవ్వాలని, అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆహార పదార్థాల్లో నాణ్యత కొరవడడం, కల్తీ అంశాలపై ఫిర్యాదుల కోసం ఫోన్ నంబర్ 9100105795 ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో అయితే 040-21111111కు కాల్ చేయవచ్చు. ట్విటర్‌లో కూడా (ఎఫ్‌సీజీహెచ్ఎంసీ) ఫిర్యాదు చేయవచ్చని కర్ణన్ తెలిపారు.

కల్తీలతో తీవ్ర అనారోగ్యాలు

ప్రమాణాలు లేని వాటిని మూడు క్యాటగిరీలుగా విభజిస్తారు. అవి.. హానికరమైనవి. నకిలీవి. నాసిరకమైనవి. నాణ్యత లేని పదార్థాలను తినడం వల్ల తీవ్ర అనారోగ్యాల బారిన పడతారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నెయ్యిలో కలిపే జంతువుల కొవ్వు వల్ల రక్తహీనతతో పాటు గుండె పరిమాణం పెరుగుతుంది. నూనెల్లో కల్తీ వల్ల తీవ్రమైన కంటి జబ్బులతో పాటు క్యాన్సర్, గుండె పోటు, చెడు కొలెస్ట్రాల్ పెరిగే ప్రమాదం ఉంది. కారంలో రంగు కోసం కలిపే ఇటుక పొడి, రంపపు పొట్టు వల్ల ఉదర సమస్యలతో పాటు క్యాన్సర్ వచ్చే ముప్పు ఉంది. ధాన్యాల్లో కల్తీ కాలేయ సమస్యలకు దారి తీయవచ్చు. కాఫీ, టీ పొడులు, పంచదార కల్తీ వల్ల డయేరియా, కాలేయం, కిడ్నీల సమస్యలు, రక్తపోటు పెరిగే ప్రమాదం ఉంది.

ప్రమాణాల్లో 15వ స్థానంలో తెలంగాణ

ఆహార ప్రమాణాల సూచికలో తెలంగాణ పరిస్థితి ఏ మాత్రం బాగోలేదు. ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఇండియా 2021-22 నివేదిక ప్రకారం 17 పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ 15వ స్థానంలో ఉంది. ఫుడ్ సేఫ్టీలో ఐదు విభాగాల్లో వంద మార్కులకు రాష్ట్రానికి కేవలం 34.5 మార్కులే వచ్చాయి.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

25న రాష్ట్రానికి అమిత్ షా?



హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈనెల 25న రాష్ట్రానికి రానున్నారు. వరంగల్‌లో నిర్వహించే సభలో షా పాల్గొనే అవకాశం ఉందని, ఒకటి రెండు రోజుల్లో ఆయన పర్యటన ఖరారు కానుందని పార్టీ వర్గాలు శనివారం తెలిపాయి.

పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి మార్పు?

బీజేపీ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి మారే అవకాశం ఉంది. ఇక్కడి నుంచి అభ్యర్థిగా గోమాస శ్రీనివాస్‌ను పార్టీ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, పెద్దపల్లి ఎంపీ టికెట్ ఆశించి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వెంకటేశ్ నేత.. గడ్డం వంశీకి టికెట్ ఇవ్వడంతో కొన్ని రోజుల నుంచి హస్తం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన బీజేపీలో చేరి పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థిగా బరిలో దిగుతారని ప్రచారం జరుగుతోంది.

రేవంత్.. గాలిమాటలు

బంద్ చెయ్..

- నాపై వ్యక్తిగతంగా వ్యాఖ్యలు చేస్తున్నావ్..
- నీవు భూమికి జానెడు ఉన్నావ్ అని అనలేనా?: హరీశ్‌రావు



గజ్వేల్/హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాలిమాటలు.. పిల్లిశాపాలు బంద్ చేయాలని, రైతులకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో నిధులన్నీ సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల, మెదక్‌కు తీసుకుపోతున్నారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మెదక్‌కు వచ్చి ఏమీ అభివృద్ధి చేయలేదని మాట్లాడటం విడ్డూరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి తనపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తున్నారని, దూలంలా పెరిగావ్ అని అంటున్నారని.. భూమికి జానెడు ఉన్నావ్.. ఆవకాయంత మెదడు లేదా అని తాను ఆయనను అనలేనా..? కానీ తనకు సంస్కారం అడ్డు వస్తుందని ఆయన అన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో పనిచేస్తున్న ఐసీటీ కంప్యూటర్ టీచర్లకు మూడు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీతాల్లేక వారు అప్పుల పాలయ్యి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయి కానీ ఆచరణ గడప దాటడం లేదని శనివారం 'ఎక్స్'లో విమర్శించారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే..

పార్టీ మారరని చెప్పగలరా?

(మొదటి పేజీ తరువాయి)

దగా చేసిందని.. హామీలు అమలు చేసే వరకు ఆ పార్టీకి ఓటు వేయొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఓట్లు దండుకున్నారని.. ఇప్పుడు ఆగస్టు నుంచి అంటూ మాయ మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇప్పించేందుకు బీజేపీ 5 సీట్లలో సుపారీ తీసుకుందంటూ రేవంత్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బీజేపీ బెయిల్ ఇవ్వదన్న సంగతి తెలుసుకోవాలని చెప్పారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో మీరు బెయిల్ ఇప్పిస్తారా..?' అని రేవంత్‌ను నిలదీశారు. కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా కిషన్‌రెడ్డి.. రాంనగర్, విద్యానగర్, ఆజామాబాద్, బాగ్ లింగంపల్లి, అంబర్‌పేట్‌లో పర్యటించారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీసీ కుల సంఘాలతో సమావేశమయ్యారు.


మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు పార్టీ బీ ఫాం అందజేస్తున్న కిషన్‌రెడ్డి

రేవంత్‌కు ఆగస్టు సంక్షోభం: ఏలేటి

సీఎం రేవంత్ రెడ్డికి ఆగస్టు సంక్షోభం ఉందని.. జూన్‌లో ఓటుకు నోటు కేసు విచారణ జరుగుతుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గతంలో టీడీపీకి ఆగస్టు సంక్షోభం ఉండేదని.. రేవంత్ కూడా ఎల్లో కాలేజీకి చెందిన వ్యక్తే అని పేర్కొన్నారు. రేవంత్ కరెంటు తీగ కాదని.. తమను ముట్టుకుంటే తాము ఏ వైర్లమో తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఆగస్టులో రాజకీయ సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు. ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయని చెప్పారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం స్వీయ విధ్వంసం దిశగా పయనిస్తోందని తెలిపారు.

రేవంత్ భాష సీఎం హోదాకు తగదు: డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 : తనను ఎన్నికల్లో ఎలాగైనా ఓడించాలని సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలంతా ముప్పేట దాడి చేస్తున్నారని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మహిళ అన్న ఇంగిత జ్ఞానం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతూ, తనను అవమానానికి గురిచేసేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని తన నివాసంలో డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. పాలమూరులో ఓడిపోతామన్న భయంతో సీఎం ఇప్పటికే ఐదుసార్లు జిల్లాలో బహిరంగ సభలు నిర్వహించారని, అభ్యర్థి నామినేషన్‌కు కూడా హాజరయ్యారని పేర్కొన్నారు. వచ్చిన ప్రతీసారి తనను తిట్టిపోస్తున్నారని, అనరాని మాటలంటున్నారని తెలిపారు. సీఎం వాడే భాష ఇదేనా..? ఆయన ఇంట్లో ఆడ వాళ్లు లేరా..? అని ప్రశ్నించారు.

పారదర్శక ఎన్నికల నిర్వహణలో

ఓటర్ల సహకారమే కీలకం

- ఓటర్ల అవగాహన ఫోటో ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్

హైదరాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి మహోత్సవం వంటి ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడంలో ఓటర్లు తమ వంతు పాత్రను పోషించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ అన్నారు. ప్రలోభాలకు ఆస్కారం లేకుండా సహకరించే బాధ్యత ఓటర్లదేనన్నారు. మహాత్మాగాంధీ సెంట్రల్ బస్‌స్టేషన్(ఎంజీబీఎస్)లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన పెంచేందుకు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని బాధ్యతగా భావించాలన్నారు. తమ ప్రాంతాన్ని ఎవరు అద్భుతంగా అభివృద్ధి చేస్తారో నిర్ధారించుకుని వారికే ఓటు వేయాలని సూచించారు. ఓటు హక్కుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు రద్దీ ప్రదేశాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. ప్రధాన బస్‌స్టేషన్‌లో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. మూడు రోజుల పాటు ఈ ఫోటో ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. 1951లో ప్రారంభమైన భారత ఎన్నికల చరిత్రను వీక్షకులకు ఆసక్తి కల్పించే విధంగా ఏర్పాటు చేశారని కొనియాడారు.


ఎంజీబీఎస్‌లో ఓటర్ల అవగాహన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన వికాస్‌రాజ్. చిత్రంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్

కాంగ్రెస్‌లో ప్రకాశ్‌గౌడ్ చేరికపై సస్పెన్స్

- శనివారం కేటీఆర్‌ను కలిసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే
- సీఎంతో చర్చించి పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకుంటానని.. స్థానిక నాయకులు, కార్యకర్తలతో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత టి. ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరడంపై సస్పెన్స్ నెలకొంది. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శుక్రవారం సమావేశం కావడంతో ఆయన కారు దిగడం ఖాయమనే వార్తలు వచ్చాయి. అయితే, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. దీంతో ఆయన పార్టీ మారడంపై మళ్లీ చర్చ మొదలైంది. మరోపక్క, రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కీలక కార్యకర్తలతో శనివారం సమావేశమైన ప్రకాశ్ గౌడ్ పార్టీ మార్పుపై చర్చించారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని మెజార్టీ నాయకులు ఆయన్ను కోరినట్టు సమాచారం. అయితే, కార్యకర్తలతో రెండ్రోజుల్లో మరోసారి సమావేశం అవుతానని, ఈలోగా ముఖ్యమంత్రితో చర్చి పార్టీ మార్పుపై నిర్ణయాన్ని ప్రకటిస్తానని రాకేశ్ గౌడ్ ప్రకటించారు. దీంతో ఆయన బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా ? కాంగ్రెస్ చేయి అందుకుంటారా ? అనే దానిపై గందరగోళం నెలకొంది.


కేసీఆర్ నివాసంలో కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

యువకుడి ప్రాణాలు బలిగొన్న సైబర్ నేరగాళ్లు

- నిషేధిత గేమింగ్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న యువకుడికి బెదిరింపులు
- పోలీసులమని చెప్పి.. రూ.5 లక్షలు డిమాండ్
- వేధింపులు తట్టుకోలేక బాధితుడి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 20: సైబర్ నేరగాళ్ల వేధింపులకు నిండు ప్రాణం బలైంది. ప్లే స్టోర్‌లో ఓ గేమింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న యువకుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు.. తాము పోలీసులమని, నిషేధిత గేమ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నందుకు రూ. 5లక్షలు ఇవ్వాలని వేధించడంతో సదరు యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన నిజామాబాద్ జిల్లాలో శనివారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన మోతె నాగరాజు(19) నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. అతను ఇటీవల తన మొబైల్ ఫోన్‌లో ఓ నిషేధిత గేమింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. దీంతో సైబర్ నేరగాళ్లు నాగరాజ్‌కు ఫోన్ చేసి తాము పోలీసులమని.. నిషేధిత యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకున్నావని ప్రశ్నించారు. రూ.5లక్షలు ఇవ్వాలని.. లేదంటే కేసు నమోదు చేస్తామని బెదిరించారు. తన వద్ద డబ్బుల్లేవని నాగరాజు ఎంత చెప్పినా వినకుండా వారు పదే పదే ఫోన్ చేస్తుండటంతో.. వేధింపులు భరించలేక గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో కుటుంబీకులు అతడిని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నాగరాజు శనివారం మృతి చెందాడు.

కలుషిత ఆహారం తిని.. 22 మంది విద్యార్థినులకు అస్వస్థత

- నర్సాపూర్ (జి) కేజీబీవీలో ఘటన.. సీతక్క సీరియస్

నిర్మల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి)లోని కేజీబీవీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రోజూలాగే శుక్రవారం రాత్రి కూడా విద్యార్థినులు భోజనం చేశారు. అయితే నాణ్యత లేని అన్నం, పప్పును వడ్డించడంతో.. అది తిన్న విద్యార్థినులు అర్ధరాత్రి వేళ ఒక్కొక్కరుగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల సిబ్బంది వెంటనే వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీరియస్‌గా ఉన్న ముగ్గురు విద్యార్థులను నిర్మల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులందరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ శనివారం పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లోని వంట గది, డైనింగ్ హాల్, వంట కోసం ఉపయోగించే వాటర్ ట్యాంకును పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలు, సరుకులనే వాడాలని.. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, ఘటనపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్పందించారు. సంబంధిత శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భోజన నిర్వాహకులు చేసిన పొరపాటును ప్రభుత్వానికి ఆపాదించి ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతం చేస్తున్నారంటూ మండిపడ్డారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

టేకుమట్ల, ఏప్రిల్ 20 : అప్పుల బాధతో ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో చోటు చేసుకుంది. భూర్నపల్లికి చెందిన కొండా రమేష్(44) తనకున్న రెండెకరాల భూమిలో వరి పంట వేశాడు. సాగునీరు అందకపోవడంతో పంట నష్టపోయాడు. దీంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ. 1.50 లక్షలు తీర్చలేక మనస్తాపం చెందాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లోంచి వెళ్లిన అతడు భూర్నపల్లి గ్రామశివారులోని గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు.

టీ తాగితే.. నల్లమందు కిక్కు!

ఛాయ్‌లో గసగసాల పొట్టు, గడ్డి.. జిలేబీల తయారీలోనూ వినియోగం

- రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు రవాణా
- గసగసాల గడ్డి నుంచి.. హెరాయిన్, నల్లమందు తయారీకి చాన్స్
- ఇద్దరికి బేడీలు..రూ.కోటిన్నర విలువైన ముడిసరుకు సీజ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న గసగసాల పొట్టు

మంగళ్‌హాట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మీరు రెగ్యులర్‌గా వెళ్లే టీస్టాల్‌లో.. ఒక కప్పు ఛాయ్ తాగగానే తలనొప్పి వెంటనే గాయబ్ అవుతోందా? డిప్రెషన్, తీవ్ర పని ఒత్తిడి వల్ల కలిగే చికాకు.. ఇలా పలు సమస్యల నుంచి తక్షణం ఉపశమనం లభిస్తోందా? అయితే తస్మాత్ జాగ్రత్త. ఆ టీలో నల్లమందు ఉండే ప్రమాదముంది. రాజస్థాన్‌కు చెందిన ముఠాలు నల్లమందు ముడి సరుకు(గసగసాల గడ్డి, పొట్టు)ను హైదరాబాద్‌లోని టీస్టాల్స్ జిలేబీ బండ్లు, కిరాణాలకు సరఫరా చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. గోషామహల్‌లో 15 రోజులు నిఘా పెట్టి.. ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.50 కోట్లు విలువ చేసే 160 కిలోల గసగసాల గడ్డిని స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్‌లోని బర్మియా జిల్లా నుంచి కొన్ని ముఠాలు హైదరాబాద్‌కు నల్లమందు, హెరాయిన్ తయారీకి ఉపయోగించే పాపి స్ట్రా(గసగసాల గడ్డి, పొట్టు)ను సరఫరా చేస్తున్నాయి. ఈ ముడి సరుకు నుంచి హెరాయిన్, ఒపియం(నల్లమందు)ను తయారు చేస్తారు. అయితే గోషామహల్‌కు చెందిన పరాస్ అనే వ్యక్తి గసగసాల గడ్డి, పొట్టును రాజస్థాన్ నుంచి తెప్పించి, హైదరాబాద్‌లోని టీస్టాళ్లు, జిలేబీ బండ్లు, కిరాణాలకు సరఫరా చేస్తున్నాడు. దీనిపై ఉప్పందుకున్న ఎక్సైజ్ పోలీసులు తొలుత దేవేంద్ర అనే వ్యక్తిపై నిఘా పెట్టారు. శనివారం అతణ్ని అరెస్టు చేశారు. దర్యాప్తులో దేవేంద్ర తండ్రి పరాస్ గసగసాల గడ్డి, పొట్టు సరఫరాలో కీలక నిందితుడని గుర్తించారు. వీరి ఇంట్లో తనిఖీ చేసి, 160 కిలోల గసగసాల పొట్టు, గడ్డిని సీజ్ చేశారు. దీన్ని ప్రాసెస్ చేస్తే.. విలువ రూ.1.5 కోట్ల దాకా ఉంటుందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. "మరుగుతున్న టీలో గసగసాల పొట్టును కలిపితే.. ఆ ఛాయ్ తాగిన వారికి మత్తుగా ఉంటుంది. జిలేబీల తయారీలోనూ గసగసాల పొట్టు, గడ్డిని వాడుతున్నారు. ఒపియం వంటి మత్తుపదార్థాలను తయారు చేస్తున్నారు. ఒక గ్రాము ఒపియం నుంచి 32 మిల్లీ గ్రాముల మార్ఫిన్, హెరాయిన్ తయారవుతుంది. 160 కిలోల పాపి స్ట్రా నుంచి 5.5 కిలోల మార్ఫిన్, హెరాయిన్‌ను తయారు చేయవచ్చు" అని అధికారులు వివరించారు.

అటవీ భూమిని అడ్డంగా కొట్టేసే కుట్ర

రూ.400 కోట్ల విలువైన భూమికి స్కెచ్.. భూపాలపల్లి శివార్లలో 106 ఎకరాల భూమి

- అటవీశాఖ తనదే అంటున్నా.. ప్రైవేటు వ్యక్తికి అనుకూలంగా కలెక్టర్ల నివేదికలు
- నాటి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే హస్తం
- సర్కారు మారడంతో సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి
- సుప్రీంకోర్టులో సీఎస్ అఫిడవిట్.. భూమి భద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.400 కోట్ల విలువైన అటవీ భూమిని కాజేసే కుట్రలో ఏకంగా కలెక్టర్ స్థాయి అధికారులే భాగం కావటం సంచలనం రేపుతోంది. భూపాలపల్లి జిల్లా కేంద్రం శివారులోని కొంపెల్లిలో ఉన్న అటవీ భూముల వివాదంపై సుప్రీంకోర్టు ఇటీవల వెల్లడించిన తీర్పుతో ఈ భూదందాలో కొత్త కోణం బయట పడింది. ఏకంగా 106 ఎకరాల అటవీ భూమిని కబ్జా చేసేందుకు అప్పటి బీఆర్‌ఎస్ లీడర్లు, అధికారులు కలిసి ఆడిన నాటకం చర్చనీయాంశమైంది. అటవీ శాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. ఏకంగా కబ్జాదారులకు అనుకూలంగా హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు అప్పట్లో పని చేసిన కలెక్టర్లు, అధికారులు నివేదికలు ఇచ్చారు. ఒక బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఒత్తిడితోనే ఇది జరిగిందని తెలుస్తోంది. తమకు అడ్డు లేకుండా, కోరినట్లు నివేదికలు తయారు చేయించేందుకు అప్పట్లోనే ఇద్దరు అటవీ అధికారులను కూడా రాజకీయ జోక్యంతో బదిలీ చేయించినట్లు సమాచారం. కొంపెల్లి గ్రామ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న 106 ఎకరాల భూమిపై హక్కులు తనవేనని మహ్మద్ అబ్దుల్ ఖాసిం అనే వ్యక్తి 1985లో వరంగల్ జిల్లా కోర్టులో కేసు వేశారు. 1994లో అటవీ శాఖకు అనుకూలంగా జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ ఖాసిం.. 1994లో హైకోర్టులో అప్పీలు చేయగా, 2018లో హైకోర్టు కూడా అటవీశాఖకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీనిపై ఖాసిం 2021లో హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. అఫిడవిట్ దాఖలు చేయమని రెవెన్యూ శాఖను హైకోర్టు ఆదేశించింది. జిల్లా రెవెన్యూ అధికారులైన కలెక్టర్ తదితరులు అప్పటి ప్రభుత్వంలో కొందరితో కుమ్మక్కై ఈ భూమి ప్రైవేట్ వ్యక్తులకే చెందుతుందని అఫిడవిట్ దాఖలు చేశారు. దీంతో సదరు భూమి ప్రైవేటు వ్యక్తిదేనని హైకోర్టు తీర్పునిచ్చింది. అటవీ శాఖ హైకోర్టు తీర్పుపై 2021 మే నెలలో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవు పిటిషన్ ఫైల్ చేసింది. సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌పై వాదనలు విన్న అనంతరం మరోమారు కలెక్టర్ నుంచి అఫిడవిట్ కోరింది. అయితే కలెక్టర్ ఈ భూమి సదరు ప్రైవేటు వ్యక్తికే చెందుతుందని అఫిడవిట్ సమర్పించారు. అటవీశాఖ ఆ భూమి తమదని వాదిస్తుంటే, కలెక్టర్ ఆ భూమి ప్రైవేట్ వ్యక్తిదేనని చెప్పడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపింది. సీఎస్ దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇంతలో రాష్ట్రంలో సర్కారు మారడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసుపై దృష్టి సారించారు. సుప్రీం కోర్టులో కలెక్టర్ సమర్పించిన అఫిడవిట్‌ను ఉపసంహరింపజేశారు. ఈ భూమి ఫారెస్ట్‌కు చెందినదేనని ఫిబ్రవరి 8న సీఎస్ అఫిడవిట్ దాఖలు చేశారు. దీంతో సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. 106 ఎకరాల ఈ భూమి అటవీ శాఖకే చెందుతుందని స్పష్టం చేస్తూ తీర్పునిచ్చింది. కాగా, హైకోర్టు తన పరిధిని దాటి వ్యవహరించిదని, కనీసం తనదిగా నిరూపించుకోలేని వ్యక్తికి 106 ఎకరాల అటవీ భూమిని గిఫ్ట్‌గా ఇచ్చిందని సుప్రీంకోర్టు చివాట్లు పెట్టింది. ఈ కేసులో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా అఫిడవిట్‌లను దాఖలు చేసిన అధికారులపై దర్యాప్తు జరిపి, చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆక్రమణదారుపై, ప్రభుత్వంపై రూ.5 లక్షల చొప్పున జరిమానా విధించింది. ఆక్రమణదారులతో చేతులు కలిపిన అధికారులపై విచారణ జరిపి, వారి నుంచి ప్రభుత్వం జరిమానా రికవరీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.

మరో కేసులో రాహిల్ అరెస్ట్‌కు సన్నాహాలు

- స్టే ఎత్తివేయాలని హైకోర్టులో పోలీసుల పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు, ప్రజాభవన్ ర్యాష్ డ్రైవింగ్ కేసులో ప్రధాన నిందితుడు రాహిల్ అమీర్ అలియాస్ సాహిల్‌ను మరో కేసులో అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. 2022లో జూబ్లీహిల్స్ జరిగిన ప్రమాదంలో వేగంగా కారు నడపడం వల్ల రోడ్డుపక్కన ఉండే ఓ చిన్నారి మృతి చెందడంతోపాటు మరో మహిళ తీవ్రంగా గాయపడ్డ సంఘటనలో ఆయనను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. ఆ కేసులో తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని రాహిల్ ఈ నెల 10 హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. జూబ్లీహిల్స్ రోడ్డు ప్రమాదం కేసులో రాహిల్ ఇప్పటి వరకు నిందితుడిగా లేడు కాబట్టి అరెస్ట్ చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులను ఎత్తేయాలని కోరుతూ రాష్ట్ర హోంశాఖ ఈనెల 18న వెకేట్ స్టే పిటిషన్ దాఖలు చేసింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తమ నిర్ణయాన్ని ఈ నెల 22న వెల్లడిస్తామని పేర్కొంది.

ఉపాధి హామీ డబ్బు కోసం కత్తితో గొంతు కోశారు

- ఆదిలాబాద్ జిల్లాలో మహిళపై హత్యాయత్నం

ఇచ్చోడ, ఏప్రిల్ 20 : ఉపాధి పనులు చేసుకుని ఓ మహిళ సంపాదించుకున్న రూ.10 వేలు కాజేసేందుకు ఇద్దరు యువకులు కత్తితో ఆమె గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో గాయపడి శివరాత్రి నర్సమ్మ(55) అనే మహిళ ఆస్పత్రి పాలైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇచ్చోడ మండలం బోరిగామ గ్రామానికి చెందిన నర్సమ్మకు ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.10 వేలు శుక్రవారం అందాయి. అదే గ్రామానికి చెందిన బొర్ర విజయ్, ఇనాజ్ షేక్ అహ్మద్ అనే యువకులు ఆ డబ్బుపై కన్నేశారు. ఆ డబ్బు కోసం శనివారం తెల్లవారుజామున నర్సమ్మ ఇంటికి వెళ్లి తలుపులు కొట్టారు. ఆమె తలుపు తీయడంతోనే దాడి చేసి కత్తితో ఆమె గొంతుపై కోసి ఆ తర్వాత భయపడి పారిపోయారు. నర్సమ్మ అక్కడే స్పృహ కోల్పోగా పక్కింటిలో ఉండే ఆమె అల్లుడు సునీల్ గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించాడు. ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్న నర్సమ్మ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ కుల అస్తి పట్టింపు లేదు / కమ్మ / 40y/5'5" / డైవర్సీ / డిగ్రీ / ఓన్ బిజినెస్ / పిల్లలు లేరు / మంచి ఆస్తి గల అందమైన వధువుకు జాబ్ or బిజినెస్ వరుడు కావలెను. వాట్సాప్ :7661936719 AJH-002361

★ 60y / రెండవ పెళ్ళి / విడో/ Fair / Govt.Retd/ పిల్లలు లేరు / సొంత ఇల్లు, వ్యవసాయ భూములు / ఎలాంటి బాదర బందీలేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. ఫోన్:9030858258 AJH-002197

★ 58y / రెండవ పెళ్ళి / విడో/ Fair / Govt. ఫ్యామిలీ పెన్షన్ /సొంత ఇల్లు రెంట్స్ / పిల్లలు లేరు / ఏలాంటి బాదర బందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల / ఆస్తి పట్టింపు లేదు) ఫోన్:7995376608 AJH-002197

★ కుల అస్తి పట్టింపు లేదు / కమ్మ / 43y/5'6" / లేట్ మ్యారేజ్ / MBBS డాక్టర్ / మంచి ఆస్తి గల అందమైన వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 8367535053 AJH-002361

★ బ్రాహ్మణ /27y/5'4" / డిగ్రీ/ Pvt జాబ్ / మంచి జీతం / అందమైన వధువుకు జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్ : 9701743336 AJH-14284

★ కాపు / లేట్ మ్యారేజ్ /33y/Caste No Bar / ఆస్తి పట్టింపు లేదు /5'5"/B.Tech / మంచి ల్యాండ్ / సూపర్ మార్కెట్ / బిజినెస్‌లు ఉన్న వధువుకు జాబ్ ఉన్న హిందూ రిలీజియన్ వరుడు కావలెను. వాట్సాప్ నెం.8297348764 AJH-14284

★ రెడ్డి / 26y / 5'5" / B.Com ★ కాపు / 26y / 5'4" / MBBS / ★ కమ్మ / 30y / 5'6" / B.Tech అందమైన వధువులకు వెల్ సెటిల్డ్ జాబ్ / బిజినెస్ వరులు కావలెను. ఫోన్ : 6304448107 AJH-14284

★ రెడ్డి / 35y / 5'5" /ఫెయిర్ / కుల పట్టింపు లేదు / M.A. English / Govt. ఎంప్లాయి / మంచిజీతం, వెల్ సెటిల్డ్ & సొంత ఇల్లు కల వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8008474869 AJH-14284

★ కమ్మ / B.Tech/ Govt. మెడికల్ & హెల్త్ సర్వీస్ / అడ్మినిస్ట్రేషన్ గ్రూప్-1 ఆఫీసర్ / మంచి జీతం / 5'4" ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 9618579861 AJH-14284

★ కుల అస్తి ప్రసక్తి లేదు /విడో/ 50y /Hyderabad /Andhra / Govt. Employee / Good Salary / 1 Girl Settled / Own House / Rents / Lands / . అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8374476725 AJH-002197

★ కుల పట్టింపు లేదు/ 21y & 23y & 25y & 27y &29y & 31y &33y & 35y &37y & 39y &40y & 42y &44y & 45y &46y & 48y &50y & 52y &55y & 57y &59y & 60y & 62y & 63y "హ సే" (Since 1998):PH/WA:9291503949 AJH-002197

★ పద్మశాలి, వైశ్యాస్, రాజులు : 1st మ్యారేజ్, 2వ పెళ్లి, వయస్సు 27 To 38 సంవత్సరాలు, సొంత ఇల్లు ఉన్న వారికి వరులు కావలెను. సెల్ : 9652624005 AJL_180486

★ రెడ్డి విడో (కుల, అస్తి ప్రసక్తి లేదు)/A:30, H:5.5, Qly: B.Com, Own Shops, Agriculture Land గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1st or 2nd. Ph: 9666327616 AJH-002192

★ కమ్మ(చౌదరి): వయస్సు 26 సం॥రాలు డిగ్రీ, ప్రైవేట్ జాబ్, అలాగే 27 సం॥రాలు B.Tech సాఫ్ట్‌వేర్ అమ్మాయిలకి ఆంధ్ర, తెలంగాణాలో ఉన్న వారికి వరులు కావలెను. సెల్: 9652624005 AJL_180486

★ బ్రాహ్మణ 27y/5'4"/ 1st మ్యారేజ్ Qua: 7th Class. No Job, 2nd మ్యారేజ్ also OK. పౌరోహితం also OK. వరుడు కావలెను. Ph: 8978808244 AJH-002192

★ పద్మశాలి/ కుల పట్టింపు లేదు / 48y/Central Govt.Job / వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (2వ సంబంధమైనా ఓకే) ఫోన్ : 9676896226 AJH-002192

★ బలిజ, కాపు: 1st మ్యారేజ్, డిగ్రీ, సొంత ఇల్లు, బిజినెస్, 5M స్థిరాస్తి ఉన్న అమ్మాయి లకి ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. సెల్: 9652624005 AJL_180486

★ కాపు/50y/నెల్లూరు /రెండవపెళ్ళి/ విడో / కుల పట్టింపు లేదు / ఓన్ హౌస్ / రెంట్స్ / వధువుకు సెటిల్డ్ వధువుకి FC/BC వరుడు కావలెను. ఫోన్ : 8328415988 AJH-002198

★ కుల పట్టింపు లేదు / విడో / 56 Y / గవర్నమెంట్ డాక్టర్ / మంచి జీతం/ నో చిల్డ్రన్ / ఓన్ అపార్ట్‌మెంట్ / రెంట్స్ / ఓన్ హాస్పిటల్ / మంచి ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. సంప్ర. 6303745093 AJB-38

★ రెడ్డి, గౌడ్స్: మొదటి సంబంధం వయస్సు 25 To 45 సం॥ డిగ్రీ, సొంత ఇల్లు, వ్యవసాయం, స్థిరాస్తి ఉన్న అమ్మాయిలకి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్: 9652624005 AJL_180486

వధువు కావలెను



★ ఎస్సీ మాల /28y / 6'1" / M.Sc.,-IT/PVT JOB (HYD) / స్థిరాస్తులు కలిగిన అందమైన వరునకు వధువు కావలెను. కులం, అస్తి పట్టింపు లేదు. ఫోన్ : 8500577779 AJH-002361

★ యాదవ /31y /5'8" / M.Tech (NIT)/ గెజిటెడ్ Govt. AEE/ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ / మంచి జీతం / వరునకు వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్ కాంటాక్ట్ ఫోన్ : 9059354476 AJH-002361

★ 2వ పెళ్ళి/ కుల ప్రసక్తి లేదు / MBA / Job in TCS / Good Salary / 5'8" ఎత్తు / 44 సం.ల పిల్లలు లేని వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-14284

★ కుల ప్రసక్తి లేదు/ MBA / C.Govt బ్యాంక్ ఆఫీసర్ (బ్యాంక్ ఆఫ్ బరోడా) / మంచి జీతం/ 5'8" ఎత్తు / 31 సం.ల వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-14284

★ గౌడ/ CA / చార్టెడ్ అకౌంటెంట్ / Asst. మేనేజర్ / అకౌంట్స్ Dept. / Good Salary / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 7032058965 AJH-14284

★ బలిజ/ 35y/మొదటి పెళ్ళి / ఫెయిర్ / డిగ్రీ / కంప్యూటర్ ఆపరేటర్ & మెడికల్ ఏజెన్సీ / కరీంనగర్‌లో సొంత ఇల్లు గల వరునకు వధువు కావలెను. డైరెక్ట్ : 9440378427 AJH-002197

★ పద్మశాలి/ కుల పట్టింపు లేదు /36y/5'5" మంచి జీతం / రెండు సొంత ఇండ్లు / కిరాయిలు గల వరునికి తల్లి ప్రసక్తి లేని / జాబ్ ఉన్నా, లేని వధువు కావలెను. డైరెక్ట్ - 9398365661 AJH-002197

★ కాపు/ విడో /Age : 43 / కుల పట్టింపు లేదు / One House / Well Settled / Business / ఏ బాదరబందీలేని వరునికి వధువు కావలెను. Call – 8125076013 AJH-002192

★ కమ్మ :60Y, 5'6", M.Com, B.Ed, Pvt.Job, Guntur (Dt), ఇల్లు, పొలము కలదు. 40-50 సం॥ల వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ Cell : 82977 69680, W: 83281 56964. AJG-184186

★ ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. 1వ ఆర్యవైశ్య అబ్బాయి 35, M.Sc., M.Ed., ప్రైవేట్ లెక్చరర్, జూ.డిగ్రీ, నల్లగొండ, వీరయ్య M.9H.B, మునుగోడ్ రోడ్ సెల్: 9121325068 AJY_134943

కళ్యాణ వేదిక

★ కమ్మ, కాపు, కులాల సాఫ్ట్‌వేర్, డాక్టర్స్ ఎంప్లాయిస్ మావద్ద కలరు. అమెరికా, లండన్, దుబాయ్, ఆస్ట్రేలియా లో జాబ్ చేస్తున్న యువతులు యువకులు మావద్ద కలరు. హైదరాబాద్, బెంగుళూరు, పూనే లో పనిచేయుచున్న వారు కావలెను. బిజినెస్ చేయువారు మంచి ప్రాపర్టీ కలవారు కలరు. Second Marriage సంబంధములు మా ప్రత్యేక. కొలాని వ్యాలీ లైన్ శాలిగ్రామం 9912711669. AJN:178894

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల swe/Govt/Doctors/MNC/Matches/Late & 2nd Matches కై సంప్ర: Ph: 9704656103 / 9533608887 (whatsapp) AJH-002197

★ రజక వివాహ వేదిక: (Estd-1994) డాక్టర్స్, ఇంజనీర్స్, Govt. jobs ABROAD / సంబంధాలకై సంప్ర: కొట్ల శ్రీనివాస్. Ph: 8106303155 / 9391265304 AJH-002197

★ యునైటెడ్ కమ్మ మాట్రిమోని కేవలం కమ్మవారి వివాహ సంబంధముల కొరకు సంప్రదించండి. ఇండియా, అబ్రాడ్ 1st & 2nd వివాహ సంబంధముల కొరకు సెల్ : 94 9444 1219, 77 99 44 9102 AJB-182079

★ యూనివర్సల్ మాట్రిమోని అన్ని కులముల వారికి ఇండియా మరియు అబ్రాడ్ 1st & 2nd వివాహ సంబంధముల కొరకు సంప్రదించండి. సెల్ : 888 60 18 188 AJB-182080

★ గుడె వెంకటప్పయ్య చౌదరి, కమ్మ వధూవరుల వివాహ వేదిక కమ్మ వారికి మాత్రమే. కానూరు, విజయవాడ & చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్. సంప్ర. 94401 53991 AJB-181894

★ పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ : తెనాలి (గుంటూరు జిల్లా) వారి 13వ వివాహ పరిచయవేదిక కార్యక్రమము 28-04-2024, ఆదివారము ఉదయం 9 గంటల నుండి ఫోన్ : 99639 24665 / 98498 51322 AJT - 6224

స్నేహ మ్యారేజ్ బ్యూరో
(కమ్మవారికి మాత్రమే)

HEAD OFFICE : #11-160, గద్దం రత్తయ్యవీధి, Near Time హాస్పిటల్, అశోక్‌నగర్, VJA-7: 99481 29111, 99481 29222
Branch Office : Hyderabad : 87905 99799, 99510 32647 Khammam, Vizag, Rajhamundry
www.snehamarriage.com. 87905 99799 (whatsapp)

వరుడు కావలెను

కమ్మ : 31, 5.4, DM Gastro 50Cr ★ 31, 5.7, DM Neurology 40Cr ★ 31, 5.6, DM Cardiology 30Cr ★ 9666658789

కమ్మ : 30, 5.4, MS OBG IVF 100Cr ★ 30, 5.3, MS OBG 50Cr ★ 30, 5.7, MS OBG 25Cr ★ 9848897778

కమ్మ : 28, 5.6, MS OBG IVF 100Cr ★ 27, 5.5, MS OBG 50Cr ★ 27, 5.2, MS OBG 20Cr ★ 27, 5.6, MD Radiology 25Cr ★ 8978217967

కమ్మ : 27, 5.4, MD GM 20Cr ★ 27, 5.6, MD GM 15Cr ★ 25, 5.4, MD GM 20Cr ★ 28, 5.8, MD Emergency Medicine 50Cr ★ 8374539819

కమ్మ : 28, 5.4, MD Radiology 20Cr ★ 28, 5.6, MD Pulmology 60Cr ★ 28, 5.7, MS GS 30Cr ★ 28, 5.4, MD Radiology 30Cr ★ 9848754267

కమ్మ : US Citizen Doctors : 28, 5.6, MD Internal Meicine 50Cr ★ 28, 5.5, MD Internal Medicine 50Cr ★ 29, 5.4, MD Internal Medicine 300K, 25Cr ★ 9948129111

కమ్మ : 29, 5.6, MD Internal Medicine 300K 50Cr ★ 31, 5.7, MD Internal Medicine 350K 40Cr ★ 31, 5.8, MD Internal Medicine 340K 20Cr ★ 9666658789

కమ్మ : Australi Citizens : 28, 5.6, MD Medicne 200Cr ★ 26, 5.5, MD Medicine 20Cr ★ 27, 5.4, MD Medicine 50Cr ★ 9848897778

కమ్మ : UK Doctor : 28, 5.7, BDS 80UK Pounds 10Cr ★ 27, 5.6, BDS 20Cr ★ 28, 5.5, BDS 30Cr ★ 28, 5.6, BDS 50UK Pounds 25Cr ★ 8978217967

కమ్మ : UK Doctor : 26, 5.7, BDS 10Cr ★ 26, 5.5, BDS 20Cr ★ 28, 5.2, BDS 15Cr ★ 27, 5.6, BDS 10Cr ★ 9948129222

కమ్మ : Divorce : 32, 5.5, MD Radiology 30LPA 60Cr ★ 34, 5.3, MD Radiology 100Cr Own Hospital Hyd ★ 30, 5.4, MD Radiology 100Cr ★ 9848754267

కమ్మ : Divorce : 34, 5.3, MD GM 36LPA 50Cr ★ 35, 5.5, MD Dermotology 50Cr ★ 36, 5.4, MS OBG IVF 40LPA 50Cr ★ 9948129111

కమ్మ : 27, 5.6, MS, Stamford 200K 20Cr ★ 28, 5.6, MS Harvard 250K, 25Cr ★ 28, 5.3, MS Harvard 295K 30Cr ★ 98488 97778

కమ్మ : 28, 5.5, MS 170K 20Cr ★ 28, 5.8, MS 200K Amezon 30Cr ★ 28, 5.5, MS 285K Amezon 10Cr ★ 8978217967

కమ్మ : 28, 5.4, 160K, Google 20Cr ★ 28, 5.3, MS Stamford 300K, Amezon 50Cr ★ 28, 5.7, MS 150K, 25Cr ★ 28, 5.5, MS 170K 10Cr ★ 9948129111

కమ్మ : 28, 5.4, MS, 170K, Facebook 20Cr ★ 28, 5.6, MS, 165K 20Cr ★ 28, 5.6, MS, 115K, 15Cr ★ 29, 5.9, MS, 150K, 20Cr ★ 9848754267

కమ్మ : 29, 5.4, MS, Harvard 325K 100Cr ★ 29, 5.4, MS Stamford, 270K, 50Cr ★ 29, 5.6, MS, Stamford 250K, 60Cr ★ 9666658789

కమ్మ : India MS : 32, 5.6, MS Harvard 1000Cr Own Industry, BNG ★ 32, 5.7,MS 1500Cr, Own Industry BNG అందమైన వధువులకు Well Settled Business వరుడు కావలెను BNG ★ 9542016659

కమ్మ : 30, 5.4, B.Tech, MBA, 40LPA 50Cr ★ 30, 5.5, B.Tech, MBA, 36LPA, 20Cr ★ 30, 5.4, B.Tech, MBA, 22LPA, 50Cr ★ 9948129222

కమ్మ : 27, 5.6, B.Tech, MBA, 18LPA 15Cr ★ 28, 5.6, B.Tech, MBA, 20LPA 10Cr ★ 28, 5.3, B.Tech MBA Micro Software 40LPA 10Cr ★ 8978217967

కమ్మ : 28, 5.5, M.Tech, 36LPA, 50Cr ★ 29, 5.6, M.Tech, 36LPA, 10Cr ★ 30, 5.2, M.Tech 18LPA, 10Cr ★ 9848897778

కమ్మ : 28, 5.6, IIIT, 20LPA 100Cr ★ 30, 5.4, IIT Rurki, Amezon 30LPA 25Cr ★ 32, 5.3, NIT Ruurkela Bits pilani 36LPA, 40Cr ★ 9666658789

కమ్మ : 24, 5.7, BSC 10Cr ★ 25, 5.4, BSC 15Cr ★ 27, 5.7, BA 2Cr ★ 29, 5.4, B.Com, 15Cr ★ 9848754267

కమ్మ : 29, 5.4, M.Tech, 30LPA, 100Cr ★ 25, 5.3, B.Tech, 50Cr ★ 27, 5.4, B.Tech, 20LPA 50Cr ★ 28, 5.7, B.Tech, 60LPA, 85Cr ★ 9948129111

వధువు కావలెను

కమ్మ : 27, 5.11, MS Stamford 250K, 50Cr ★ 28, 5.9, MS Stamford 200K, 50Cr ★ 28, 5.10, MS Harvard 225K, 50Cr ★ 9542016659

కమ్మ : 28, 6.1, MS PH Harvard 200K 30Cr ★ 28, 6, MS, 170K, 10Cr ★ 28, 5.11, MS 160K, 20Cr ★ 28, 5.11, MS, 115K, 25Cr ★ 9666658789

కమ్మ : 29, 6, MS Harvard 300K, 100Cr ★ 29, 5.9, MS, 170K, 15Cr ★ 29, 5.11, MS 230K Amezon 15Cr ★ 8978217967

కమ్మ : 29, 5.11, MS, 180K, Google 15Cr ★ 29, 5.10, MS, 160K, Facebook 20Cr ★ 30, 5.7, MS, 240K, Amezon 30Cr ★ 9848897778

కమ్మ : India MS : 29, 5.11, MS, Stamford 1000Cr ★ 30, 6.1, MS Harvard 2000Cr Own Business చేయుచున్న అందమైన వరులకు అందమైన వధువు Bengalore వధువు కావలెను. ★ 9848897778

కమ్మ : 29, 5.11, IIT KGP, MBA, IIM, AHM 400Cr ★ 29, 5.10, IIT, Mumbai 60LPA 100Cr ★ 29, 6, IIT, Kanpur, MBA, IAM Kochipudi, 70LPA, 50Cr ★ 9948129222

కమ్మ : 29, 6, IIT Guwahati 72LPA 50Cr ★ 27, 6.1, IIT Chennai, 45LPA 40Cr ★ 31, 6, IIT Mumbai 40LPA 30Cr ★ 9666658789

కమ్మ : 28, 5.8, B.Tech, MBA, 25LPA, 20Cr ★ 28, 5.10, B.Tech, MBA, 20LPA, 40Cr ★ 28, 5.8, B.Tech, MBA, 15LPA 30Cr ★ 9848897778

కమ్మ : 28, 5.11, BITS pilani 36LPA 20Cr ★ 29, 5.11, NITS 30LPA, 10Cr ★ 30, 6, MIT 40LPA, 50Cr ★ 8978217967

కమ్మ : 29, 6, CA, 25LPA 30Cr ★ 30, 5.10, CA, 22LPA, 20Cr ★ 30, 6, CA, 36LPA, 40Cr ★ 32, 6.1, CA, 28LPA, 15Cr ★ 99481 29222

కమ్మ : Divorce : 31, 5.10, IIT, Mumbai, 40LPA, 20Cr ★ 33, 6, IIT, Mumbai 60LPA, 50Cr ★ 34, 5.11, IIT KGP MBA IIM CAL 70LPA, 70Cr ★ 9948129111

కమ్మ : 28, 5.10, MCH Surgical Oncology 100Cr ★ 28, 5.10, MCH Neuro Surgen 50Cr ★ 28, 5.7, MCH Plastic Surgen 50Cr ★ 9948129222

కమ్మ : 29, 5.10, DM Cardiology 200Cr ★ 30, 5.9, DM Neurology 50Cr ★ 30, 5.11, DM Nephrology CMC 50Cr ★ 9848897778

కమ్మ : 30, 5.11, MCH, Surgical 100Cr ★ 30, 6, DM, Cardiology 100Cr ★ 30, 5.11, DM Neonatology 50Cr ★ 9542016659

కమ్మ : 30, 6, MS Ortho 100Cr ★ 30, 5.9, MS Ortho 50Cr ★ 30, 6, MS Ortho 25Cr ★ 9951032647

కమ్మ : 29, 6, MD Radiology 50Cr ★ 32, 6, MD Radiology 60Cr ★ 32, 5.11, MD Radiology 40Cr ★ 95420 16659

కమ్మ : 30, 5.6, MDS, 20LPA, 50Cr ★ 30, 6.1, MDS 18LPA 20Cr ★ 31, 6.2, MDS 20LPA, 30Cr ★ 30, 5.11, MDS 24LPA 10Cr ★ 9666658789

కమ్మ : US Citizen Doctor : 29, 5.11, MD Internal Medicine 100Cr ★ 30, 6, MD Internal Medicine 260K, 50Cr ★ 32, 6, MD Internal Medicine 250K, 50Cr ★ 9542016659

కమ్మ : US Citizen Doctors : 33, 6, MCH Surgical Oncology 450K, 150Cr ★ 33, 5.11, DM Cardiologyu 400K 50Cr ★ 34, 5.10, MCH, Neurology 400K, 100Cr ★ 9848897778

కమ్మ : Australia Citizen Doctors : 30, 6, MBBS, MD Medicine 50Cr ★ 33, 6, DM Cardiology 400 AU Dollar 20Cr ★ 34, 5.10, MCH Neurology 350 AU Doller 30Cr ★ 9948129111

కమ్మ : UK Doctor PR : 33, 5.11, MBBS MS GS Gold Medalist MCH Surgical Oncology Oxford University 200UK Pounds 100Cr ★ 9848754267

కమ్మ : Divorce : 34, 6, DM Cardiology 16LPA 200Cr ★ 34, 6.1, MCH Surgical Oncology 15LPA 100Cr ★ 35, 5.11, MCH Westro Surgeon CMC 16LPA 50Cr ★ 9948129222

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

• ఆర్కే RK



కొత్తపలుకు

న్యాయవ్యవస్థ గౌరవం తగ్గేలా..!

వ్యూహాలైనా, పథకాలైనా రాజకీయాల్లో ఒక్కసారే ఉపయోగపడతాయి. ఒక ఎన్నికల్లో అమలు చేసిన వ్యూహాన్నే మరో ఎన్నికలో కూడా అమలు చేస్తే ఫలితాన్ని ఇవ్వదు. ప్రజలను ఆకర్షించే పథకాలు కూడా అంతే! అమలులో ఉన్న పథకాలను తమ హక్కుగా ప్రజలు భావిస్తారు. 2019 ఎన్నికల్లో బాబాయ్ హత్య కోడి కత్తి కేసు జగన్మోహన్ రెడ్డికి ఉపయోగపడ్డాయి. ప్రస్తుత ఎన్నికల్లో అదే బాబాయ్ హత్య కేసు ఆయనకు రాజకీయంగా ఎంతో కొంత నష్టం కలిగించబోతోంది. దీంతో వైసీపీ నాయకుడు ఒకరు కడప న్యాయస్థానాన్ని ఆశ్రయించి బాబాయ్ హత్య కేసు గురించి డాక్టర్ సునీత, వైఎస్ షర్మిలతో పాటు ప్రతిపక్ష నాయకులు ఎవరూ ఆరోపణలు చేయకుండా స్టే తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా న్యాయస్థానం తన పరిధిని అతిక్రమించింది. ఆ విషయం తర్వాత చర్చించుకుందాం! గత ఎన్నికల్లో కోడి కత్తి తరహాలో ఇప్పుడు గులకరాయి కేసును జగన్ అండ్ కో తెర మీదకు తెచ్చారు. విజయవాడలో బస్సుయాత్ర సందర్భంగా జనంలో నుంచి ఎవరో చిన్న రాయి విసరగా అది తగిలి జగన్మోహన్ రెడ్డి ఎడమ కంటి పైన స్వల్పంగా గాయమైంది. అంతే... ముఖ్యమంత్రిని హత్య చేయడానికి చంద్రబాబు అండ్ కో కుట్ర పన్నారని వైసీపీ నాయకులు మూకుమ్మడిగా ఆరోపించారు. గాయం చిన్నదే అయినా కుట్లు వేశారని చెప్పుకొన్నారు. నిజానికి వైద్యులు కుట్లు వేయాలంటే గాయం లోతుగా ఉండాలి. మనం చూసిన దాని ప్రకారం ముఖ్యమంత్రి గాయం లోతుగా లేదు. అయితే ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించినట్టు ఫొటోలు దిగి ప్రచారం చేసుకున్నారు. కోడి కత్తి ఘటన సందర్భంగా ఇలాగే కుట్లు వేశామని చెప్పుకొన్న వైద్యుడికి జగన్ ప్రభుత్వంలో పదవి కట్టబెట్టారు. గులక రాయి ఘటన జరిగి వారం రోజులవుతోంది. అయినా ముఖ్యమంత్రి జగన్ కంటి పైభాగంలో బ్యాండెయిడ్ వేయించుకొని జనంలో తిరుగుతున్నారు. మనబోటి వాళ్లకు అలాంటి గాయమై ఉంటే ఈపాటికి ఎప్పుడో మానిపోయి ఉండేది. జగన్‌రెడ్డికి ప్రజల సానుభూతి కావాలి కనుక ఎన్నికల ప్రచారం జరిగినన్ని రోజులూ నుదిటిపై ఆ పట్టీ అలాగే ఉండవచ్చు. కోడి కత్తి సంఘటన జరిగినప్పుడు విజయసాయిరెడ్డి వంటి వారు మీడియాతో మాట్లాడుతూ, కోడి కత్తి కొంచెం లోతుగా దిగి ఉంటే జగన్ ప్రాణం పోయుండేదని చెప్పుకొచ్చారు. అప్పుడు జనం కూడా కొంత వరకు నమ్మారు. జగన్ కూడా హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి కుట్లు వేయించుకున్నారు. ఎన్నికల తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. ఇప్పుడూ అదే ఎత్తుగడతో గులక రాయి కేసును ఎత్తుకున్నారు. అయితే ఇప్పుడు జగన్ ఆశించినట్టు ప్రజల్లో సానుభూతి ఏర్పడక పోగా, మరో డ్రామాకు తెర లేపారని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఒకే వ్యూహం పదే పదే పనిచేయదనడానికి గులక రాయి సంఘటనే నిదర్శనం.

> ఎక్కడో పులివెందులలో వివేకానంద రెడ్డిని నరికి చంపితే మాకొచ్చిన నష్టం ఏమిటి? అని ప్రజలు భావించడాన్ని మించిన దౌర్భాగ్యం ఉంటుందా? రేపు తమకు కూడా అదే గతి పడితే పరిస్థితి ఏమిటి? అని ఆలోచించకుండా చేయడమే జగన్ అనుసరిస్తున్న క్లాస్ వార్ లక్ష్యం. డాక్టర్ సునీత ఐదేళ్లుగా అలుపెరుగని పోరాటాన్ని చేస్తున్నప్పటికీ ఆమెను అభినందించక పోగా విమర్శిస్తున్న వాళ్లు ఉన్నారంటే అందుకు జగన్ అమలు చేస్తున్న మోడల్ కారణం కాదా? విషాదమేమిటంటే వైఎస్ కుటుంబంలో రాజారెడ్డిని దారుణంగా హత్య చేశారు. ఆయన కుమారుడైన రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దారుణ పరిస్థితుల్లో మరణించారు. శరీర భాగాలు కూడా సరిగ్గా దొరకలేదు. ఐదేళ్ల క్రితం రాజశేఖర రెడ్డి సోదరుడైన వివేకానంద రెడ్డిని అత్యంత కిరాతకంగా నరికి చంపారు. అధికారంగానీ, డబ్బుగానీ ఈ చావులను నివారించ లేదే? పులివెందుల రక్తచరిత్ర కాదా ఇది?

ఆహా ఏమి నటన...

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నవరస నటనాసార్వభౌముడు అన్న బిరుదు ఇవ్వవచ్చు. ముఖంలో దీనత్వం, క్రూరత్వాలను ఏకకాలంలో ప్రదర్శించగలరు. జనంలోకి వెళ్లినప్పుడు ఒకలా, జనంలో లేనప్పుడు మరోలా ఉంటారని ఆయన చుట్టూ ఉన్న వాళ్లు చెబుతారు. గత ఎన్నికల్లో తండ్రిని కోల్పోయిన బిడ్డను అని, తండ్రి రాజశేఖర రెడ్డిని హత్య చేయించారని ప్రచారం చేసి ప్రజల సానుభూతిని పొందారు. అప్పుడు ఆయనకు తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల వంతపాడారు. మద్దతుగా ప్రచారం చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇడుపులపాయ అంతఃపురానికి బీటలు వారాయి. తల్లీ చెల్లీ దూరమయ్యారు. దీంతో ప్రజలను మరో మారు మాయచేయడానికై 'నేను ఒంటరి వాడిని, నాకు వ్యతిరేకంగా తోడేళ్ల గుంపు ఒక్కటైంది' అంటూ ప్రచారం చేస్తున్నారు. కమ్యూనిస్టులకు మాత్రమే పరిమితమైన క్లాస్ వార్ పదాన్ని కూడా అందిపుచ్చుకున్నారు. తాను పేదల ప్రతినిధినని, పేదలకోసమే తన తపన అంతా అని చెప్పుకొంటూ చంద్రబాబు అండ్ కోను పెత్తందారులని దూషిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నిజంగా ఒంటరి వారేనా? అయితేగియితే.. ఒంటరివాడు ఎలా అయ్యారో చూద్దాం! 2019 ఎన్నికల వరకు పార్టీకి అండగా ప్రచారం చేసిన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల ఇప్పుడెందుకు దూరమయ్యారో జగన్మోహన్ రెడ్డి నిజాయితీగా చెప్పగలరా? రాజశేఖర రెడ్డి బిడ్డగా ఆస్తిలోనూ, అధికారంలోనూ షర్మిలకు కూడా ఎంతో కొంత వాటా దక్కడం న్యాయం. అయితే ఇక్కడ షర్మిలకు న్యాయం జరగలేదు. ఆస్తిలోనే కాదు— అధికారంలో కూడా ఆమెకు వాటా దక్కలేదు. దీంతో ఒళ్లు మండిన షర్మిల సోదరుడిపై కత్తి దూశారు. ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన షర్మిల.. జగన్ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. షర్మిల సభలకు జనం కూడా పెరుగుతున్నారు. తన ఇద్దరు బిడ్డల దారులు వేరవడంతో ఎటువైపు వెళ్లాలో తేల్చుకోలేని సందిగ్ధంలో చిక్కుకున్న విజయమ్మ ఉభయ కుశలోపరిగా అమెరికాకు వెళ్లిపోయారు. ఈ పరిస్థితికి ప్రజలుగానీ, ప్రతిపక్ష నాయకులుగానీ, మీడియాగానీ కారణం కాదుగదా? అవునా? కాదా? అనేది జగన్మోహన్ రెడ్డే చెప్పాలి. మరి ఒంటరి వాడిని అని జనం ముందుకు వచ్చి ఏడవడం ఎందుకు? ఈ ఏడుపునకు అర్థం ఉందా? మరో సోదరి డాక్టర్ సునీత విషయమే తీసుకుందాం! తన తండ్రిని కిరాతకంగా నరికి చంపిన వారిని శిక్షించాలని మాత్రమే ఆమె కోరుతున్నారు. ఈ విషయంలో జగనన్న తమకు న్యాయం చేయకుండా నిందితులకు అండగా నిలబడటాన్ని ఆమె జీర్ణించుకోలేక పోతున్నారు. చిన్నాన్న చావును రాజకీయంగా వాడుకొని ఇప్పుడు నిందితులకు అండగా నిలవడం ఏమిటి? అని ఆమె ఆక్రోశిస్తున్నారు. ఆమె అలా ఎందుకు భావిస్తున్నారు? ఆమె ఆక్రందనలో హేతుబద్ధత ఉందా? లేదా? అని కనీసం పరిశీలించకుండానే అవినాశ్ రెడ్డి గురించి మాట్లాడ వద్దని జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక హుకుం జారీ చేశారు. ఆయన ఈ హుకుం జారీ చేయడం వెనుక కూడా పెత్తందారులు ఉన్నారా? సోదరి సునీతకు న్యాయం చేయకపోగా వివేకానంద రెడ్డిని డాక్టర్ సునీత భర్తే హత్య చేయించారని తన రోత మీడియాతో పాటు కూలి మీడియాలో జగన్‌రెడ్డి ప్రచారం చేయించారు. ఇందులో కూడా ప్రతిపక్షాల పాత్ర ఉందా? మాకంటే నీకు అవినాశ్ రెడ్డి ఎందుకు ముఖ్యమయ్యారని అక్కచెల్లెళ్లు వేస్తున్న ప్రశ్నకు జగన్మోహన్ రెడ్డి ఎందుకు సమాధానం చెప్పడం లేదో? పాపాల భైరవుడు చంద్రబాబు ఉన్నాడు అన్నట్టుగా అన్నిటికీ ఆయన వైపు వేలెత్తి చూపుతున్నారు. షర్మిల, సునీత వెనుక చంద్రబాబు ఉన్నది నిజమే అయితే, చంద్రబాబుకు అంత సామర్థ్యం ఉండి ఉంటే 2019 ఎన్నికల్లోనే, అధికారంలో ఉన్నప్పుడే వారిని తన వైపు తిప్పుకొని ఉండేవారు కదా? 'తనను తాను రక్షించుకోలేక పోతున్న చంద్రబాబు మమ్మల్ని ఏం రక్షిస్తాడు' అన్న డాక్టర్ సునీత మాటల్లో వాస్తవం ఉంది. ఇప్పుడు కూడా అందరూ కలసి తనను ఒంటరివాడిని చేశారని జగన్ చెబుతున్న మాటలను నమ్మదామా?

ఎలా పేదల ప్రతినిధి?

క్లాస్ వార్ గురించి, తాను పేదల ప్రతినిధినని జగన్మోహన్ రెడ్డి చెబుతున్న విషయాలకు వద్దాం. చరిత్రలో పేదల ప్రతినిధులం అని చెప్పుకొన్న నాయకులు, ముఖ్యంగా వామపక్ష నాయకులు సాదాసీదా జీవితాన్నే గడిపారు. జగన్మోహన్ రెడ్డి వలె తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, ఏపీలలో రాజ ప్రాసాదాలు నిర్మించుకోలేదు. వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకోలేదు. 2004కు ముందు తన వద్ద కోటి రూపాయలు కూడా లేని జగన్మోహన్ రెడ్డి ఈ 20 ఏళ్లలో ఆర్థికంగా ఇంతలా బలపడటం ఎలా సాధ్యమైంది? అధికారం అండ ఉండివుండకపోతే జగన్మోహన్ రెడ్డి ఇన్ని వేల కోట్లు సంపాదించగలిగే వారా? 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి రాకపోతే తనకు ఆత్మహత్య చేసుకోవడం మినహా మరో మార్గం లేదని వైఎస్ రాజశేఖర రెడ్డి ఇప్పుడు జగన్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న ఒకరి వద్ద వాపోవడం నిజం కాదా? గతంలో రాజశేఖర రెడ్డి, ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కలిపి పదేళ్లు అధికారంలో ఉన్నారు. 2004కు ముందు తలకు మించిన అప్పుల భారంతో ఉండిన వైఎస్ కుటుంబం ఇప్పుడు ఏ స్థాయిలో ఉందో చూస్తున్నాం. ఎగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన జగన్మోహన్ రెడ్డి ఇవాళ దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా ఎలా ఎదిగారు? ఆయన అనుసరించిన చిట్కా ఏమిటో చెబితే ప్రజలు కూడా కోటీశ్వరులు అయ్యేవారు కదా? అదే జరిగితే అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేసే అవసరం ఏర్పడదు కదా? తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు పంచానని చెప్పుకొంటున్న జగన్మోహన్ రెడ్డి, ఏ ఒక్క కుటుంబంలోనైనా వారి బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు నిల్వ ఉన్నాయని నిరూపించగలరా? పేదలను పేదలుగానే ఉంచుతున్న జగన్మోహన్ రెడ్డి పేదల ప్రతినిధి ఎలా అవుతారు? పేదలకు ఇళ్ల కోసం సెంటు స్థలం సరిపోతుందని చెబుతున్న జగన్, తాను మాత్రం ఎకరాలకు ఎకరాలలో ప్యాలెస్‌లు నిర్మించుకోవలసిన అవసరం ఏమిటో చెప్పగలరా? జగన్‌కు ఉన్నన్ని ఆస్తులు ఆయన చెబుతున్న పెత్తందారులకు లేవే? వేల కోట్ల రూపాయల విలువైన ప్యాలెస్‌లలో నివసించే జగన్‌రెడ్డిని పేదల ప్రతినిధి అని అంగీకరిద్దామా? అధికారం అండతో ఇన్ని వేల కోట్ల రూపాయలు సంపాదించిన జగన్‌రెడ్డి ఆపదలో ఉన్న ఏ ఒక్కరికైనా తన జేబులో నుంచి సొంత సొమ్ము తీసి ఇవ్వడాన్ని ఎవరైనా చూశారా? తన ముందుకు వచ్చి చేయి చాచిన వారికి రాజశేఖర రెడ్డి కాదనకుండా తన వద్ద లేకపోయినా అప్పు చేసి మరీ సహాయం చేసేవారు. ఈ లక్షణం జగన్‌లో ఉందని ఆయనకు చిడతలు కొడుతున్న వారు చెప్పగలరా? అయితే, జగన్‌రెడ్డిలో ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే, 'నన్నేమీ అడగవద్దు — ప్రభుత్వ సొమ్మును మాత్రం అందినంత దోచుకోండి' అని తన వాళ్లకు స్వేచ్ఛ ఇస్తారు. అందుకే ఈ ఐదేళ్లలో మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు ఎవరిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా కనీసం చర్యలు తీసుకొనే ప్రయత్నం కూడా చేయలేదు. నెల్లూరు జిల్లాలో ఫలానా మాజీ మంత్రి పలుగు రాయిని అడ్డగోలుగా తవ్వుకొని అక్రమంగా అమ్ముకుంటున్నారని పార్టీ ముఖ్యుడొకరు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. 'వదిలేయన్నా! మనకు పోయేది ఏముంది? చేతనైనంత సంపాదించుకోనివ్వండి!' అని ఆయన బదులిచ్చారట. తాను అనుసరిస్తున్న మోడల్‌నే ఇతరులు అనుసరించి సంపాదించుకోవడాన్ని జగన్ అనుమతిస్తున్నారు. అందుకే కొంత మంది ఆయనకు భక్తులుగా మారిపోయారు. అధికారులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ప్రయోజనాలు గాలికి పోయినా ఫర్వాలేదు— అందిన కాడికి దోచుకోండని తన వాళ్లకు జగన్ స్వేచ్ఛను ఇచ్చారు. తమ దోపిడీని ప్రజలు గుర్తించి ప్రశ్నించకుండా సంక్షేమం పేరిట వాళ్ల ముఖాన కూడా ఎంతో కొంత పడవేస్తున్నారు. ఇందులోని మర్మం తెలియని ప్రజలు అతని మాయలో పడకుండా ఉంటారా? అధికారం ఉన్నంత కాలం దోచుకుందాం... అధికారం పోతే పొరుగు రాష్ట్రాలకు పోదాం... ఇంకా అవసరమైతే విదేశాలకు వెళ్లిపోదాం! అనే ధోరణి జగన్ అండ్ కో లో కనిపిస్తోంది.

> ఐదేళ్ల పాలనలో ప్రజలకు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు పంచానని చెప్పుకొంటున్న జగన్మోహన్ రెడ్డి ఏ ఒక్క కుటుంబంలోనైనా వారి బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు నిల్వ ఉన్నాయని నిరూపించగలరా? పేదలను పేదలుగానే ఉంచుతున్న జగన్మోహన్ రెడ్డి పేదల ప్రతినిధి ఎలా అవుతారు?

అధికారులదీ అదే దారి...

జగన్ ప్రభుత్వంలో అధికారులు ఇలా ఎందుకు మారిపోయారని చాలామంది ఆశ్చర్యపోతుంటారు. పోలీసు శాఖనే తీసుకుందాం! ఆ శాఖలో ఎవరికి వారే స్వతంత్రులు. డీజీపీకి కూడా తన శాఖపై పట్టు ఉండదు. జిల్లాలలో ఎస్పీల నుంచి ఎస్ఐ వరకు స్వతంత్రులే. ఎవరిపైనా ఎవరికీ అదుపు లేదు. ఈ పరిస్థితులను స్వేచ్ఛగా భావిస్తున్న అధికారులు జగన్ సేవలో తరిస్తున్నారు. వ్యవస్థ కుప్పకూలితే ఏమవుతుందో ఊహించుకుంటే భయం ఏర్పడటం సహజం. ఈ ధోరణి వల్ల ఉన్మాదులు పుట్టుకొస్తున్నారు. జగన్ చెబుతున్న క్లాస్ వార్ వెనుక ఉన్న మర్మం ఇదే! ఇంతకంటే వంచన వేరొకటి ఉంటుందా?



ముసుగు తొలగే సరికి...

అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకం అని 'తాతా మనవడు' సినిమాలో ఒక పాట ఉంటుంది. అది అక్షరాలా నిజమని బాబాయ్ హత్య కేసులో జగన్మోహన్ రెడ్డి రుజువు చేస్తున్నారు. ఆయనకు అధికారం—డబ్బు మాత్రమే ముఖ్యం. మనుషులు, మమతలు కాదు అని చెప్పకనే చెబుతున్నారు. నియంతలు—దుర్మార్గుల గురించి జనం తెలుసుకోవడానికి కొంత సమయం పడుతుంది. హిట్లర్‌లోని నియంతను గుర్తించడానికి జర్మన్లకు టైమ్ పట్టింది. హిట్లర్ గురించి తెలుసుకొనేసరికి జర్మనీకి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. మన మధ్య తిరుగుతూ, మన ఓట్లతో అధికారం వెలగబెడుతున్న నియంతలు మారీచుల వలె రూపాలను మార్చుకుంటున్నారు. జర్మనైజేషన్ పీరియడ్ అన్న హిట్లర్ మాటలను జర్మన్లు విశ్వసించారు. చివరకు దారుణంగా నష్టపోయారు. తాను పేదల పెన్నిధినని, ఆ పేదల జీవితాలు బాగుపడాలంటే, వాళ్లకు మేళ్లు జరగాలంటే తనకు అధికారం ఇవ్వాలని అంటున్న జగన్‌ను కూడా నాటి జర్మన్లవలె మన ప్రజల్లోనూ కొందరు ఎంతో కొంత నమ్ముతున్నారు. ప్రజల బలహీనతలను ఔపోసనపట్టిన జగన్‌రెడ్డి వంటి వారే క్లాస్ వార్ సిద్ధాంతాన్ని తెర మీదకు తెస్తారు. 'మీరు చెబుతున్నది నిజమే అయితే వేల కోట్ల సామ్రాజ్యాన్ని మీరు ఎలా నిర్మించుకున్నారు? మేమెందుకు పేదలగానే మిగిలిపోయాం?' అని ఒకే ఒక ప్రశ్న వేస్తే జగన్‌రెడ్డి వంటి వారి నిజ స్వరూపం బట్టబయలు అవుతుంది. అమరావతి మాత్రమే రాజధానిగా ఉంటుందని 2019కి ముందు చెప్పిన జగన్‌రెడ్డి ఆ తర్వాత ఏం చేశారో చూశాం. ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తే మూడు రాజధానులు కడతారని నమ్మే పిచ్చివాళ్లు ఉంటే ఉండవచ్చు. జగన్‌కు కావాల్సింది అలాంటి వాళ్లే! అందుకే ప్రజలను శాశ్వతంగా ప్రభుత్వాలపై ఆధారపడేలా మార్చేస్తున్నారు. తనతోపాటు తన మనుషులు మాత్రం అపర కుబేరులు అవుతున్నారు. ఏదో ఒక రోజు జగన్ చెబుతున్న క్లాస్ వార్ గుట్టు బయటపడి ప్రజలు తిరగబడతారు. ఆ రోజు కోసం ఎదురు చూద్దాం!

> 2019 ఎన్నికల వరకు పార్టీకి అండగా ప్రచారం చేసిన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల ఇప్పుడెందుకు దూరమయ్యారో జగన్మోహన్ రెడ్డి నిజాయితీగా చెప్పగలరా? రాజశేఖర రెడ్డి బిడ్డగా ఆస్తిలోనూ, అధికారంలోనూ షర్మిలకు కూడా ఎంతో కొంత వాటా దక్కడం న్యాయం. అయితే ఇక్కడ షర్మిలకు న్యాయం జరగలేదు. ఆస్తిలోనే కాదు– అధికారంలో కూడా ఆమెకు వాటా దక్కలేదు. దీంతో ఒళ్లు మండిన షర్మిల సోదరుడిపై కత్తి దూశారు. ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన షర్మిల.. జగన్ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. షర్మిల సభలకు జనం కూడా పెరుగుతున్నారు. తన ఇద్దరు బిడ్డల దారులు వేరవడంతో ఎటువైపు వెళ్లాలో తేల్చుకోలేని సందిగ్ధంలో చిక్కుకున్న విజయమ్మ ఉభయ కుశలోపరిగా అమెరికాకు వెళ్లిపోయారు. ఈ పరిస్థితికి ప్రజలుగానీ, ప్రతిపక్ష నాయకులుగానీ, మీడియాగానీ కారణం కాదుగదా? అవునా? కాదా? అనేది జగన్మోహన్ రెడ్డే చెప్పాలి. మరి ఒంటరి వాడిని అని జనం ముందుకు వచ్చి ఏడవడం ఎందుకు? ఈ ఏడుపునకు అర్థం ఉందా?

ఎవరు రాసిన 'రక్త చరిత్ర'?

వివేకానంద రెడ్డి హత్య విషయానికి మళ్లీ వద్దాం! ఐదేళ్ల క్రితం జరిగిన ఈ హత్య వెనుక ఏం జరిగింది, ఎవరు ఉన్నారో ప్రజలందరికీ అవగతం అయింది. అయినా జగన్ అనుసరిస్తున్న క్లాస్ వార్ అనే మోడల్ కారణంగా ఎవరిని ఎవరు ఎందుకు హత్య చేశారో మాకు అవసరం లేదు — మాకేం వస్తుంది అన్న మానసిక దౌర్బల్యంలోకి ఒక వర్గం ప్రజలు వెళ్లిపోయారు. బాబాయ్ హత్య విషయంలో జగన్ అనుసరిస్తున్న వైఖరి గురించి ప్రజలకు తెలియక కాదు. ఎక్కడో పులివెందులలో వివేకానంద రెడ్డిని నరికి చంపితే మాకొచ్చిన నష్టం ఏమిటి? అని ప్రజలు భావించడాన్ని మించిన దౌర్భాగ్యం ఉంటుందా? రేపు తమకు కూడా అదే గతి పడితే పరిస్థితి ఏమిటి? అని ఆలోచించకుండా చేయడమే జగన్ అనుసరిస్తున్న క్లాస్ వార్ లక్ష్యం. డాక్టర్ సునీత ఐదేళ్లుగా అలుపెరుగని పోరాటాన్ని చేస్తున్నప్పటికీ ఆమెను అభినందించక పోగా విమర్శిస్తున్న వాళ్లు ఉన్నారంటే అందుకు జగన్ అమలు చేస్తున్న మోడల్ కారణం కాదా? విషాదమేమిటంటే వైఎస్ కుటుంబంలో రాజారెడ్డిని దారుణంగా హత్య చేశారు. ఆయన కుమారుడైన రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దారుణ పరిస్థితుల్లో మరణించారు. శరీర భాగాలు కూడా సరిగ్గా దొరకలేదు. ఐదేళ్ల క్రితం రాజశేఖర రెడ్డి సోదరుడైన వివేకానంద రెడ్డిని అత్యంత కిరాతకంగా నరికి చంపారు. అధికారంగానీ, డబ్బుగానీ ఈ చావులను నివారించలేదే? పులివెందుల రక్తచరిత్ర కాదా ఇది? చావులను రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే వాడుకుంటున్న రోజులు ఇవి. అవసరం తీరింది కనుక జగన్మోహన్ రెడ్డిని తన కుటుంబంలోని చావులు బాధించడం లేదు కాబోలు. ఇప్పుడు ఎవరితో అవసరం ఉందో వారి పక్షం వహిస్తున్నారు.

> జగన్ రెడ్డిలో ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే, 'నన్నేమీ అడగవద్దు – ప్రభుత్వ సొమ్మును మాత్రం అందినంత దోచుకోండి' అని తన వాళ్లకు స్వేచ్ఛ ఇస్తారు. అందుకే ఈ ఐదేళ్లలో మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు ఎవరిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా కనీసం చర్యలు తీసుకొనే ప్రయత్నం కూడా చేయలేదు. నెల్లూరు జిల్లాలో ఫలానా మాజీ మంత్రి పలుగు రాయిని అడ్డగోలుగా తవ్వుకొని అక్రమంగా అమ్ముకుంటున్నారని పార్టీ ముఖ్యుడొకరు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. 'వదిలేయన్నా! మనకు పోయేది ఏముంది? చేతనైనంత సంపాదించుకోనివ్వండి!' అని ఆయన బదులిచ్చారట. తాను అనుసరిస్తున్న మోడల్‌నే ఇతరులు అనుసరించి సంపాదించుకోవడాన్ని జగన్ అనుమతిస్తున్నారు. అందుకే కొంత మంది ఆయనకు భక్తులుగా మారిపోయారు. అధికారులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ప్రయోజనాలు గాలికి పోయినా ఫర్వాలేదు– అందిన కాడికి దోచుకోండని తన వాళ్లకు జగన్ స్వేచ్ఛను ఇచ్చారు. తమ దోపిడీని ప్రజలు గుర్తించి ప్రశ్నించకుండా సంక్షేమం పేరిట వాళ్ల ముఖాన కూడా ఎంతో కొంత పడవేస్తున్నారు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కడప కోర్టు తీర్పు సరైనదేనా?

గత ఎన్నికల్లో తనకు ఉపయోగపడిన వివేకా చావు ఈ ఎన్నికల్లో నష్టం చేయకుండా ఉండేందుకు న్యాయస్థానాలను ఉపయోగించుకొనే ప్రయత్నాన్ని జగన్‌రెడ్డి చేస్తున్నారు. తన పార్టీకి చెందిన సురేశ్ బాబు అనే వ్యక్తితో కడప సెషన్స్ కోర్టులో పిటిషన్ వేయించారు. వివేకా హత్య గురించి షర్మిల, సునీతతోపాటు ప్రతిపక్షాలకు చెందిన వారెవరూ ప్రస్తావించకుండా న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వులను పరిశీలిస్తే న్యాయ వ్యవస్థపై ఉండే గౌరవం సన్నగిల్లుతుంది. పిటిషనర్ కోరింది మాత్రమే కాకుండా ప్రతిపక్షాలపై మరిన్ని పరిమితులు విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటో అర్థం కాదు. ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందా? అహేతుకమైన ఉత్తర్వులు ఇచ్చిన న్యాయస్థానంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేసే అవకాశం ఉండదా? ప్రభుత్వ యంత్రాంగంలో కింది స్థాయిలో తప్పు జరిగినట్టు ఫిర్యాదు వస్తే పైస్థాయిలో చర్యలు తీసుకుంటారు కదా? న్యాయ వ్యవస్థలో కూడా కింది స్థాయి కోర్టులు తప్పుచేసినా, పరిధి దాటినా ఉన్నత న్యాయస్థానం చర్యలు తీసుకోలేదా? అంటే తీసుకోవచ్చు! కడప న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులు వస్తే వాటిపై విచారణకు ప్రధాన న్యాయమూర్తి ఆదేశించడం సహజ ప్రక్రియే. కింది స్థాయి కోర్టులలో అపసవ్య తీర్పులు వెలువడకుండా ఉండాలంటే అలాంటి సందర్భాలలో ఫిర్యాదులు చేయడం ప్రారంభం కావాలి. కడప న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఇది మొదలు కావాలి. ఎవరో ఒకరు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తేనే న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుంది. కింది స్థాయి కోర్టులు ఇస్తున్న తీర్పులు, ఆదేశాలపై హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పలు సందర్భాలలో అసహనం వ్యక్తం చేయడాన్ని గమనిస్తున్నాం. తమకు కూడా జవాబుదారీతనం ఉంటుందని కింది స్థాయి న్యాయ వ్యవస్థకు గుర్తు చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. లేని పక్షంలో బాధితులు నిందితులుగా మారిపోతారు. నిందితులు నిర్దోషులుగా ప్రకటించుకుంటూ విర్రవీగుతారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్


ఆ అప్పుల భారం మోయాల్సింది మనమే!

ఎన్నికల ధ్వని, వేడి మధ్య, సుప్రీంకోర్టులో ఒక పిటిషన్‌పై వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రాల రుణ పరిమితి నిబంధనపై ఆర్టికల్ 131 కింద కేరళ రాష్ట్రం భారత యూనియన్‌పై ఆ వ్యాజ్యం వేసింది. రాష్ట్రం తెచ్చుకునే నికర రుణాలపై జాతీయ స్థాయి ప్రభుత్వం పరిమితి విధించి చర్యలు తీసుకుంటోందని, ఇది ఆర్టికల్ 293 ప్రకారం యూనియన్ అధికారాల్ని ఉల్లంఘించటమేనని కేరళ వాదన. ద్రవ్య నిబంధనలను ఉల్లంఘించి రాష్ట్రం అప్పులు తెచ్చుకునేందుకు యూనియన్ విధిగా అనుమతిచ్చేలా కోర్టు ఆదేశం ఇవ్వాలని రాష్ట్రం కోరింది. పిటిషన్‌పై సుప్రీంకోర్టు విజ్ఞతతో స్పందించింది. రాష్ట్ర అభ్యర్థనను తోసిపుచ్చుతూ ఏప్రిల్ 1న ఆదేశం ఇచ్చింది. ఈ కేసులో రాజ్యాంగపరంగా ఉత్పన్నమయ్యే కీలక ప్రశ్నలను న్యాయమూర్తులు సూర్యకాంత్, కె.వి విశ్వనాథన్‌ల బెంచ్ అయిదుగురు జడ్జీల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది.

రాబోయే తరాల భవిష్యత్తు కేవలం ఎన్నికల తీర్పుల వల్ల నిర్ణయం కాదు. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అప్పులు, ఖర్చు తీరు, భవిష్యత్తు భారాలు కూడా కీలక పాత్ర వహిస్తాయి. ఈ నేపథ్యంలో, పౌరులుగా, పన్ను చెల్లించేవారుగా సుప్రీంకోర్టు ముందున్న ఈ కీలకాంశాన్ని మనం కూడా పట్టించుకోవాలి. ప్రజలుగా మన భవిష్యత్తే ప్రమాదంలో ఉంది. అందువల్ల, ఈ కీలక వాదనల్లో మనందరం పరోక్షంగా భాగమవ్వాలి. ఒక వ్యక్తి, కుటుంబం, సంస్థ లేదా ప్రభుత్వం ఏదైనా కావచ్చు, తమ ఆర్థిక వనరుల్ని జాగ్రత్తగా, వివేకంతో నిర్వహించుకోవాలి; లేకుంటే, దివాలా తీస్తాయి. ఆరోగ్యకరమైన ఆర్థిక నిర్వహణకు ప్రాతిపదిక నాలుగు అంశాలు. మొదటిది, మన రోజువారీ ఖర్చు మన స్థిర ఆదాయం పరిధి లోపే ఉండాలి. ఆదాయం కంటే రోజువారీ ఖర్చుకి ఎక్కువ వ్యయం చేస్తే, అప్పు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఖర్చు పోగా మన ఆదాయంలో అదనంగా ఏమీ మిగలదు కాబట్టి, అప్పు తిరిగి చెల్లించటం మాట అలా ఉంచి, వడ్డీ కట్టటం కూడా సాధ్యం కాదు. అప్పుకి వడ్డీ కోసం మళ్లీ అప్పు చేయాల్సి ఉంటుంది. చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుంది. రోజువారీ బడ్జెట్ ఖర్చులో అటువంటి లోటు ఏర్పడితే (మనం ప్రభుత్వంలో రెవెన్యూ లోటు అని పిలుస్తాం) మనుగడ అసాధ్యమవుతుంది. మన పిల్లలు, వారసులకు తమ తల్లిదండ్రులు, పూర్వీకుల నుంచి కొండలా పేరుకుపోయిన అప్పులు వారసత్వంగా సంక్రమిస్తాయి. అదికూడా బాకీల్ని తీర్చటానికి ఎటువంటి ఆస్తుల్ని, ఆదాయాల్ని చూపకుండా. ఏ కుటుంబం, సంస్థా అటువంటి దుబారా ఖర్చుని తట్టుకుని నిలబడలేవు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతాయి.

రెండో అంశం, భవిష్యత్తుపై పెన్షన్ల చెల్లింపు వంటి భారాల్ని మోపితే, వాటికి కేటాయింపుల్ని ఇప్పుడే చేయాలి. లేకుంటే, ఆదాయ మార్గంలేని భవిష్యత్తు వ్యయం పెరిగిపోతుంటుంది, సంస్థ ఖాయిలా పడుతుంది. కుటుంబాలు సాధారణంగా ఏం చేస్తుంటాయి? ప్రతి నెలా డబ్బును పొదుపు చేసి, భవిష్యత్తు వ్యయానికి భద్రపరచుకుంటాయి. ఆ తర్వాత, ఆస్తులు కొంటాం, లేదా భవిష్యత్తులో ఆదాయం కోసం స్టాక్‌లలో, డిపాజిట్లలో పెట్టుబడి పెడతాం. కానీ, భారత్‌లో చాలా ప్రభుత్వాలు రోజువారీ ఖర్చులకు కూడా భారీగా అప్పులు చేస్తున్నాయి. అందుకు తగ్గ ఆస్తులు, భవిష్యత్తు ఆదాయం లేక అప్పు ఇంతింతై అన్నట్టు పెరిగిపోతోంది.

> ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యతల పరిధిలో తాము సరైన విధానమని భావించిన రీతిలో ప్రజాధనాన్ని వినియోగించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. కానీ ఖజానా డబ్బును దుబారా చేయటం, ఇష్టారాజ్యంగా అప్పులు చేయటం రాష్ట్రాల హక్కుల్లో భాగం కాదు. ఎందుకంటే, ఏ రాష్ట్రం చర్యలైనా మొత్తం దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయి.



మూడోది, అప్పుల్ని పెట్టుబడులకు ఉపయోగించినంత మాత్రాన సరిపోదు. ఆస్తుల్ని పెంచటంపై చేసే వ్యయం సద్వినియోగమయ్యేలా ఉండాలి. ఖర్చుకు తగ్గ ఫలితం వచ్చేలా సరైన విశ్లేషణ చేయాలి. ఖర్చుల కంటే ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నాయని నిగ్గుతేల్చుకోవాలి. ఆస్తుల పేరుతో దారీతెన్నూలేని వంతెనల్ని, నివాసానికి జనం ఇష్టపడని పట్టణాల్ని నిర్మిస్తే అప్పు తెచ్చిన డబ్బు వృథా అయినట్లు. తెలంగాణలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకైన అసంబద్ధ భారీ వ్యయంపై పెద్దఎత్తున వివాదం కొనసాగుతోంది. సాగునీరు అందించటానికి ఎకరాకి రూ.4–5 లక్షలు పెట్టుబడి వ్యయం చేశారు. నిర్వహణ, వగైరాల కోసం ప్రతి సంవత్సరం రూ.40–50వేల దాకా ఎకరాకి వెచ్చించాల్సి ఉంటుంది. పెట్టిన ఖర్చుతో పోలిస్తే, ఈ సాగునీటి ప్రాజెక్టు వల్ల రైతుకి నికరంగా పెరిగే ఆదాయం తక్కువ. అప్పుల డబ్బుని ఆ రకంగా ఖర్చు చేస్తే, అది 'పెట్టుబడుల' కోసమైనా సరే, చివరికి రాష్ట్రాన్ని దివాలా తీయిస్తాయి. కాబట్టి అప్పు చేసి తెచ్చిన డబ్బు ఆస్తుల నిర్మాణానికి, భవిష్యత్తు ఆదాయాన్ని పెంచటానికి ఉపయోగపడటంతోపాటు ఆ పెట్టుబడి అర్థవంతంగా, కచ్చితంగా ఖర్చుకు తగ్గ ఫలితమిస్తుందని కూడా మనం నిర్ధారించుకోవాలి.

నాలుగోది, అప్పు తెచ్చిన డబ్బుని మనం ఆస్తుల నిర్మాణానికి వినియోగించినా కూడా, ఆ అప్పుకి ఒక పరిమితి ఉంటుంది. ఆ పరిధి దాటి అప్పు మనకి మోయలేని భారమవుతుంది. తాహతుకు మించి అప్పు తెచ్చుకుంటే, మళ్లీ మనం అప్పుల ఊబిలో కూరుకుపోతాం. బయటపడటం కష్టమవుతుంది. అలాంటి అప్పులు తీర్చటానికి ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది, లేదా దివాలా తీయాల్సి వస్తుంది.

ఆర్థిక స్థిరత్వం, భారతదేశ పరపతి యూనియన్ ప్రభుత్వ బాధ్యతలని మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో విజ్ఞతతో ఆలోచించి నిర్ణయించారు. ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యతల పరిధిలో తాము సరైన విధానమని భావించిన రీతిలో ప్రజాధనాన్ని వినియోగించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. కానీ ఖజానా డబ్బును దుబారా చేయటం, ఇష్టారాజ్యంగా అప్పులు చేయటం రాష్ట్రాల హక్కుల్లో భాగం కాదు. ఎందుకంటే, ఏ రాష్ట్రం చర్యలైనా మొత్తం దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయి. ఆర్టికల్ 293, ఆర్టికల్ 360 లను జాగ్రత్తగా, ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగంలో చేర్చారు. ఆర్థికంగా దేశం అవిభాజ్యమని, భారత్ లోని ఏ ప్రాంత ఆర్థిక స్థిరత్వానికి ముప్పు ఏర్పడినా మొత్తం దేశ ఆర్థిక స్థిరత్వానికి, మన బిడ్డల భవిష్యత్తుకి ప్రమాదంగా పరిణమిస్తుందని స్పష్టమైన అవగాహనతో మన జాతి నిర్మాతలు వ్యవహరించారు. దీన్ని విస్మరించి ఎడాపెడా అప్పులు చేసి, అందుకు తగ్గ ఆస్తుల్ని సమకూర్చకుండా వచ్చేతరం మీద రుణభారాన్ని పెడితే, మన బిడ్డల భవిష్యత్తు అంధకారమవుతుంది; దేశం ప్రమాదంలో పడుతుంది.

• డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
లోక్‌సత్తా వ్యవస్థాపకులు


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి | ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA | ఆదివారం 21 ఏప్రిల్ 2024 | 5



ఓరుగల్లుపై బీజేపీ గురి

- మోదీ చరిష్మా.. అరూరి ఇమేజ్‌పై కమలదళంలో ఆశలు
- 40ఏళ్లకు గెలుపుపై ధీమాతో కార్యక్షేత్రంలోకి శ్రేణులు
- ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగులపై దృష్టి
- అటు చేరికలు.. ఇటు పోల్ మేనేజ్‌మెంట్‌పై నజర్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ సీటుపై బీజేపీ గురిపెట్టింది. 40ఏళ్ల తర్వాత వరంగల్‌లో ఆ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నట్టు కమలనాథులు అంచనా వేస్తున్నారు. 1984లో చందుపట్ల జంగారెడ్డి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించగా.. నాటిన ఉంచి మళ్లీ బీజేపీకి ఓరుగల్లు ఓటర్లు అవకాశం ఇవ్వలేదు. ఈసారి ప్రధాని మోదీ చరిష్మాకు తోడు బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఇమేజ్ తమ పార్టీ గెలుపునకు దోహదం చేస్తుందనే అంచనాల్లో నేతలున్నారు. దీంతో గెలుపు వ్యూహాలకు నేతలు మరింత పదను పడుతున్నారు. ఇంటింటి ప్రచారంతో ఓటర్లను వీలైనన్ని ఎక్కువసార్లు కలవటంతో పాటు కార్నర్ మీటింగులు, బూత్‌స్థాయి ప్రచారానికి ప్రాధాన్యమిచ్చేలా బీజేపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. వలసలను ప్రోత్సాహిస్తూనే.. పోల్‌మేనేజ్‌మెంట్‌పై బీజేపీ ఫోకస్ చేస్తోంది.

బీజేపీలో 40 ఏళ్లకు గెలుపుపై ఆశలు

ఎప్పుడో 40 ఏళ్ల క్రితం గెలిచిన వరంగల్ స్థానంపై బీజేపీలో మళ్లీ ఆశలు చిగురించాయి. 1984లో వరంగల్ (హనుమకొండ) స్థానంలో టీడీపీ మద్దతుతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన చందపట్ల జంగారెడ్డికి 2,63,762 ఓట్లు (51శాతం) పోలవ్వగా, అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి పీవీ.నర్సింహరావుకు 2,09,564 ఓట్లు (40.50శాతం) మాత్రమే పోలయ్యాయి. దీంతో పీవీ. నర్సింహరావుపై చందుపట్ల జంగారెడ్డి 54,198ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నాడు దేశంలో బీజేపీ గెలిచిన రెండు ఎంపీ సీట్లలో వరంగల్ ఒకటి. ఆ తరువాత జరిగిన ఏ ఎంపీ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించలేదు. చలా సార్లు బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదు. 2014 ఎంపీ ఎన్నికల్లో రాగమళ్ల పరమేశ్వర్‌కు 1,87,139ఓట్లు (15.93శాతం), 2015లో జరిగిన ఉపఎన్నికల్లో పగిడిపాటి దేవయ్యకు 1,29,868 (12.57శాతం) ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చింత సాంబమూర్తికి కేవలం 83,777ఓట్లు (7.89శాతం) మాత్రమే పోలయ్యాయి. గత పదేళ్లలో ప్రతీ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు దిగజారుతూ వచ్చింది. అయితే ఈసారి అనూహ్యంగా బీజేపీ పుంజుకుంటున్నట్టు ప్రచారం జరుగుతుండటం, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడి పోవటంతో కీలక నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. దీంతో మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దీటుగా ఎదిగేందుకు కాషాయ పార్టీ వ్యూహాలు రచించింది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇచ్చింది. పార్టీలో కీలక నేతల మధ్య సమన్వయం చేసి ఎన్నికల బాధ్యతలను అప్పగించింది. 40ఏళ్ల తరువాత పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటంతో ఆ పరిస్థితులను వినియోగించుకోవాలన్న లెక్కల్లో బీజేపీ నేతలున్నారు.

ఓటర్లే లక్ష్యంగా ముమ్మందుకు..

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఓటర్లే లక్ష్యంగా ఎత్తులు వేస్తోంది. మే 13న జరిగే ఎన్నికల లోపు ప్రతీ ఓటరును కలిసే వ్యూహరచన చేస్తోంది. ప్రధానంగా బూత్‌స్థాయి కమిటీలపై దృష్టి పెట్టింది. బూత్ కమిటీ సభ్యులు ఎన్నికల నాటికి ప్రతీ ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి ఓటరును కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటడిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 15, 16, 17 తేదీల్లో తొలివిడతగా బూత్ స్థాయిలో ఇంటింటికి వెళ్లి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరిన శ్రేణులు.. రెండో విడతగా ఈనెల 28,29,30 తేదీలు, మూడో విడతగా మే 9,10,11 తేదీల్లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించేలా వ్యూహరచన చేస్తున్నారు. బూత్‌స్థాయి ప్రచారంతో పాటు కార్నర్ మీటింగ్‌లకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు. మే మొదటి వారంలో సాధ్యమైనంత వరకు ఎక్కువగా బీజేపీ అభ్యర్థి రమేష్‌తో కలిసి కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేలా అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. పార్లమెంట్ పరిధిలో ఒకటి రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించేలా అది కూడా ప్రధాని మోదీ లేదా అమిత్‌షాతో ఒక సభ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై లేదంటే జేపీ నడ్డాలలో ఒకరితో మరో మీటింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. గ్రామస్థాయి, వీధి మీటింగులతో పార్టీవాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి వివరాలు సేకరించి, నిత్యం వారితో టచ్‌లో ఉండేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి చేరికలకు ప్రాధాన్యమిస్తున్నారు. పోల్‌మేనేజ్‌మెంట్‌లో ఎక్కడ కూడా వెనుకడుగు వేయకుండా వ్యూహత్మకంగా కాషాయ పార్టీ కసరత్తు చేస్తోంది. మొత్తానికి ఓటరే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతుండగా.. 40ఏళ్ల తరువాత వరంగల్‌లో కాషాయ జెండా ఎగుతుందనే ఆశలో ఆ పార్టీ శ్రేణులున్నాయి.


చిట్యాల కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అరూరి రమేష్

మోదీ మేనియా.. అరూరి ఇమేజ్‌పైనే..

దేశవ్యాప్తంగా నరేంద్రమోదీకి ఉన్న చరిష్మాపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా అర్బన్ ఓటర్లు మోదీ విధానాలకు అనుకూలంగా ఉన్నట్టు అంచనా వేసుకుంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ ప్రాంతాలున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 42,783ఓట్లతో బీజేపీ అభ్యర్థి ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే వరంగల్ పశ్చిమలో 30,826 ఓట్లు, పరకాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 38,593ఓట్లను సాధించింది. అసెంబ్లీ ఎన్నికలకు, ఎంపీ ఎన్నికలకు ఓటరు నాడీ వేరేలా ఉంటుందని, ప్రస్తుతం మోదీ చరిష్మాతో అర్బన్ ప్రాంతాల్లో మెజారిటీ ఓట్లు సాధించవచ్చుననే లెక్కల్లో బీజేపీ శ్రేణులు ఉన్నాయి. అలాగే అరూరి రమేష్ వ్యక్తిగత పరిచయాలు, బలమైన బంధుత్వాలు ఉండటంతో వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కూడా భారీ స్థాయిలో ఓట్లు పడుతాయనే అంచనాల్లో బీజేపీ నేతలున్నారు. ఇక భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బలమైన కేడర్ ఉండటం తమకు కలిసి వస్తుందనే ఆశతో కమలం పార్టీ నేతలున్నారు. పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో పార్టీ కొంత బలహీనంగా ఉందనే చర్చ జరుగుతోంది. అక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను తట్టుకుని కనీసం రెండోస్థానంలోకి రావాలనే వ్యూహంతో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 'ఆపరేషన్ లోటస్'ను ప్రారంభించినట్లుగా సమాచారం. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న కీలక నేతలతో రహస్య మంతనాలు జరిపినట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు బీజేపీ ఉమ్మడి వరంగల్ కీలక నేతలు ఐక్యతతో కలిసి పని చేస్తుండటం.. అధిష్ఠానం దూతలుగా మాజీ ఎంపీలు గరకపాటి మోహన్‌రావు, చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు పర్యవేక్షణలో కమలం పార్టీ స్పీడ్ పెంచిందనే చర్చ కేడర్‌లో వినిపిస్తోంది.


ఎల్లపూర్ వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి..

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వేగం పెంచాలని బల్దియా ఇంజనీరింగ్ అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శనివారం నగరంలోని పలు అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కరీంనగర్ రోడ్డు ఎల్లాపూర్ వద్ద గ్రాండ్ ఎంట్రెన్స్ ఏర్పాటు, ఏనుమాముల బాలాజీ జంక్షన్ వద్ద బ్యూటిఫికేషన్ పనులు, నర్సంపేట ప్రధాన రహదారి వద్ద గల గ్రాండ్ ఎంట్రెన్స్ పనులు పరిశీలించి నెలరోజులలోపు పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకా ఎస్ఎన్ఎం క్లబ్ సమీపంలోని బ్యూటిఫికేషన్ పనులు, క్రిష్టియన్ కాలనీ వద్ద నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు సంతోష్‌బాబు, రవికుమార్, సారంగం, రంగారావు, కృష్ణమూర్తి, శ్రీకాంత్, ఏఈ హరికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సంపత్‌రెడ్డి, ఇశ్రం శ్రీను, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా పారిశుధ్య పనులు

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్‌లలో ప్రణాళికా బద్ధంగా పారిశుధ్య పనులు నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్

మిగతా 8వ పేజీలో..


ధర్మసాగర్ మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం


ఎల్కతుర్తి కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లు

తడిసిన ధాన్యం

- జిల్లాలో పలు చోట్ల తేలికపాటి వర్షం
- ఎల్కతుర్తి, ధర్మసాగర్‌లో నష్టం

వరంగల్ వ్యవసాయం/ఎల్కతుర్తి/ధర్మసాగర్, ఏప్రిల్ 20: వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసింది. శనివారం నగరంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం మబ్బులు పట్టి ఉంది. అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది. దీంతో చల్లటిగాలులు వీచడంతో నగర ప్రజలు సెద తీరినట్లైంది. హనుమకొండ జిల్లాలో ధర్మసాగర్, కమలాపూర్, ఎల్కతుర్తి మండలాలో కురిసిన తేలికపాటి వర్షాలకు రైతులు కొంత ఇబ్బందులుపడ్డారు. వరి పంట కోతకు వచ్చిన సమయంలో వర్షం కురువడం వల్ల, అలాగే ధాన్యం ఆరబెట్టుకున్న రైతులు తేలికపాటి వర్షానికి తడవకుండా తాటిపత్రులను కప్పుకుని పంటను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. మరోపక్క మామిడి రైతులు భారీ వర్షం కురిస్తే మామిడి పూత, పిందె రాలిపోతుందని ఆందోళన చెందారు. సాయంత్రం వరకు వర్షం కురువకపోవడంతో తేరుకున్నారు.

కల్లాల వద్ద తడిసిన వరి ధాన్యం

ఎల్కతుర్తి: ఎల్కతుర్తిలో మండల పరిధిలో శనివారం ఉరుములు, మెరుపులతో కూడి అకాల వర్షం కురిసింది. మండలకేంద్రంలో అరగంట పాటు వర్షం దంచి కొట్టింది. అలాగే మిగితా గ్రామాల్లో మోస్తారుగా వర్షం కురిసింది. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోగా రైతులు ఆందోళనకు గురయ్యారు. వడగండ్లు పడితే పంటలు పూర్తిస్థాయిలో నష్టపోతామనుకున్నా రైతులు కొంత పొలాన్ని కోసుకుని కల్లాల వద్ద రాశులు పోసుకున్నారు. రాశులపై పరదాలు కప్పిన ఈదురుగాలులకు పరదాలు కొట్టుకుపోయి వర్షానికి తడిసి ముద్దయ్యాయి. వీటితోపాటు కొనుగోలు కేంద్రాల్లోకి చేరిన ధాన్యాన్ని కాంటాలు నిర్వహించడంలో జాప్యం చేయడం వల్ల అకాల వర్షానికి ధాన్యం తడిసింది. ఈదురుగాలులకు వరి పంటలు నేలవాలాయి. మామిడి తోటల్లో కాయలు సైతం నేల రాలి రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోళ్లు చేయాలని పలువురు డిమాండ్ చేశారు.

ధర్మసాగర్‌లో అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేసింది. అకస్మాత్తుగా శనివారం కురిసిన వాన రైతులను నిండా ముంచింది. వరి ధాన్యం తడిసి ముద్దయింది. ధర్మసాగర్ మండలంలో ఐకేపీ తొమ్మిది, పీఏసీఎస్ ఎనిమిది, వేలేరులో ఐకేపీ ఎనిమిది, పీఏసీఎస్ సెంటర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇటీవల ఏర్పాటు చేశారు. రెండు మండలాలకు సంబంధించిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మేందుకు పెద్ద ఎత్తున తీసుకువచ్చారు. తూకం వేసేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. పరదాలు లేకపోవడంతో ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నగరంలో చిరు జల్లులు

భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు శనివారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుజల్లులతో కూడిన వర్షం పడడంతో ఆహ్లాదం పొందారు. ఉదయం వేళ వర్షం ఒక్కసారిగా కురువడంతో ప్రజలు గొడుగులను ఆశ్రయించారు. దాదాపు 20 నిమిషాల వరకు జల్లులతో వర్షం కురిసింది.



ఆర్టీఏలో అతడే రారాజు

- జిల్లా పేరునే ఇంటిపేరుగా మార్చుకున్న ఏజెంట్
- కార్యాలయాల్లో ఆయనదే హవా
- రారాజు ఫైళ్లు వెళితే పని అయిపోయినట్లే
- కార్యాలయంలో ఆయనకు రాజమార్గం



వరంగల్ క్రైం, ఏప్రిల్ 20: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణాధికారి కార్యాలయాల్లో 'రారాజు' హవా కొనసాగుతోందనే విమర్శలున్నాయి. పేరుకే ఏజెంట్ అయినా.. ఆయన గుప్పిట్లో శాఖ అధికారులు ఉంటారనే ఆరోపణలున్నాయి. రారాజు ఇచ్చే తాయిలాలు అందుకునే అధికారులు.. ఆయన పంపే ఫైళ్లను ఒక్క నిమిషం ఆపకుండా క్షణాల్లో పని కానిస్తారనే విమర్శలున్నాయి. ఆయన ఆదాయం నెలకు లక్షల్లో ఉంటుందనే ప్రచారం ఉంది. ఒక ఏజెంట్ అయిన రారాజుకు కార్యాలయంలో ఉన్న పరపతి గమనిస్తే ఉన్నతాధికారిని మించి ఉంటుందనే ఆరోపణలున్నాయి. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఏజెంట్ వృత్తిని చేబట్టిన సదరు రారాజు.. ఇంటిపేరునే ఓ జిల్లా పేరుగా మార్చుకున్నట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన ఫైల్స్ తీసుకువచ్చి పనిచేసిపెట్టే సదరు ఏజెంట్.. ప్రస్తుతం ఆరు జిల్లాల్లో 25మందికి పైగా తన కింద నియమించుకునే స్థాయికి ఎదుగడం విశేషం. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లా కార్యాలయాల్లో రారాజు హవా కొనసాగుతోందనే ప్రచారం ఉంది. కార్యాలయాల్లో సదరు ఏజెంట్ చేయని పని అంటూ ఉండదని సమాచారం. ఇతడికి నిబంధనలు అడ్డురావని, అధికారులు అడ్డుచెప్పరనే ఆరోపణలున్నాయి. మిగతా ఏజెంట్ల విషయంలో కొర్రీలు పెట్టే అధికారులు.. రారాజు ఫైళ్లకు క్షణాల్లో ఆమోద ముద్ర వేస్తారని తెలిసింది. ఏజెంట్లు లేకుండా ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నామని చెప్పుకునే అధికారులు ఇలాంటి రారాజుల ద్వారా ఆఫ్‌లైన్ సేవలు అందిస్తూ అందినకాడికి పుచ్చుకుంటున్నారనే విమర్శలున్నాయి.

రాజమార్గం

ఏజెంట్లను ఎవరినీ లోనికి అనుమతించడం లేదని ప్రచారం చేసుకుంటున్న రవాణాధికారి కార్యాలయ అధికారులు.. రారాజుకు మాత్రం రాజమార్గం కల్పిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈయను, ఈయన కింద పని చేసే వర్కర్లు నేరుగా కార్యాలయంలోకి వెళ్లినా అడ్డుకోరనే ప్రచారం ఉంది. ఇతడి ఫైళ్లు కూడా వేగంగా క్లియర్ అవుతాయని తెలిసింది. రోజుకు పదుల సంఖ్యలో ఉండే రారాజు ఫైళ్ల నుంచి కార్యాలయ అధికారులకు సైతం బాగానే ముట్టుతాయనే విమర్శలున్నాయి.

ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలతో లింకు పెట్టుకుని వాహనాలకు ఫైనాన్స్ ఎండార్స్‌మెంట్ పేరిట భారీగానే కూడబెట్టినట్లు తెలిసింది. వాహనాలను, వారు తీసుకునే ఫైనాన్స్‌ను బట్టి రూ.10వేల వరకు వసూలు చేసి పని చేసిపెడతాడనే ఆరోపణలున్నాయి. ఇలాంటి ఫైళ్లు వచ్చినప్పుడు శాఖ అధికారులు క్షణాల్లో పనిచేసి వారి వాటాను పుచ్చుకుంటారనే ప్రచారం ఉంది. ఫిట్‌నెస్, పర్మిట్, రిజిస్ట్రేషన్‌ల పేరిట పెద్దఎత్తున వసూలు చేస్తాడనే విమర్శలున్నాయి. హనుమకొండ జిల్లా కార్యాలయంలో వందమందికి పైగా ఏజెంట్లు ఉండగా కార్యాలయంలో రారాజు మాత్రం రారాజేనని.. ఇతడు ఆడిందే ఆట పాడిందే పాటగా నడుస్తుందని అధికారిక సమాచారం. ఇతడి దందా అధికారుల అండతోనే జరుగుతోందని అధికారిక సమాచారం.


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలి

- ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి
- అంగన్‌వాడీ కేంద్రాలు పని తీరును మెరుగుపరుచుకోవాలి
- పోలింగ్ కేంద్రాల పరిశీలనలో కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఆత్మకూరు, ఏప్రిల్ 20: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మండలంలోని నాగయ్యపల్లి గ్రామంలో శనివారం రూ.8.45 లక్షలతో నిర్మిస్తున్న పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఏడు తరగతులకు ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని, అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అలాగే లింగమడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో రూ.1.95లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పదేళ్లగా అదనపు తరగతి గదులు లేక చెట్టు కిందనే విద్య బోధిస్తున్నారని, గదులకు నిధులు మంజూరు చేసి, అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను

మిగతా 8వ పేజీలో..



శనివారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 31.5°C
కనిష్ఠం : 27.0°C

డీజే నిర్వాహకుడిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 20: పెళ్లి ఊరేగింపులో అర్ధరాత్రి డీజే సౌండ్స్‌తో ప్రజలను ఇబ్బందిపెడుతున్న డీజే నిర్వాహకుడితోపాటు పెళ్లివారిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. హనుమకొండ పోచమ్మకుంట ఫైన్ ఫంక్షన్ హాల్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి డీజేతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు డీజే ప్రాంతానికి చేరుకొని నిర్వాహకుడు తాటికొండ సాయి, పెళ్లి వారి నుంచి ముత్తోజ్ అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా సమ్మర్ స్పెషల్ రైళ్లు

కాజీపేట, ఏప్రిల్ 20 : రైళ్లలో వేసవి రద్దీ దృష్ట్యా పలు సమ్మర్ స్పెషల్ రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ - దానాపూర్ రైలు ఏప్రిల్ 28, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు కాజీపేటలో నిర్ణయించిన తేదీల్లో ఉదయం 10 గంటలకు హాల్టింగ్ ఉంటుంది. దానాపూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 21, 28, మే 5, 12, 19,28, జూన్ 2, 9, 16, 23, 30 తేదీలలో నడపనున్నారు. ఈ రైలు నిర్ణయించిన తేదీల్లో కాజీపేటకు మధ్యాహ్నం 1 గంటలకు హాల్టింగ్ సౌకర్యం ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇవే కాకుండా హైదరాబాద్ - రక్సెల్, హైదరాబాద్ - గోరఖ్ మధ్య సైతం సమ్మర్ స్పెషల్ రైళ్లను నడపనున్నామని, వాటి షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

24 నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

- ఉమ్మడి పది జిల్లాల నుంచి పాల్గొననున్న 50 జట్లు
- తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24నుంచి 27వరకు హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో 6వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. శనివారం హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కార్యాలయంలో క్రీడా పోటీలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్‌కుమార్ పాల్గొని ముందుగా క్రీడా పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి పది జిల్లాల నుంచి హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసి వారిని ప్రోత్సహించడానికి తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4రోజుల పాటు లీగ్ కమ్, నాకౌట్ పద్ధతిన పండుగ వాతావరణంలో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. అండర్-15బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 50 జట్లు పాల్గొంటాయని, ఇందులో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా మైదానం సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బసతో పాటు ఉచిత భోజన వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 100 మంది క్రీడాకారులను ఎంపిక చేసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) సహకారంతో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యం లో హైదరాబాద్‌లో నెల పాటు ప్రత్యేక శిక్షణ అందిచడానికి కృషి చేస్తామన్నారు. అత్యుత్తమ ప్రతిభతో రాణించిన క్రీడాకారులకు సాట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పించడంతోపాటు ఖేలో ఇండియా హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొనేలా అవకాశాలను కల్పించాలన్నారు. విజేతలుగా నిలిచిన జట్టుకు ట్రోఫీ, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి ఇట్యాల శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

కావ్య గెలుపునకు సమష్టిగా కృషి చేద్దాం

- వరంగల్ లోక్‌సభ ఎన్నికపై మంత్రి శ్రీధర్‌బాబు దిశా, నిర్దేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 20 : వరంగల్ లోక్‌సభ స్థానాన్ని మూడు లక్షల ఓట్ల మెజారిటీతో కైవసం చేసుకోవాలని ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. శనివారం రాత్రి హనుమకొండలోని ఓ హోటల్‌లో శ్రీధర్‌బాబు సమీక్ష జరిపారు. వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు అభ్యర్థి కడియం కావ్య ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ నాయకులు కూచన రవళి, ఈవీ శ్రీనివాస్, డాక్టరు అనిల్‌కుమార్, డాక్టరు రామక్రిష్ణ తదితరులతో సమీక్ష జరిగింది.

లోక్‌సభ ఎన్నికలో మెజారిటీ, గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం వరకు ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల బాధ్యతల నిర్వహణ, మెజారిటీ, ప్రచారం, పార్టీ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్, 24న సీఎం రేవంత్‌రెడ్డి సభ, తదితర అంశాలను సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్వహించాల్సిన అంశాలపై దిశా, నిర్దేశం చేశారు. పార్టీ గెలుపు ఖాయమని, అయితే మెజారిటీ అత్యంత ప్రాధాన్యత విషయమనేది గుర్తించాలని ఉద్బోధించారు. టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులతో చర్చించి నచ్చచెప్పాలని సూచించారు. 24 తరువాత ప్రచారాన్ని ఉధృతం చేయాలని, ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. పార్టీ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 24న మడికొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు సమీక్షించారు. నియోజకవర్గాల వారిగా శ్రేణులతరలింపు, రవాణా ఇతర విషయాలను చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యేలు తదితర ముఖ్య నేతలు

వ్యయ పరిశీలన రిజిస్టర్ నిర్వహించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింఘూ

ఎన్నికల పరిశీలకులతో కమిషనర్ భేటీ


కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తప్పకుండా ఎన్నికల వ్యయపరిశీలన రిజిస్టర్లు తప్పకుండా నిర్వహించుకోవాలని ఎన్నికల పరిశీలకుడు ధీరజ్‌సింఘూ సూచించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో 15- వరంగల్ ఎస్సీ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌వో, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎన్నికల అధికారులతో శనివారం భేటీ అయ్యారు. ధీరజ్‌సింగా కార్యాలయంలోని పలు ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దీరజ్‌సింగా మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఖర్చులను రికార్డులను నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థుల అమోద, అమోదయోగ్యం కానీ ప్రతీ ఖర్చును లెక్కించాలన్నారు. అభ్యర్థుల ప్రచారం, ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించిన అన్ని క్లిప్స్ సర్వేలెన్స్ టీములు రికార్డు చేయాలన్నారు. అభ్యర్థుల పూర్తి వివరాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించాలని చెప్పారు. ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలని అన్నారు. పోటీచేసే అభ్యర్థులు అన్ని రకాల కర్చులు తప్పకుండా పక్కా లెక్క ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యయపరిశీలకులు మానస, అకౌంటింగ్ టీం సిబ్బంది ఖిరానాయక్, లింగస్వామిలతో పాటు పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి

వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రాజేశ్‌కుమార్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్ కుమార్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా శనివారం బల్దియా కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయంలో ఓటు హక్కుపై లోక్‌సభ నియోజక వర్గం పరిధి -106 (వరంగల్ తూర్పు) స్వీప్ -2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏకశిల పట్టణ సమాఖ్య సభ్యులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేశ్ కుమార్ హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అవగాహనపై ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలని అన్నారు. అదే విధంగా ఈ నెల 25న ఉదయం 8 గంటలకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీవోలు నాగరాజు, సఫియా, ఆర్పీలు పాల్గొన్నారు.

వరంగల్‌లో మూడో రోజు నాలుగు నామినేషన్లు


వరంగల్ పార్లమెంట్ ఆర్‌వో ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) అభ్యర్థి సావిత్రి


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోంది. మూడో రోజైన శనివారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఎంసీపీఐ(యూ) అభ్యర్థి మాస్ సావిత్రి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్ ఒకసెట్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్ ఒకసెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థి బరిగెల శివ తొలిరోజున ఒక సెట్ వేయగా, శనివారం మరోసెట్ పత్రాలను అందజేశారు. ఇకమహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మూడో రోజు శనివారం

మహబూబాబాద్‌లో నిల్

ఒక్క నామినేషన్ కూడా దాఖలవలేదు. ఈ నెల 18న తొలి రోజు ఒకరు, 19న రెండవ రోజు నలుగురు నామినేషన్లు వేశారు. కాగా, 22వ తేదీ సోమవారం బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, 23న బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత నామినేషన్లు వేయనున్నారు.

నామినేషన్ కౌంటర్

మూడో రోజు (20-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
11	6

వరంగల్ (ఎస్సీ) : మాస్ సావిత్రి (ఎంసీపీఐ), మేకల సుమన్ (ధర్మ సమాజ్ పార్టీ), గాదెపాక అనిల్‌కుమార్ (స్వతంత్ర), బరిగెల శివ (స్వతంత్ర)

మహబూబాబాద్(ఎస్టీ) : లేవు.



సమాచారమంతా చరవాణిలోనే..

సీ-విజిల్‌తో ఎన్నికల ఉల్లంఘనలకు అడ్డుకట్ట



వరంగల్ సిటీ, ఏప్రిల్ 20 : ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యత పెరిగిపోయింది. ప్రతీ ఇంట్లో చరవాణి(మొబైల్), ప్రతీ మనిషికో చరవాణి మామూలైపోయింది. ఈ అంశాన్నే కేంద్ర ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పక్కాగా ప్లాన్ చేసింది. ప్రతీ విషయం ఓటరు తెలుసుకునేలా యాప్‌లను రూపొందించింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఓటర్లు ఫిర్యాదు చేసేందుకు, ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు, అభ్యర్థుల వివరాలను తెలుసుకునేందుకు ఇలా ప్రతీ సమాచారం అందుబాటులో ఉంచుతోంది. బరిలో నిలిచే అభ్యర్థులు సైతం ఆన్‌లైన్ ద్వారానే సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు తీసుకునేలా అవకాశం కల్పించింది. భారత ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను స్మార్ట్ ఫోన్‌లలో ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీ-విజిల్‌తో..



అలాగే కోడ్ ఉల్లంఘన, వ్యయ ఉల్లంఘన జరిగితే వెంటనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడానికి సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించండి. నగదు, మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టు వస్తువుల పంపిణీ, ప్రజల ఆస్తులను పాడుచేయడం, కుల, మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు జరిగితే ఫిర్యాదు చేయవచ్చు. అలాగే అసత్య వార్తల ప్రసారం, ఓటర్లను బెదిరించడం, చెల్లింపు వార్తలు, మారణాయుధాలు కలిగియుండుట, ఓటర్ల రవాణా ఇలాంటివన్నీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనల కిందకే వస్తాయి. వీటిపై సీ-విజిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. మీరు చేసిన ఫిర్యాదుకు వెంటనే ఎన్నికల అధికారులు స్పందిస్తారు. ఐదు నిమిషాల వ్యవధిలో జిల్లా ఎన్నికల అధికారి వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ యూనిట్‌కు ఫిర్యాదును కేటాయిస్తారు. 15 నిమిషాలలో ఫీల్డ్ టీమ్, ఫిర్యాదు చేసిన స్థలానికి చేరుకుంటుంది. 30 నిమిషాలలో ఫీల్డ్ టీం చర్య అమలు చేసి నివేదిక పంపిస్తారు. 50 నిమిషాలలో రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుపై చర్యలు చేపడుతారు.


అదుపు తప్పి ఫ్లైయాష్ లోడ్ లారీ బోల్తా

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



మడికొండ, ఏప్రిల్ 20 : ఔటర్ రింగ్‌రోడ్డుపై ఫ్లైయాష్ లోడ్ లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మడికొండ ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున భూపాలపల్లి నుంచి సూర్యాపేటకు ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీ కాజీపేట మండలం టేకులగూడెం క్రాస్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ పై అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ గుగులోత్ నితిన్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. 100 డయల్ సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారి సహాయంతో డ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, లారీ డ్రైవర్, ఓనర్‌లు సూర్యాపేటకు చెందిన వారని ఏఎస్సై తెలిపారు.

వీవీ ప్యాట్, ఈవీఎంల తేడా



వరంగల్ కలెక్టరేట్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీ ప్యాట్). అభ్యర్థి పేరు, గుర్తు, సీరియల్ నెంబరు అన్ని కనిపిస్తాయి. ఇలా 7 సెకన్లు మాత్రమే ఉంటుంది. ఈవీఎంలలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్‌లు ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ ఆఫీసర్ దగ్గర, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ ఓటు వేసే ఓటరు దగ్గర ఉంటాయి. పోలింగ్ ఆఫీసర్ యాక్టివేట్ చేస్తేనే ఓటు వేసే అవకాశం ఉంటుంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్ష



వరంగల్ కలెక్టరేట్ : ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఎన్నికల నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. అభ్యర్థులు బాధ్యతాయుతంగా ఖాతాల వివరాలను ఎన్నికల అధికారులకు తెలియపర్చాలి. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు, పెయిడ్ న్యూస్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను ఉల్లంఘనగా పరిగణిస్తారు.

వెబ్‌సైట్‌లో సమగ్ర సమాచారం



వరంగల్ కలెక్టరేట్ : ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది.

ceotelangana.ni వెబ్‌సైట్‌లో ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో పేరు, తొలగింపు, సవరణలు చేసుకోవచ్చు. అలాగే పోలింగ్ కేంద్రం వివరాలతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా గతంలో పోటీ చేసిన అభ్యర్థుల వివరాలు కూడా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

కష్టకాలంలో తోడున్న వారే నిజమైన కార్యకర్తలు

ద్రోహులకు బీఆర్ఎస్ కార్యకర్తలు గుణపాఠం చెప్పాలి

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

పరకాలలో బీఆర్ఎస్ లోక్‌సభ స్థాయి సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బండా ప్రకాశ్

పరకాల, ఏప్రిల్ 20: కష్టకాలంలో తోడున్న వారే పార్టీకి నిజమైన కార్యకర్తలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని లలితా కన్వెన్షన్ హాలులో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. అధికార దాహం కోసం పార్టీ మారే నాయకులు, కార్యకర్తలు పార్టీకి అవసరం లేదని, ఎందరు వెళ్లినా వరంగల్ ఎంపీ స్థానం బీఆర్ఎస్ అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో అబద్ధాల హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న రైతులకు రుణమాఫీ చేస్తామని ఇప్పటి కూడా కల్లబొల్లి మాటలు చెబుతున్నాడని అన్నారు. బ్రోకర్లే పార్టీలు మారుతున్నారు తప్పా.. నిజమైన కార్యకర్తలు పార్టీలోనే ఉన్నారని తెలిపారు. కడియం శ్రీహరిని తన తండ్రి చదివించాడని, అలాంటి వాడు తనను వ్యతిరేకించి మాట్లాడటం సరైంది కాదన్నారు. ఎన్నో కష్టాలకు ఓర్చి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే రైతులు ఎంతో మంది మూడు పంటలు పండిస్తున్నారని, ఒకటి రెండు పిల్లర్లు కుంగితే కాంగ్రెస్ వాళ్లు వేలెత్తి చూపడం సరికాదన్నారు.

బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అండతో ఎదిగిన కడియం శ్రీహరి, ఆరూరి రమేశ్ ద్రోహులుగా నిలిచారని, ఎన్నికల్లో వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు మోసానికి, న్యాయానికి మధ్య జరిగే పోరు అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఎన్నో అబద్దాలు చెబుతూ ఎన్నో పదవులు పొంది, ఎంతో సంపాదించుకున్న కడియం శ్రీహరి మోసకారి అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవిని రాజీనామా చేసి మళ్లీపోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కడియం శ్రీహరి చేసిన ద్రోహం వివరించాలని పిలుపునిచ్చారు.

కడియం శ్రీహరి నకిలీ దళితుడు

కడియం శ్రీహరి నకిలీ దళితుడు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. దళితద్రోహి, అవినీతి చక్రవర్తి, చరిత్రహీనుడు, దళిత హక్కులను దోచుకునేవ్యక్తి కడియం శ్రీహరి అని ధ్వజమెత్తారు. తాను మాదిగ కులానికి చెందినవాడినని, కడియం శ్రీహరికి దమ్ముంటే ఆయన కులం ఏమిటో చెప్పాలని నిలదీశారు. బైండ్ల కులంలో చేరి దళిత హక్కులను దోచుకుతింటున్నాడని ఆరోపించారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీకి, దేవుడు లాంటి కేసీఆర్‌ను మోసం చేసి నకిలీ కులం పేరుతో బిడ్డను రాజకీయాల్లో దింపి గెలిపించుకునే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, తానూ పోటీ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, లింగంపెల్లి కిషన్‌రావు, శోభన్‌బాబు, వాసుదేవరెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ ఉంటేనే దేశానికి భద్రత

పథకాల పేరుతో కాంగ్రెస్ మోసం

వరంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్


శాయంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న అరూరి రమేష్

శాయంపేట, ఏప్రిల్ 20 : నరేంద్ర మోదీ ప్రధానిగా ఉంటేనే భారత దేశానికి రక్షణ ఉంటుందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డితో పాటు మండల కేంద్రంలో అరూరి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పదేళ్లుగా దేశంలో ఎలాంటి అవినీతి, కుంభకోణాలు లేకుండా బీజేపీ సుపరిపాలన కొనసాగిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించకపోయినా కేంద్రం పెద్దన్న పాత్ర పోషిస్తూ రాష్ట్రాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దులాంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలు జరిగాయని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అక్కడి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు సొంతంగా అనేక సేవా కార్యక్రమాలు చేశామని అన్నారు. వరంగల్ ఎంపీగా గెలిపిస్తే దేశంలోనే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, భూపాలపల్లి రైల్వేలైన్ నిర్మాణం, టెక్స్‌టైల్ పార్క్ విస్తరణ లాంటి అనేక లక్ష్యాలు పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ గెలిచిందని అరూరి ఆరోపించారు. ఇప్పటివరకు హామీలు అమలు చేయలేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించి. మోదీని ప్రధాని చేయడానికి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి, మార్తినేని ధర్మారావు, చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, వన్నాల శ్రీనివాసులు జిల్లా నాయకులు రాయరాకుల మొగిలి, నరహరిశెట్టి రామక్రిష్ణ, వనం దేవరాజు, నాగరాజు, కోమటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బాలరాజు (ఫైల్)

ఐనవోలు, ఏప్రిల్ 20 : కుటుంబంలో కుమారుడు, తల్లి వరుసగా మృతిచెందడంతోపాటు తండ్రి, కూతురు అనారోగ్యానికి గురికావడంతో మనస్తాపానికి గురైన ఓవ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కొనుకొండ బాలరాజు (32) శుక్రవారం పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. బాలరాజు కుమారుడు సాయి మూడేళ్ల వయస్సులో కిందటేడు అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి సోమమ్మ రెండు మాసాల కిందట మృతి చెందింది. కూతురు వైష్ణవి మానసిక వికలాంగురాలు, తండ్రి మల్లయ్య పది రోజుల కిందట పక్షవాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులిద్దరు మృతిచెందడం.. ఇద్దరు అనారోగ్యానికి గురికావడంతో మనోవేదనకు గురైన బాలరాజు.. జీవితంపై విరక్తి చెంది ఐనవోలు శివారులోని జామాయిల్ తోటలో పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 26నుంచి 28వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 1జనవరి 2006 నుంచి 31 డిసెంబరు 2007 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, మెడికల్ సర్టిఫికెట్‌లను వెంట తీసుకొని ఈ నెల 21న హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్‌లో ఉదయం 7గంటలకు రిపోర్టు చేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.





సీఎం సభా స్థలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన కడియం

మడికొండ, ఏప్రిల్ 20: మడికొండలో ఈనెల 24న జరుగనున్న భారీ బహిరంగ సభ స్థలాన్ని శనివారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. ముఖ్యమంత్రి హాజరు కానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లపై చర్చించారు. ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా చూడాలని నేతలకు సూచించారు. అలాగే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు భారీగా తరలి వచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ



మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 20: హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ తెలిపారు. ఈ నెల 23వ తేదీన నిర్వహించబోయే హనుమాన్ శోభాయాత్రపై శనివారం సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు పోలీసులు, వివిధ ప్రభుత్వ విభాగాలు, శోభాయాత్ర నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శోభయాత్ర ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు వివరించారు. వరంగల్ మహానగరంలోని అన్ని మతాలవారు సోదరభావంతో పండుగలను జరుపుకుంటారని, వరంగల్ ప్రజలు ఇతర ప్రాంతాల వారికి ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇదే రీతిలో పరస్పర గౌరవంతో పండగలను జరుపుకుందామన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, నందిరాంనాయక్, సత్యనారాయణ, మునిసిపల్ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్లు, రోడ్లు, భవనాలు, మునిసిపల్ అధికారులు, విశ్వహిందూ, భజరంగ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి

• కలెక్టర్ సిక్తా పట్నాయక్ • పశ్చిమ, పరకాల నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 20: రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని హనుమకొండ జిల్లాకు సంబంధించిన పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవార్గలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు(ఈవీఎంలు) కేటాయించారు. ఈ సందర్భంగా వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం మిషన్లను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం కలెక్టర్ జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు కేటాయించారు. ఈవీఎంల కేటాయింపు అనంతరం హనుమకొండ జిల్లాకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి సీల్ వేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఎఆర్వోలు వెంకటేష్, నారాయణ, ఇతర ప్రభుత్వ అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు కేటాయిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్ →



పోటీ పరీక్షల కోసమే మోడల్ పరీక్షలు



విద్యార్థులతో మాట్లాడుతున్న రెహమాన్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20: వివిధ పోటీ పరీక్షల కోసం విద్యార్థుల్లో భయం దూరం చేస్తూ వారిని పరీక్షలకు సంసిద్ధులను చేసేందుకు ఏఐఎస్ఎఫ్ మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షలు నిర్వహించిందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెహమాన్ అన్నారు. శనివారం హనుమకొండలోని 9 కేంద్రాల్లో మోడల్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఆయన ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మోడల్ టెస్ట్‌ల ద్వారా విద్యార్థులకు పరీక్షలపై అవగాహన పెరుగుతుందన్నారు. వరంగల్ విభాగం ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ నిర్వహించిన వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కె. కుమారస్వామి, సహాయకార్యదర్శి కాసరబోయిన రవితేజ, నాయకులు కుంటి పవన్, శ్రీపతి వినయ్, స్పందన, మాలోత్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న జాతీయ విద్యా విధానం రద్దుపై సదస్సు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 20: ఈనెల 23న మంగళవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్‌హాల్‌లో నూతన జాతీయ విద్యా విధానం- 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నేతలు శనివారం వెల్లడించారు. ఈ మేరకు శనివారం కేయూలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేత లు మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాల్లో ఆశాస్త్రీయ భావజాలన్ని పెంపొందించే నూత న జాతీయ విద్యా విధానం -2020ని రద్దు చేయాలని సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో ముఖ్యఅతిథులుగా రిటైర్డు ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ ఎ.వినాయకరెడ్డి, ఓయూ ప్రొఫెసర్ పద్మజాషాలు పాల్గొని మాట్లాడుతారని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానం అమలు వలన జరిగే పర్యవసనాలను చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. మేధావులు, ప్రజాస్వామికవాదులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు మొగిలి వెంకట్‌రెడ్డి, రహమాన్, బి.నరసింహరావు, భాషబోయిన సంతోష్, మాలోత్ రాజేశ్, శివ కుమార్, సాయి కిరణ్, పృథ్వీరాజ్, జస్వంత్, పరిమళ, వేల్పుల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో నగదు పట్టివేత

మడికొండ, ఏప్రిల్ 20 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం మడికొండ చైరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మసాగర్‌కు చెందిన కందాల రవీంద్రాచారి కారు తనిఖీ చేయగా అతడి వద్ద నుంచి రూ. 1లక్షా 30 నగదును పోలీసులు పట్టుకున్నామని, ఆ నగదును ట్రెజరీకి పంపామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడికొండ, ఏప్రిల్ 20 : కాజీపేట మండలం భట్టుపల్లి వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మడికొండ ఎస్సై రాజబాబు వివరాల మేరకు.. కడిపికొండ వైపు నుంచి ఉర్సు గుట్ట వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని భట్టుపల్లి సమీంలోకి రాగానే లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు ఎంజీఎంకు తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలు



కాజీపేటలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

కాజీపేట, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు 74వ జన్మదిన వేడుకలు కాజీపేటలో వరంగల్ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఘ నంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంటరీ అధ్యక్షుడు హర్షణపల్లి విద్యాసాగర్‌రావు హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత బాబుదే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాల మాల మహేందర్, కార్యదర్శి శేషాద్రి, నాయకులు జవాజి నరేందర్, సరస్వతి, కళావతి, పుష్ప, రవి, శ్రీనివాస్, జై బూ, అనిత, నిహారిక పాల్గొన్నారు.

• వడ్డెపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు శనివారం హనుమకొండ రాజాజీనగర్‌లోని టీడీపీ మినీ కార్యాలయంలో ఘ నంగా జరిగాయి. చంద్రబాబునాయుడు బర్త్‌డే కేక్‌ను టీడీపీ వరంగల్ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి ఎండీ రహీమ్ కట్‌చేసి పం పిణీ చేసి సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ.. టీడీ పీ ఆవిర్భావంతోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రధానంగా మహిళలను రాజకీయంగా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బర్ల యాకూబ్, టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు మాడగాని మనోహర్, అనిశెట్టి సతీష్, కిన్నెర సుధాకర్, వెలగందుల రవీందర్‌గుప్త, కొంగర ప్రభాకర్, కటకం కుమారస్వామి, బింగి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

టెట్‌పై ఉపాధ్యాయుల
అనుమానాలను నివృత్తి చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20: ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ నిబంధనపై రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హన్మంతరావు, నవాత్ సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఢిల్లీలోని ఎన్‌సీటీఈ చైర్మన్ యోగేష్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.టెట్ నిబంధనతో రాష్ట్రంలోని ఉపాధ్యాయుల్లో అనేక సందేహాలు ఉన్న సంగతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన యోగి నిబంధనల మేరకు అనుమానాలను నివృత్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షుడు నరేందర్‌రావు, అదనపు ప్రధానకార్యదర్శి పెంటయ్య, ఉపాధ్యక్షులు రాజశేఖర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 20 : హనుమకొండ పద్మాక్షికాలనీ శ్మశాన వాటికలో నలుగురు యువకులు గంజాయి తాగుతూ పట్టుబడ్డ ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... నలుగురు యువకులు గంజాయి తాగుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై శ్రీనివాస్ సిబ్బంది తో అక్కడికి చేరుకోగా నలుగురు యువకులు గంజాయి తాగుతూ పట్టుబడ్డారు. నిందితుల నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20: ఉచిత వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలనుకునే విద్యార్థుల కోసం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9177148158, 9704190459, 8500180314 మొబైల్ నెంబర్లలో సంప్రదించాలని వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిదులు సూచించారు.

లోక్‌సభ ఎన్నికల్లో
నరేశ్‌ను ఆదరించండి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 20: తెలంగాణ విద్యార్థి ఉద్యమ నేత, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ ఈనెల 22న సోమవారం వరంగల్ లోక్‌సభ ఎంపీగా స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తారని ఏబీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి మచ్చ పవన్‌కల్యాణ్ తెలిపారు. శనివారం కేయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీఎస్ఎఫ్ సెక్రటరీ దూడపాక నరేందర్, బండారి పృథ్వీరాజ్‌ల నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో మంద నరేశ్ పోరాటం చేశారని చెప్పారు. ఆయన నామినేషన్ దాఖలు కార్యక్రమంలో నిరుద్యోగ యువత హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధికార ప్రతినిధి అరిస్టాటిల్, రాజ్‌కిరణ్, వెంకటేశ్, సాయి, మనోజ్, అబ్దుల్ పాల్గొన్నారు.

'సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి'

హసన్‌పర్తి, ఏప్రిల్ 20: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి అని మహజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకుడు మందకుమార్ మాదిగ అన్నారు. శనివారం ఎర్రగట్టుగుట్ట వద్ద గల ఎంఎస్ఆర్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 లక్షల మంది మా దిగలు ఉండగా ఒక్క ఎంపీ సీటుకు అభ్యర్థిని ప్రకటించక మాదిగలకు ద్రోహం చేశాడన్నారు. మాదిగ బిడ్డ పసునూరి దయాకర్ ఉండగా వలస వచ్చిన కడియం శ్రీహరి కూతురు కావ్యకు టికెట్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. మాదిగలను ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈనెల 22న ఎర్రగట్టుగుట్ట వద్ద గల అమిత్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందన్నారు.కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ నాయకులు వేల్పుల సూరన్న, బండారు సురేందర్, బిర్రు మహేందర్, కందికట్ల విజయ్, రేణికుంట్ల దుర్గాప్రసాద్, మేకల రమేశ్, బొక్క సాంబారావు, అరవింద్, చిరంజీవి, స్మారత్, మొగిళి, వీరస్వామి పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం

కాజీపేట, ఏప్రిల్ 20: కాజీపేట 62వ డివిజన్‌లో శనివారం బీజేపీ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు ఇంటింటికి వెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ ప్రచారంలో నాయకులు దొంతు దేవేందర్ రెడ్డి, నార్లగిరి రామలింగం, 62వ డివిజన్ అధ్యక్షుడు భగవాన్ ఉపాధ్యాయతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మే 2న రెడ్ల కృతజ్ఞత సభ

జూలైవాడ, ఏప్రిల్ 20: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండ పోస్టల్ కాలనీలోని సంఘం కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు అర్కుల కిషన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా మే 2వ తేదీన కరీంనగర్‌లోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రావుల నర్సింహారెడ్డి, నల్ల రాజిరెడ్డి, ఎం.పాపిరెడ్డి, వీసం సురేం దర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జైహింద్ రెడ్డి, నర్సింహారెడ్డి, విజయారెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

59 సార్లు రక్తదానం చేసిన 'చిదురాల'



రక్తదానం చేస్తున్న శ్రీనివాస్

న్యూశాయంపేట, ఏప్రిల్ 20: హనుమకొండకు చెందిన సీనియర్ గణిత ఉపాధ్యాయులు చిదురాల శ్రీనివాస్ సుబేదారిలోని రెడ్‌క్రాస్ ఆర్గనైజేషన్‌లో శనివారం రక్తదానం చేశారు. దీంతో మొత్తంగా శ్రీనివాస్ 59సార్లు రక్తదానం చేసి ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 20 ఏళ్ల శ్రీనివాస్ తోబుట్టువు శస్త్ర చికిత్స కోసం 4 యూనిట్ల రక్తం అవసరం పడగా శ్రీనివాస్, శ్రీనివాస్ మిత్రులు రక్తం ఇచ్చి రక్తం ప్రాముఖ్యతను తెలుసుకున్న శ్రీనివాస్ అప్పటి నుండి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం కనీసం 3 సార్లు రక్తదానం చేస్తూ రికార్డు సృష్టించారు. గత 2017 సంవత్సరం జూన్ 12న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ నాటి రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ రక్తదాత అవార్డును శ్రీనివాస్ అందుకున్నారు.

కాంగ్రెస్ పార్టీకే వడ్డెర సంఘం మద్దతు

మడికొండ, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీకే వడ్డెర సంఘం మద్దతు అని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య స్పష్టం చేశారు. శనివారం మడికొండలోని జిల్లా అధ్యక్షుడు పల్లపు రాజేందర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన వడ్డెరల సమావేశంలో సమ్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తమకు న్యాయం జరుగుతుందని బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటే సీఎం చంద్రశేఖర్‌రావు వడ్డెరల అభివృద్ధికి పాటుపడడం అటుంచి గత ప్రభుత్వాలు ఇచ్చిన పథకాలను రద్దు చేసి వడ్డెరలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. సంచార జాతులలో వడ్డెరలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినందున లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు వడ్డెరల సంపూర్ణ మద్దతు తెలిపి ఆమె గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు పల్లపు రాజేందర్, డైరెక్టర్లు పల్లపు అర్జున్, పల్లపు మహేష్, వల్లెపు బాలరాజు, నాయకులు మన్నది బుచ్చయ్య, పల్లపు కుమార్, ఓర్సు సదానందం, సమ్మయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ నియామకం

హనుమకొండ టౌన్, ఏప్రిల్20: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీని జిల్లా అధ్యక్షురాలు పద్మ, మోర్చా జిల్లా అధ్యక్షుడు పూర్ణచారి శనివారం సంయుక్తంగా ప్రకటించారు. గ్రేటర్‌తోపాటు జిల్లాలోని మండలాల్లో కలిపి 51మందితో కమిటీని నియమించారు. ఏడుగురు ఉపాధ్యక్షులు, ఇద్దరు జనరల్ సెక్రటరీలు, ఏడుగురు కార్యదర్శులు, నలుగురు అధికార ప్రతినిధులు, ఒక కోశాధికారి, ఒక సోషల్ మీడియా కన్వీనర్, 26 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌తో కమిటీని నియమించారు.

అర్చకులుగా పనిచేయడం పూర్వజన్మ సుకృతమే..

అర్చక జాక్ కన్వీనర్ గంగు ఉపేంద్రశర్మ



అర్చకునికి రూ. 4 లక్షల చెక్ బహుకరిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 20: ఆలయాల్లో అర్చకులుగా పనిచేసి భక్తుల మన్ననలు పొందడం ప్రతీ అర్చకుడికి పూర్వజన్మ సుకృతమేనని తెలంగాణ అర్చక జాక్ కన్వీనర్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. ప్రస్తుతం ఆలయ వ్యవస్థలో రాజకీయ పెత్తనాలవల్ల అర్చకులుగా యువతరం ముందుకు రాకపోవడం దురదృష్టకరమన్నారు. శనివారం సాయంత్రం హనుమకొండ బ్రాహ్మణవాడలోని బ్రాహ్మణభవన్‌లో కరీమాబాద్ రామలింగేశ్వరస్వామి దేవాలయం బొమ్మలగుడిలో మూడున్నర దశాబ్దాలపాటు ప్రధాన అర్చకుడిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన శివపురం రామలింగారాధ్యకు దేవాదాయ పక్షాన కవిషనర్ హనుమంతరావు మంజూరు చేసిన రూ. 4 లక్షల చెక్కును ఆయన అందజేసి అర్చక సమాఖ్య పక్షాన ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. ఆగామశాస్త్ర ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించి తన పదవీకాలంలో భక్తుల అందరి విశ్వాసం చూరగొన్న రామలింగారాధ్య అర్చకులకు ఆదర్శ ప్రాయమని కొనియాడారు. అర్చక జాక్ ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్ మాట్లాడుతూ.. ఆలయాల్లో ఆధ్యాత్మికత పెంపొందింపజేయడానికి అర్చకులపాత్ర ఎంతో ఉందని, క్రమశిక్షణతో భక్తుల విశ్వాసం చూరగొన్న రామలింగారాధ్యను ఆయన అభినందించారు. ఆగమ విధులు, పూజా కార్యక్రమాలు, విధి విధానాలను యువ అర్చకులకు తెలియజెప్పి మార్గదర్శనంగా ఉండాలని కోరారు. పరాశరం రాజేశ్ కుమారాధ్య తదితరులు పాల్గొన్నారు. అర్చక సంక్షేమ నిధి నుంచి గ్రాట్యూటీని మంజూరు చేసిన దేవాదాయ శాఖ కమిషనర్ ఇతర ఉద్యోగులను అభినందించారు.

51 ఏళ్లు పూర్తి చేసుకున్న డీజిల్ లోకోషెడ్

దేశంలోనే బెస్ట్ డీజిల్ లోకో షెడ్ అవార్డు
వార్షికోత్సవానికి సిద్ధవుతున్న రైల్వే ఉద్యోగులు



కాజీపేట డీజిల్ లోకోషెడ్

కాజీపేట, ఏప్రిల్ 20: కాజీపేట జంక్షన్ పరిధిలోని డీజిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన డీజిల్ లోకోషెడ్ ఏర్పాటై నేటికి 51 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఏప్రిల్ 21, 1973 సంవత్సరంలో కాజీపేట జంక్షన్‌లో ప్రారంభమైన ఈ షెడ్ ఎలక్ట్రికల్, డీజిల్‌లోకోలను మెయింటనెన్స్ చేస్తూ దేశంలోనే బెస్ట్ షెడ్ అవార్డును సొంతం చేసుకుంది. 50 లోకోలతో ప్రారంభమైన ఈ షెడ్డు ప్రస్తుతం 140 ఎలక్ట్రికల్, 75 డీజిల్ లోకోలను మెయింటనెన్స్ చేస్తుంది. డీజిల్, ఎలక్ట్రికల్ కలిపి మెయింటనెన్స్ చేసే దేశంలోనే ఏకైక డీజిల్ షెడ్‌గా చెపుతుంటారు రైల్వే ఉన్నతాధికారులు. లోకోలలో ఎంతపెద్ద సమస్య అయినా, ఇండియన్ రైల్వేలో ఎక్కడా పరిష్కారం కాని సమస్య కాజీపేట డీజిల్‌షెడ్‌లో పూర్తి మరమ్మతులు చేసి పంపేందుకు అధికారులు, కార్మికులు పూర్తిస్థాయిలో శ్రమించి పరిష్కరిస్తారని ఎన్నోసార్లు నిరూపించి చూపించారు రైల్వే కార్మికులు. రైల్వే కార్మికుల సేవలకు గుర్తింపుగా 2023-2024 బెస్ట్ డీజిల్ లోకో షెడ్ అవార్డు ఎంపికైనందుకు రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ కాజీపేట అధికారులు, సిబ్బందిని అభినందించారు. అతితక్కువ రైల్వే కార్మికులతో ప్రారంభమైన ఈ షెడ్‌లో ప్రస్తుతం సుమారు 800 మంది కార్మికులు విధులు నిర్వర్తిన్నారు. 51 ఏళ్లు పూర్తిచేసుకున్న ఈ షెడ్‌లో ఈ నెలాఖరున పెద్దఎత్తున సంబరాలు చేసుకోవడానికి రైల్వే ఉద్యోగులు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

తరగతులు నిర్వహిస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20: ఇంటర్మీడియెట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న చింతగట్టు సమీపంలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాల అనుమతిని రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో ఎ.గోపాల్‌ను కలిసి కళాశాలపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కి కళాశాలను నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డీఐఈవో గోపాల్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ, టీఎస్ఎఫ్, బీఆర్ఎస్వీ, బీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, ఏబీఎస్ఎఫ్, గిరిజన శక్తి, ఎంఎస్ఎఫ్ నుంచి హకీం నవీద్, కన్నం సునిల్, బొట్ల మనోహర్, బైరిపాక ప్రశాంత్, గడ్డం నాగార్జున్, కుమ్మరి శ్రీనాథ్, అరిస్టాటిల్, నాగవరం మణితేజ, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్ చెరువును ట్యాంక్ బండ్‌గా మార్చాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 20: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్ ఊర చెరువును ట్యాంక్‌బండ్‌గా మార్చి సుందరీకరించాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం 56వ డివిజన్‌లోని వివేక్‌నగర్ కాలనీలో సంస్థ రాష్ట్ర కో కన్వీనర్ పింగిళి అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువు భూగర్భ జలాల పరిరక్షణకు రిజర్వాయర్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్‌ను కోరారు. గోపాల్‌పూర్‌లోని సర్వే నంబర్ 88లో బతుకమ్మ ఉత్సవ ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. 57వ డివిజన్‌లోని లష్కర్‌సింగారం సర్వేనంబర్ 266లోని ప్రభుత్వ స్థలంలో కూరగాయల మార్కెట్, రైతు బజార్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక జిల్లా ప్రతినిధులు రమేష్, బ్రహ్మం, రాజేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలి

(5వ పేజీ తరువాయి)

కోరారు. ఎన్నికల అనంతరం పాఠశాలలో సమస్యలు తీర్చి, సకల సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ అన్నారు.

అనంతరం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కేంద్రాలలోని వసతులపై కలెక్టర్ ఆరా తీశారు. అక్కంపేట ప్రభుత్వ పాఠశాలను, పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మౌలిక వసతులైన మరుగుదొడ్లు వేర్వేరుగా ఉన్నాయా..? లేవా..? అని వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో బోధిస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రాల్లో అందించే సేవలపై ఆరా తీశారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజేందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చేతన్ కుమార్ రెడ్డి, పీఆర్ ఏఈ లత, ఏపీవో రాజిరెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి జ్యోతిరాణి, ఏపీఎం లలితాదేవి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ముద్దం కృష్ణం రాజు, పంచాయతీ కార్యదర్శులు సునీల్, లావణ్య, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో వేగం పెంచండి

(5వ పేజీ తరువాయి)

అశ్విని తానాజీ వాకడే శానిటేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఎస్ఐలకు తమకు కేటాయించిన డివిజన్‌లు ఎన్ని కిలోమీటర్ల పొడవు ఉన్నాయి? రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఎన్ని ఉన్నాయి అనేది పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక ఉండాలన్నారు. పని పూర్తి కాగానే ప్రతీ రోజు స్థానికుల సంతకాలు తీసుకుని ప్రత్యేక రిజిస్టర్ మెయింటెన్ చేయాలన్నారు. శానిటేషన్ అధికారుల తీరుపై డిప్యూటీ కమిషనర్‌లు, శానిటేషన్ ప్రధాన అధికారి పర్యవేక్షణ ఉండాలన్నారు. వారంలో రెండు సార్లు ప్రజా మరుగుదొడ్లను పర్యవేక్షించి శుభ్రం చేయించాలన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. అదే విధంగా మలేరియా సిబ్బంది ఏయే ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తున్నారో పుస్తకంలో రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, వెటర్నరీ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, నరేందర్‌లతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అలనాటి కథ

నిజాం కోడలైన టర్కీ రాకుమారి

కొందరిని ఒక్క సారి కలిస్తే చాలు... మనపై చెరగని ముద్ర వేస్తారు. అలాంటి వారిలో ప్రిన్సెస్ దురేషేవార్ ఒకరు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వ్యవస్థాపకుల్లో ఒకరుగా, బేగంపేట ఎయిర్‌పోర్ట్ మొదటి టెర్మినల్‌కు శంకుస్థాపకురాలిగా హైదరాబాద్ చరిత్రలో ఆమెకు ఒక సుస్థిరమైన స్థానం ఉంది. నాకు 11 ఏళ్లు ఉన్నప్పుడు- నేను తొలి సారి ప్రిన్సెస్ దురేషేవార్‌ను చూశాను. ఆ తర్వాత ఆమెతో నా పరిచయం పెరిగింది. ఓటోమన్ సామ్రాజ్యానికి వారసురాలైన ప్రిన్సెస్ దురేషేవార్ హైదరాబాద్‌కు రావటం, ఇక్కడ స్థిరపడటం ఒక ఆసక్తికరమైన కథ.

ఓటోమన్ సామ్రాజ్యంపై తిరుగుబాటుదారులు దాడి చేసినప్పుడు- సుల్తాన్ ముజీబ్ తన ముద్దుల కూతురు దురేషేవార్‌తో, ఇతర కుటుంబ సభ్యులతో కలిపి ఇస్తాంబుల్ నుంచి లండన్‌కు చిన్న బోటులో వెళ్లిపోయారు. ఈ ప్రయాణం దురేషేవార్ జీవితాన్నే మార్చేసింది. టర్కీలో యువరాణిగా దురేషేవార్ అసలైన రాజభోగాలు అనుభవించేది. కానీ లండన్‌కు వచ్చే ముందు తన నగలను, తనకు ఇష్టమైన వస్తువులను వదిలేసి వచ్చేయాల్సి వచ్చింది. ఆఖరికి తను ధరించే వజ్రాల కిరీటాన్ని కూడా వదిలేయాల్సి వచ్చింది. లండన్‌లో సుల్తాన్ ముజీబ్‌కు, ఆయన కుటుంబానికి సాయం చేసేంది హైదరాబాద్ నిజామే! లండన్‌లో ఉన్న హైదరాబాద్ హౌస్‌లో వారికి బస ఏర్పాటు చేయటమే కాకుండా- వారి హోదాకు తగినట్లు పరివారాన్ని, ఇతర సౌకర్యాలను కూడా నిజాం అందించారు. ఇలా కొద్ది కాలం గడిచింది. దురేషేవార్ పెద్దదయింది. ఆ సమయంలో ఆమెను ప్రపంచంలోని అందగత్తెలలో ఒకరిగా చెప్పుకొనేవారు. ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్‌ల నుంచి అనేకమంది రాజకుమారులు ఆమెను పెళ్లిచేసుకోవటానికి ముందుకు వచ్చారు. రాయబారాలు పంపారు.





ప్రిన్సెస్ దురేషేవార్

కానీ సుల్తాన్- తనకు నిజాం చేసిన సాయాన్ని మర్చిపోలేదు. నిజాం కుమారుడు ప్రిన్స్ ఆజాంతో ఆమెకు వివాహం చేశారు. లండన్‌లో జరిగిన ఆ వివాహానికి ప్రపంచంలోని ముఖ్యమైన రాజకుటుంబాలకు చెందిన వారందరూ హాజరయ్యారు.

ప్రిన్సెస్ దురేషేవార్ హైదరాబాద్‌కు తొలిసారి వచ్చినప్పుడు- హైదరాబాద్‌లో అనేక ఉత్సవాలు జరిగాయి. ప్రిన్స్ ఆజంకు, ప్రిన్సెస్ దురేషేవార్‌కు హైదరాబాద్ ప్రజలు ఘన స్వాగతం చెప్పారు. తొలి రోజుల్లో వారు బెల్లా విస్టా ప్యాలెస్‌లో నివాసం ఉండేవారు. నిజాం ఆమెకు 'ప్రిన్సెస్ ఆఫ్ బీరర్' అనే బిరుదు కూడా ఇచ్చారు. ప్రిన్సెస్‌ను నేను తొలిసారి చూసింది మా ఇంట్లోనే! నాన్న ధన్‌రాజ్‌గిరి వారి గౌరవార్థం ఒక పార్టీ ఇచ్చారు. నాకు అప్పుడు 11 ఏళ్లు అనుకుంటా. ప్రిన్స్ ఆజాం, ప్రిన్సెస్ దురేషేవార్ వస్తున్నారనే వార్త మాకు ముందే తెలిసింది. ఆమె గురించి ఇంట్లో వారు మాట్లాడుకుంటుంటే విన్నామేమో... ఆమెను చూడాలనే ఆతృతతో పిల్లలందరం డైనింగ్ రూమ్ పైన ఉన్న రూమ్‌లో చేరాం. అక్కడ నుంచి ఆమెను తొలిసారి చూశా! 'నిజంగానే ప్రిన్సెస్‌లా ఉంది' అనుకున్నా! ఆ తర్వాతి కాలంలో ప్రిన్సెస్ దురేషేవార్ అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొవటం మొదలుపెట్టారు. మహిళలకు విద్య అవసరమని వాదించిన వారిలో, పరదాకు వ్యతిరేకంగా కూడా మాట్లాడినవారిలో ఆమె కూడా ఒకరు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రిన్సెస్ నిలోఫర్‌కు ప్రిన్సెస్ దురేషేవార్ కజిన్ అవుతారు. దాంతో వారిద్దరి మధ్య మంచి స్నేహం ఉండేది. ఆ రోజుల్లో సాధారణంగా రాజకుటుంబాలలో మహిళలు బయటకు వచ్చేవారు కారు. కానీ నిజాం తన కోడళ్లకు స్వేచ్ఛను ఇచ్చారు. వారు ఫ్రెంచ్ పత్రికల్లో వ్యాసాలు రాసినట్లు జ్ఞాపకం.

ప్రిన్సెస్ దురేషేవార్‌ను నేను ఆ తర్వాతి కాలంలో అనేక సందర్భాలలో కలిసాను. ఒకసారి మహబూబియా కాలేజీలో బహుమతి ప్రదానోత్సవానికి ఆమె వచ్చారు. నిజాం రాజవంశానికి చెందిన మహిళ ఒక బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రావటం అదే తొలిసారి. చాలా మందికి అది ఒక మరచిపోలేని సందర్భం. లండన్‌లో ప్రిన్సెస్ ఎస్రా ఒకసారి పార్టీ ఇచ్చారు. ఆ పార్టీకి నేను వెళ్లాను. నాకు దేరేషేవార్ కనిపిస్తే- ఆదాబ్ చేశా. ఆమె నవ్వుతూ నన్ను పలకరించారు. తన పక్క కూర్చోమని పిలిచారు. ప్రిన్సెస్ ఇస్రా స్నేహితురాలినని తెలుసుకొని నాతో సంభాషించటం ప్రారంభించారు. నా గురించి, నా కుటుంబం గురించి మాట్లాడారు. ఆ సంభాషణ తర్వాత నాకు ఆమెపై ఉన్న గౌరవం మరింత పెరిగింది. చౌమహల్లా ప్యాలెస్ ప్రారంభోత్సవంలో కూడా ఆమె నన్ను గుర్తుపట్టి పలకరించిన జ్ఞాపకం ఉంది. నేను ఆల్ ఇండియా ఉమెన్ కాన్ఫరెన్స్‌కు






అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో అనేకసార్లు ఆమెను మీటింగ్‌లలో కలిసాను. ఆ మీటింగ్‌ల తర్వాత ప్రిన్సెస్ దురేషేవార్ నాకు రాసిన అనేక ఉత్తరాలు ఇప్పటికీ నా దగ్గర పదిలంగా ఉన్నాయి.

ఎక్కడో టర్కీలో పుట్టి, లండన్‌లో గడిపి, హైదరాబాద్ వచ్చి స్థిరపడిన దురేషేవార్- మన సంస్కృతి సంప్రదాయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. హైదరాబాద్ వచ్చిన తర్వాత ఆమె ఉర్దూ నేర్చుకున్నారు. ఎప్పుడూ మన చీరలోనే కనిపించేవారు. రచయితలను, కళాకారులను ప్రోత్సహించేవారు. ఒకసారి ఆమె నాకు ఒక పుస్తకాల షాపులో కనిపించారు. ఆమెకు ఆదాబ్ చెప్పాలో, నమస్కారం పెట్టాలో తెలియక ఒక క్షణం తటపటాయించి... నమస్కారం చేశాను. ఆమె వెంటనే నవ్వుతూ నాకు నమస్కారం చేశారు. నిజాం కుటుంబీకులు నమస్కారం చేయటం అరుదైన విషయం. కానీ ప్రిన్సెస్ దురేషేవార్- హైదరాబాద్ సంస్కృతిలో మమేకం అయిపోయారనటానికి ఇదొక ఉదాహరణగా చెప్పవచ్చు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆమె లండన్‌లో స్థిరపడ్డారు. అక్కడే మరణించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో అనేక మంది పాత్ర పరోక్షంగా ఉంది. అలాంటి వారిలో ప్రిన్సెస్ దురేషేవార్ ఒకరు. అందుకే ఆమె గురించి తలుచుకోవాల్సిన అవసరం ఉంది.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



తెలుగు చలనచిత్ర రంగంలోని సీనియర్ నటుల్లో రాజా రవీంద్ర ఒకరు. కేవలం నటుడిగానే కాకుండా అనేకమంది హీరోలకు మేనేజర్‌గా, నిర్మాతగా బహుముఖ పాత్రలు పోషిస్తున్నారు. ఆయన ప్రధానమైన పాత్రలో నటించిన 'సారంగదరియా' చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రాజారవీంద్రను 'నవ్య' పలుకరించింది.

వేషం చిన్నదైనా... పెద్దదైనా అదే ఉత్సుకత!

'సారంగదరియా' ఎలా ఉండబోతోంది?

ఇది మన చుట్టూ ఉన్న సమాజంలోని కథ. దీనిలో పాత్రలన్నిటినీ మనం ప్రతిరోజూ చూస్తేనే ఉంటాం. ఒక మధ్యతరగతి తండ్రి... తాను ఎన్నో ఆశలు పెట్టుకొని పెంచిన ముగ్గురు పిల్లలు మూడు చెడు మార్గాల్లోకి వెళితే, ఆ సమస్యను ఎలా పరిష్కరించాడనేదే ఈ కథ. చాలా హృద్యంగా ఉంటుంది. మన సమాజంలో వస్తున్న మార్పులకు అద్దం పడుతుంది. చాలా మంది తండ్రులు ఈ కథకు కనెక్ట్ అవుతారు. సన్నివేశాలన్నీ మనకు తెలిసినట్లే అనిపిస్తాయి. చాలాకాలం తర్వాత ఒక మంచి పాత్ర... ఒక ముఖ్యమైన పాత్రలో నటించాను.

ఇటీవల... మధ్యతరగతి వారికి సంబంధించిన కథలు తక్కువగా వస్తున్నాయి కదా!

ప్రేక్షకుల్లో 90శాతం మంది మధ్యతరగతివారే. కానీ వారిలో ఎక్కువమంది పాన్ ఇండియా ఆకర్షణలో పడ్డారు. సమాజంలోని వాస్తవికతకు దూరం అయిపోతున్నారు. భారీగా రకరకాల హంగులతో తీస్తేనే సినిమా చూస్తున్నారు. లోబడ్జెట్ సినిమాలు థియేటర్‌లో రిలీజ్ కావటం కష్టమవుతోంది. దీనికి ఓటీటీ కూడా ఒక కారణమే. ఓటీటీలో భారీ బడ్జెట్ చిత్రాలే కొంటున్నారు. దాంతో నిర్మాతలు కూడా వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా మధ్యతరగతి వారికి సంబంధించిన కథలు తగ్గిపోతున్నాయి. అయితే ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. కొన్నిసార్లు కంటెంట్ బలంగా ఉన్న కథలకు ఆదరణ లభిస్తోంది. 'బలగం'లాంటివి ఆ కోవకు వస్తాయి.

నేటి సినిమాల్లో హీరో క్యారెక్టర్ల ప్రవర్తన పట్ల కూడా కొంత విమర్శ వినబడుతోంది?

'అర్జున్‌రెడ్డి, డీజే టిల్లు' లాంటి విజయవంతమైన సినిమాలను దృష్టిలో పెట్టుకొని అడుగుతున్నారనుకుంటున్నా! నా ఉద్దేశంలో సినిమాకు ప్రేక్షకులు ఎంటర్‌టైన్‌మెంట్ కోసం వస్తారు. దీనిలోనే సందేశం కూడా ఉండాలి. మందును తీపి గుళికల్లో పెట్టి ఇచ్చినట్లు ఉంటే మంచిది. లేకపోతే ప్రేక్షకుడికి బోర్ కొడుతుంది. సోషల్ మీడియా వ్యాప్తి తర్వాత ఏకాగ్రతతో కూర్చుని ఎవరూ ఏ కంటెంట్ చూడటంలేదు. ఏకాగ్రత చెదురుతోందనే సమయానికి వారికో థ్రిల్, కొత్తదనం కావాలి. ఈ మధ్య 'డీజే టిల్లు' లాంటి సినిమాలు హిట్ కావటానికి కారణం... పాత్రల చిత్రీకరణలో కొత్తదనం. కొత్త తరాన్ని ఆకర్షించే డైలాగులు. ఇవి చురుక్కుమనిపించాలి. సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలి. అప్పుడే సినిమా హిట్ అవుతుంది.

అయితే కథకు ప్రాధాన్యత పోయినట్లేనా? మన దగ్గర మంచి కథలు రావటం లేదనే వాదన ఉంది కదా!

మనకు మంచి కథలు రావటంలేదనేది పాక్షికంగా సత్యం. అయితే మంచి రైటర్స్ కొరత అయితే ఉంది. ఎందుకంటే గత 20 ఏళ్లుగా రైటర్సే డైరక్టర్స్‌గా మారిపోతున్నారు. ఒకప్పుడు రైటర్స్ వేరు. డైరక్టర్స్ వేరు. రచన వేరు. అన్నీ వేర్వేరు క్రాఫ్ట్స్. ఒక రచయిత రాసింది చదివి మనకు నచ్చినట్లు ఊహించుకోవచ్చు. అందరికీ నచ్చేలా కథను తెరకెక్కించేవాడే నిజమైన డైరక్టర్. కొందరికి రెండింటినీ సమర్థించే సామర్థ్యముంటుంది. లేకపోతే సమస్యలు ఎదురవుతాయి. శ్రీధర్ పన్నా, డైమండ్ రత్నబాబు, మచ్చ రవి లాంటి మంచి రైటర్స్ దర్శకత్వం మార్గంలోకి వెళ్లారు. నిరాశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ఇక్కడ ఇంకో విషయం... మంచి కథలు దొరకకపోవటంవల్ల ప్రాజెక్ట్ టేకప్ చేయని దర్శకులు కూడా ఉన్నారు.

మీ దృష్టిలో ఓటీటీవల్ల చిత్ర నిర్మాణంలో ఎలాంటి సమస్యలు వచ్చాయి?

నా ఉద్దేశంలో సినిమాలు తీయాలా వద్దా అని కొందరు పెద్ద నిర్మాణ సంస్థలు సందిగ్ధంలో పడటానికి ఓటీటీలే కారణం. ఓటీటీ రాకముందు బడ్జెట్‌లు కంట్రోల్‌లో ఉండేవి. అవి వచ్చాక ఒక దశలో ఆ కంపెనీలు సినిమాకు అయిన ఖర్చును చెల్లించి సినిమాలు కొనటం మొదలుపెట్టాయి. ఉదాహరణకు ఒక సినిమాకు 40 కోట్లు అయిందనుకొందాం. 40 కోట్లు పెట్టి ఒక ఓటీటీ కంపెనీ కొనేస్తే నిర్మాతకు థియేటర్స్ మీద.. ఇతర మార్కెట్ల మీద.. మిగిలిన మార్గాల ద్వారా వచ్చేది లాభమే కదా! దీంతో హీరోలు, డైరక్టర్లు రెమ్యూనిరేషన్స్ పెంచేశారు. ప్రొడక్షన్ కాస్ట్ కూడా పెరిగిపోయింది. ప్రస్తుతం ఎదురవుతున్న చిక్కేమిటంటే... ఓటీటీ కంపెనీలు భారీ బడ్జెట్ సినిమాలు మాత్రమే కొనటం మొదలుపెట్టాయి. వారిని ఆకర్షించాలంటే భారీ బడ్జెట్ చిత్రాలే తీయాలి. అయితే ఆ సినిమాకు అంత రికవరీ సామర్థ్యం ఉందా? లేదా? అనే ఆలోచన లేకుండా కొందరు సినిమాలు తీస్తున్నారు. హిట్ అయితే సరే... లేకపోతే మొత్తానికే మోసం వస్తోంది. వీటిని గమనించే చాలా కాలంగా నిర్మాణ రంగంలో ఉన్న నిర్మాతలు పక్కకు తప్పుకున్నారు. మీరు గమనిస్తే... 'సురేష్ ప్రొడక్షన్స్, అన్నపూర్ణ స్టూడియోస్' వంటివారు సినిమాలు తీయటంలేదు. ఒకటి రెండేళ్లలో ఫలితాలు కనబడతాయి. చెరువుల్లో చేపలు తేలినట్లు చాలా మంది తేలిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

> **ప్రతి రోజూ కొత్తదే...**
>
> 
>
> వేషం చిన్నదైనా.. పెద్దదైనా.. నాకు ఒకే విధమైన ఎక్సైట్‌మెంట్ ఉంటుంది. ఎందుకంటే వేసే పాత్ర కొత్తగా ఉంటుంది. పని చేసే టీమ్ కొత్తదే అయి ఉంటుంది. దాంతో చాలా ఉత్సాహంగా అనిపిస్తుంది. ఇంట్లో కూర్చుంటే ఈ ఉత్సాహం ఉండదు. అందుకే నిజమైన నటుడు చచ్చేదాకా నటిద్దామనే అనుకుంటాడు.

కొన్నిసార్లు భారీ బడ్జెట్ సినిమాలు దెబ్బ తింటున్నాయి. దీనికి ప్రేక్షకుల దగ్గరకు సినిమాను తీసుకువెళ్లకలేకపోవటం కూడా ఒక కారణమంటారా?

సోషల్ మీడియా ఒక గేమ్ ఛేంజర్ రోల్‌ను పోషిస్తోంది. పట్టణ ప్రాంతాలే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. అయితే నా ఉద్దేశంలో సోషల్ మీడియాకు ఎలాంటి వ్యూహాలను అనుసరించాలి? ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి? అనే విషయంలో చాలా మంది నిర్మాతలకు సరైన అవగాహన లేదు. ఉదాహరణకు ఒక సినిమా విడుదలకు ముందు కొన్ని కోట్ల రూపాయలతో మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ మార్కెటింగ్‌వల్ల ఎంత లాభముంది? ఎంత మందికి సినిమా గురించి తెలుస్తోంది? అనే విషయంపై శాస్త్రీయ అంచనాలేవీ లేవు. ఎక్కువ మంది నిర్మాతలు మార్కెటింగ్ స్టాఫ్‌పైనే ఆధారపడతారు. ఒక సినిమా ప్రమోషన్ ఒక కాలేజీలో చేశారనుకుందాం. అది హిట్ అయితే అందరూ కాలేజీలకు వెళ్లిపోతారు. ఒక గేమ్‌షోకు వెళ్తే ప్రేక్షకులకు దగ్గరవుతామని ఎవరో చెబుతారు. ప్రమోషన్‌కు అక్కడకు వెళ్లిపోతారు. ఒకప్పుడు సీరియల్స్‌లో గెస్ట్ ఆర్టిస్ట్‌లుగా వెళ్లేవారు. ఇలా ఒక కచ్చితమైన వ్యూహం లేకుండా మార్కెటింగ్ చేయటంవల్ల ప్రయోజనం ఉండదు. నా ఉద్దేశంలో ఇది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. దీనిపై ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, ప్రొడ్యూసర్స్ గిల్డ్ వంటివి చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముంది.

కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే నిర్మాతలు మార్కెటింగ్ విషయంలో అజాగ్రత్తగా ఉంటారంటారా?

ఉండరు. కానీ సినిమా విడుదలయ్యే టెన్షన్‌లో ఉంటారు. ఒకేసారి వంద పనులు చూసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ఇతరులపై ఎక్కువ ఆధారపడతారు. ఎక్కడో తప్పు జరుగుతోందని తెలుస్తుంది. సినిమా ఫలితం వచ్చిన తర్వాత ఇక ఈ విషయాన్ని పట్టించుకోరు. రిలాక్స్ అయిపోతారు. నా ఉద్దేశంలో ఇది ఏ ఒక్కరి సమస్యో కాదు. అందరు నిర్మాతలు కలిసికట్టుగా కూర్చుని చర్చించాలి. అప్పుడే ఒక పరిష్కారం దొరుకుతుంది.

> **పైరసీ రాక్షసి...**
>
> పైరసీ కొన్ని వేల కోట్ల వ్యాపారం. మన పురాణాల్లో ఒక రాక్షసికి ఒక రక్తపు బొట్టు కింద చిందినా... ఆ రక్తపు బొట్టు నుంచి మళ్లీ పుట్టే అవకాశం బ్రహ్మ ప్రసాదిస్తాడు. అప్పుడు ఆ రాక్షసి ఎవరికీ లొంగదు. పైరసీ కూడా అలాంటిదే! ఎప్పటికప్పుడు దీనిపై పోరాటం చేస్తూనే ఉండాలి. కొత్త సినిమాలు వచ్చిన వెంటనే ఇంతకు ముందు వెబ్‌సైట్లలో పెట్టేవారు. ఇప్పుడు లింక్స్ వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా అందరికీ చేరిపోతున్నాయి. ఈ మధ్య 'ఫ్యామిలీ స్టార్' సినిమానే తీసుకోండి. విపరీతంగా పైరసీ అయింది. పైరసీ లింక్ అందుబాటులోకి వచ్చేస్తే ప్రేక్షకుడు థియేటర్‌కు రాడు. కలెక్షన్లు పడిపోతాయి. ఫోన్‌లో సినిమాలు చూసే సౌలభ్యం వచ్చిన తర్వాత దీనిని అరికట్టడానికి కొత్త మార్గాలు అన్వేషించాలి. ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ దీనిపై పోరాటానికి ఒక సెల్‌ను కూడా ఏర్పాటు చేసింది. కానీ పెద్దగా ఫలితం ఉన్నట్లు అనిపించటం లేదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఆమె ఒకప్పుడు విశ్వసుందరిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. ఆ తర్వాత నటిగా రాణించింది. ప్రస్తుతం సినిమాలతో పాటు ఓటీటీల్లోనూ నటిస్తోంది. ఆమే.. లారా దత్తా. ఆమె నటించిన 'రణ్‌నీతి- బాలాకోట్ బియాండ్' వెబ్‌సిరీస్ త్వరలో విడుదలవుతున్న సందర్భంగా లారా దత్తా గురించి కొన్ని విషయాలు...

అలాంటి రోల్స్‌లో నటించాలనుంది



ఇన్‌స్టాగ్రామ్‌లో లారా దత్తాకు పదమూడు లక్షల ఫాలోవర్లు ఉన్నారు. సినిమా విశేషాలతో పాటు యాడ్స్ కుటుంబ విశేషాలను షేర్ చేస్తుంటుంది. అధిక శాతం తన భర్త (టెన్నిస్ ప్లేయర్ మహేష్ భూపతి), కూతురు సైరాతో దిగిన ఫొటోలే ఉంటాయి. ఆ మధ్య 'హీరోల గాళ్‌ఫ్రెండ్‌గానో, భార్యగానో నటించటం పరమబోర్. విసిగిపోయా. కొత్త పాత్రలు కావాలి' అంటూ ఓ ఇంటర్వ్యూలో లారా మాట్లాడింది. ఆ తర్వాత ఆమె పంథానూ మార్చుకున్నట్లు అనిపిస్తుంది.

అలా ఇండస్ట్రీలోకి...

లారా దత్తా ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో పుట్టి పెరిగింది. తండ్రి సిక్కు కుటుంబానికి చెందిన వ్యక్తి. అమ్మ ఆంగ్లో ఇండియన్. తన తండ్రి వింగ్ కమాండర్‌గా పని చేశారు. అంతేనా మూడు యుద్ధాల్లో కూడా పాల్గొన్నారు. తండ్రి వల్లనే తనలో క్రమశిక్షణ అలవడిందని చెబుతారీమె. ఇకపోతే చిన్నప్పుడే బెంగుళూరుకి వాళ్ల కుటుంబం షిఫ్ట్ అయింది. బెంగుళూరులోనే లారా దత్తా చదివింది. ఎకనిమిక్స్‌లో డిగ్రీ చదవటానికి ఆమె ముంబయి యూనివర్శిటీలో చేరింది. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, కన్నడ, పంజాబీ భాషలు మాట్లాడగలదు. అలా ఆమె ఆ తర్వాత ఫ్యాషన్ వరల్డ్‌లోకి వచ్చింది. ర్యాంప్ మీద నడవటమే కాదు.. 2000 సంవత్సరంలో ఏకంగా విశ్వసుందరి కిరీటం అందుకుంది. అలా ఆమె పేరు మార్మోగిపోయింది. ఆ పేరుతో ఆమెకు బాలీవుడ్ అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. అలా ఆమె నటించిన తొలి చిత్రం 'అందాజ్'. ఇది విడుదలైంది 2003లో. తొలి చిత్రంతోనే బెస్ట్ డెబ్యుడెంట్‌గా ఫిల్మ్‌ఫేర్ అవార్డు దక్కించుకుంది. 'నో ఎంట్రీ', 'హౌస్‌ఫుల్', 'బిల్లు బార్బర్', 'డాన్ 2', 'బ్లూ' లాంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.



కెరీర్, పర్సనల్ లైఫ్...

టెన్నిస్ ప్లేయర్ మహేష్ భూపతితో కలసి 2011లో ఏడడుగులు నడిచింది. వీరికి సైరా అనే కూతురు ఉంది. ఎంత బిజీగా ఉన్నా.. కుటుంబ జీవితం మీద పడకూడదనేది లారా దత్తా ఆలోచన. పెళ్లయ్యాక 'చలో ఢిల్లీ' అనే చిత్రంలో నటించటంతో పాటు నిర్మాణ బాధ్యతలూ చూసుకుంది. 'అజహర్', 'వెల్‌కమ్ టు న్యూయార్క్' తర్వాత బ్రిటీష్ హిస్టారికల్ డ్రామా సిరీస్‌లో నటించింది. మూడేళ్ల కిందట వచ్చిన 'బెల్‌బాటమ్' సినిమా బాక్సాఫీస్ వద్ద కుదేలయినప్పటికీ ఇందిరాగాంధీగా లారా దత్తా నటన ప్రశంసలు అందుకుంది. అలా ఆమె మళ్లీ మార్కెట్‌లో క్రేజ్ సంపాదించుకుంది.

అలాంటి పాత్రలే కావాలి..

ఐఫా అవార్డుల ఫంక్షన్ హోస్ట్, మిస్ దివా కాంటెస్టులకు హాజరవ్వటంతో పాటు యాడ్స్, యోగా వీడియోలతోనూ ప్రేక్షకులకు ఎప్పుడూ టచ్‌లోనే ఉంది లారా. 'రొడ్డకొట్టుడు పాత్రలను ఆపేసి ఆడవాళ్ల సమస్యలపై ఇప్పుడు సినిమాలొస్తున్నాయంటే ప్రముఖ కారణం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌సే' అంటుందీమె. 'నటనంటే ఇష్టం. ఫ్యామిలీ సపోర్టు ఉంది. అందుకే సైరా నెలల పిల్ల ఉన్నప్పుడూ 'డేవిడ్' చిత్రం సెట్స్‌కు వెళ్లాను. ఫీడింగ్ ఇవ్వటంతో పాటు చేయాల్సిన సన్నివేశాలూ చేశాను' అంటుంది లారా దత్తా. తన కూతురు సైరా వల్ల తన ఆలోచనలు మారిపోవటంతో పాటు హ్యామనిస్టుగా తయారయ్యానంటుంది లారా. ఈ విషయంలో తన కూతురే టీచర్ అంటుంది. 'విభిన్నమైన కథలతో ఓటీటీ దర్శకులు వస్తున్నారు. ఇందిరాగాంధీ లాంటి కొత్త పాత్రలు కావాలి. భవిష్యత్‌లో స్ఫూర్తివంతమైన రోల్స్‌లో నటించాలని ఉంది' అంటుంది లారా దత్తా.

> **ఎముకల్లో గట్టిదనం...**
>
> ఇంటికి పిల్లర్లు ఉన్నట్లు.. మన శరీరానికి ఎముకలు ఉన్నాయి. ముఖ్యంగా ఎముకల ఆరోగ్యానికి కాల్షియం ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. పాల ఉత్పత్తుల్లో ఇది పుష్కలం. అయితే పాల ఉత్పత్తులను తీసుకోనివారు ఎలాంటి ఫుడ్‌ను తీసుకోవాలో తెల్సుకుందాం.
>
> • చేపల్లో కాల్షియం, విటమిన్-డి, ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. దీని వల్ల ఎముకలు గట్టితనానికి ఎంతో మంచి ఆహారమిది.
>
> • స్వీట్ పొటాటోల్లో మాంగనీస్‌తో పాటు కాల్షియం ఉంటుంది. పాలకూర, బ్రొకోలీ, తోటకూరతో పాటు తాజా కూరగాయలూ తినాలి. పల్లీలు, జీడిపప్పు, బాదం లాంటి నట్స్‌లో కాల్షియం పుష్కలం. దీని వల్ల ఎముకలు గట్టిగా ఉంటాయి.
>
> • నిమ్మ, నారింజ, బొప్పాయి, స్ట్రాబెర్రీ, మామిడిపండ్లు లాంటివి కొల్లాజిన్ అనే పదార్థాన్ని విడుదల చేస్తాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయి.
>
> • బీన్స్ గింజలు ఎముకలకు మేలు చేస్తాయి. ముఖ్యంగా తెల్లని బీన్స్‌లో కాల్షియం, పొటాషియం, మాంగనీసు పుష్కలం.
>
> 

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rldeTyb లో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TA1DxkH లో చదవండి.



మేమే బాధితులం...!

టీడీపీ దుకాణం బంద్ అవుతుండటంతో ఏం చేయాలో తెలియక... రాష్ట్రమంతా మాపై దాడులు చేస్తున్నారు. తిరిగి వాళ్లే బాధితుల మాదిరి పోజులిస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. నిజానికి మేమే బాధితులం. మా నిగ్రహాన్ని చేతగానితనంగా తీసుకోవద్దు. మేం కన్నెర్ర చేస్తే టీడీపీ వాళ్లు రోడ్లపై తిరగలేరు.

- సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు





కడప ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న షర్మిల

అన్నా వదినలకు షర్మిల బాకీ!

రూ. 82 కోట్లకుపైగా అప్పిచ్చారని వెల్లడి

» తెలుగు రాష్ట్రాల్లో 8 కేసులు.. అఫిడవిట్‌లో ఏపీసీసీ చీఫ్

కడప, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శనివారం కడప ఎంపీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆమె సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలను వెల్లడించారు. అప్పుల విషయానికి వస్తే షర్మిల తన సొంత అన్న, వదినలకే రూ.82 కోట్లకు పైగా బకాయి ఉన్నారు. అన్న జగన్ రూ.82,58,15,000, వదిన భారతి రూ.19,56,620 షర్మిలకు అప్పులు ఇచ్చారు. ఇక, షర్మిల తన భర్త అనిల్‌కు రూ.30 కోట్లు అప్పు ఇచ్చారు. తల్లి విజయలక్ష్మి ద్వారా భర్త అనిల్‌కు రూ.40 లక్షలు అప్పు ఇప్పించారు. షర్మిల పేరుతో బ్యాంకు డిపాజిట్లు రూ.14.64 కోట్లు ఉండగా, భర్త అనిల్ పేరిట రూ.3.80 కోట్లు ఉన్నాయి. షర్మిల పేరిట షేర్లు రూ.2 కోట్లు, అనిల్ పేరిట రూ.2.50 కోట్లు ఉన్నాయి. ఆస్తుల విషయానికి వస్తే షర్మిల పేరుతో రూ.123 కోట్లు, భర్త అనిల్ పేరుతో రూ.40 కోట్లు ఉన్నాయి. అదేవిధంగా షర్మిలకు ఉన్న బంగారు ఆభరణాల విలువ రూ.3.69 కోట్లు, వజ్రాల విలువ రూ.4.61 కోట్లు ఉన్నట్టు అఫిడవిట్‌లో వివరించారు. షర్మిలకు బ్యాంకు ఖాతాల్లో నగదు రూ.22.09 లక్షలు ఉంటే, ఇడుపులపాయలో 39 ఎకరాల భూమి ఉందని తెలిపారు. కేసుల విషయానికి వస్తే.. షర్మిలపై ఏపీ తెలంగాణలో 8 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

ఉద్యోగాలు కావాలా.. గంజాయి కావాలా..?

జగన్‌వి నకిలీ నవరత్నాలు.. మావి సూపర్ సిక్స్: బాబు.. మేం గెలిచాక సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

ఏది కావాలో రాష్ట్ర ప్రజలే తేల్చుకోవాలి
ప్రజాగళంలో టీడీపీ అధినేత చంద్రబాబు

(గూడూరు/పాదలకూరు/సత్యవేడు-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని.. జగన్ పార్టీ గెలిస్తే ఇంటింటికీ గంజాయి వస్తుందని.. అరాచకం పెరిగిపోతుందని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. తాము గెలిచాక అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాంతరంగా అమలు చేస్తామని.. ఏది కావాలో రాష్ట్ర ప్రజలే ఆలోచించుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత వారిదేనన్నారు. శనివారం ఆయన తిరుపతి లోక్‌సభ స్థానం పరిధిలోని సర్వేపల్లి, సత్యవేడు నియోజకవర్గాల్లో ప్రజాగళం సభల్లో ఆయన పాల్గొన్నారు. గూడూరులో మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో కూడా మాట్లాడారు. ఇవి తమ కోసం జరుగుతున్న ఎన్నికలు కావని.. రాష్ట్ర భవిష్యత్తు కోసం జరుగుతున్నాయని.. ఎన్డీయేతో పొత్తు తమ కోసం పెట్టుకున్నది కాదని.. రాష్ట్ర భవిష్యత్తు కోసమేనని తేల్చిచెప్పారు. '14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశా. నేను చూడని పదవా ఇది. ముఖ్యమంత్రి పదవి నాకు బాధ్యత. జగన్మోహన్‌రెడ్డికి మాత్రం దోపిడీకి లైసెన్స్' అని దుయ్యబట్టారు. ఎన్డీయే ప్రభుత్వం రాగానే గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

నోరు విప్పితే అబద్ధాలే..

జగన్ ఎక్కడ నోరు విప్పినా అబద్ధాలే. సీఎంగా ఉన్నప్పుడు నేను ఏం చేశానని విమర్శిస్తున్నాడు. నేను అభివృద్ధి చేసిన డ్వాక్రా సంఘాలే లేకపోతే ఈరోజు ఆడవాళ్లలో ఇంత చైతన్యం వచ్చేది కాదు. జగన్ జమానాలో కరెంట్, గ్యాస్, పెట్రోలు, డీజిల్, మద్యం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈయన అసమర్థ ముఖ్యమంత్రి. గూడూరు నుంచి సిలికాన్ పోయింది. స్వర్ణముఖి నుంచి ఇసుక పోయింది. కొండలనే మాయం చేసి వాతావరణాన్నే దెబ్బతీశారు. ఖనిజ సంపదను కూడా దోచేసిన దుర్మార్గులు. వైసీపీ హయాంలో కుంభకోణం లేని స్కీమే లేదు. ఇలాంటి సీఎంకు ఏం పేరు పెట్టాలో అర్థం కాదు. జగన్ రూ.10 ఇస్తే వెయ్యి సొంతానికి లాగేస్తాడు. నవరత్నాల పేరు చెప్పి జగన్ ప్రజలను ఏమార్చాడు. అవి నకిలీ నవరత్నాలు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా తెలుగుదేశం కూటమి సూపర్ సిక్స్ పథకాలు సృష్టించింది. మరిన్ని సంక్షేమ పథకాలతో త్వరలోనే మేనిఫెస్టో విడుదల చేస్తాం. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్డీయే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి. సైకిలెక్కండి. దానికి టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు కట్టండి. సైకిల్ ముందు ఒక కమలం పువ్వు పెట్టుకోండి. దానివల్ల రాణింపు వస్తుంది. గాజు గ్లాస్ కూడా పట్టుకోండి. ఇక సైకిల్ స్పీడు పెంచండి. ఇక మీ భవిష్యత్తు మాది' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.



గూడూరు ప్రజాగళంలో మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు

'మార్గదర్శి'లో రోజాకు చిట్!

» రూ.39 లక్షల చిట్ వేసిన మంత్రి
» బెంజ్ సహా తొమ్మిది కార్లు సొంతం
» ఐదేళ్లలో 40% పెరిగిన ఆస్తులు
» ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 20: మార్గదర్శి చిట్స్‌లో అక్రమాలు జరిగాయని వైసీపీ ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అయితే. ఈ ప్రభుత్వంలోనే మంత్రిగా ఉన్న నగరి ఎమ్మెల్యే రోజా అదే మార్గదర్శిలో రూ.39 లక్షల చిట్ వేయడం గమనార్హం. దీంతో మార్గదర్శిపై వైసీపీ చేస్తున్న విమర్శలు ఉద్దేశ పూర్వకమనే చర్చ సాగుతోంది. శుక్రవారం నగరిలో మంత్రి రోజా ఎన్నికల నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించారు. మార్గదర్శి చిట్స్‌లో రూ.39,21,120(చిట్ నెంబర్: ఎల్‌టీ030వీ ఎంఏ-48) చిట్ ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.కోటి విలువ చేసే బెంజ్‌కారు ఉందన్నారు. 2019 ఎన్నికల అఫిడవిట్‌లో ఆరు కార్లు, ఒక హోండా పల్సర్ బైక్ ఉన్నట్టు తెలిపిన రోజా, 2024 ఎన్నికల అఫిడవిట్ వచ్చేసరికి మరో మూడు కార్లు అదనంగా ఉన్నట్టు తెలిపారు. దీంతో మొత్తం 9కార్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఏపీలోని పలు చోట్ల 6.39 ఎకరాల వ్యవసాయ భూమి, భర్త సెల్వమణికి నగరిలో 0.94 ఎకరాల వ్యవసాయ భూమి, అలాగే తెలంగాణలోని గచ్చిబౌలి, పుత్తూరులో ఇంటి స్థలాలు ఉన్నట్లు తెలిపారు. 2019తో పోల్చితే రోజా ఆస్తులు 40శాతం పెరిగాయి.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

సైబర్ టవర్స్ వద్ద అభిమానుల సందడి

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 20: తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు వేడుకలు తెలుగు రాష్ట్రాల్లో శనివారం ఘనంగా జరిగాయి. హైదరాబాద్ నగరంలో పలుచోట్ల వేడుకలు నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా ఇచ్చిన పిలుపు మేరకు చంద్రబాబు అభిమానులు పెద్దసంఖ్యలో హైటెక్ సిటీలోని సైబర్ టవర్స్ వద్ద శనివారం సమావేశమయ్యారు. చంద్రబాబు ముఖచిత్రంతో ఉన్న కేక్ కట్ చేయడంతోపాటు "ఐ యాత్ విత్ సీబీఎన్, వియ్ ఆర్ హియర్ బికాజ్ ఆఫ్ యూ.." అంటూ పలు ప్లకార్డులను ప్రదర్శించారు. ఎన్టీఆర్ భవన్‌లో తెలంగాణ తెదేపా ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, బంటు వెంకటేశ్వర్లు, నన్నూరి నర్సిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. బక్కని నర్సింహులు మాట్లాడుతూ చంద్రబాబు సమాజంలో అన్ని వర్గాలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా పాలన సాగించారన్నారు. చంద్రబాబు అభిమాని సుధాకర్ నగరంలో సైకిల్ యాత్రను నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో సంబరాలు జరిపారు. కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. టీడీపీ నగర కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు పి. సాయిబాబా హాజరయ్యారు. చిక్కడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్టీవోస్ కాలనీ, గౌతం నగర్ డివిజన్ సంజయ్‌నగర్, ఏఎస్‌రావు నగర్, జమ్మిగడ్డ చౌరస్తా, పికెట్ చౌరస్తా, చిల్కా నగర్ డివిజన్, నల్లకుంట, నామాలగుండు చౌరస్తా, మెట్టుగూడలో వేడుకలు జరిపారు. రాధిక చౌరస్తా ఆంజనేయ స్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. కాగా, ఆంధ్రప్రదేశ్ నలుమూలలా చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. చిత్తూరు జిల్లా కుప్పంలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వేడుకల్లో పాల్గొన్నారు. సామగుట్టపల్లెలో ఉన్న కదిరి నరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయం బయట సూపర్ సిక్స్ పథకాలతో కూడిన భారీ కేక్ కేట్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు.

చంద్రబాబుకు మోదీ శుభాకాంక్షలు

చంద్రబాబుకు ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన ఈమేరకు ఎక్స్‌లో స్పందించారు. 'ఆయనకు సుదీర్ఘ ఆయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ప్రార్థిస్తున్నాను' అని మోదీ పేర్కొన్నారు. చంద్రబాబు స్పందిస్తూ.. 'మీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.



కుప్పంలో సూపర్ సిక్స్ పథకాలతో రూపొందించిన 74 కిలోల భారీ కేక్‌ను కట్ చేస్తున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరి

నవ్య | చిత్రజ్యోతి

హను-మాన్ కంటే పెద్ద విజయం సాధించాలి



ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి అశ్విన్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. కె.నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ మూవీ టైటిల్‌ను, ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'డార్లింగ్', ఉపశీర్షిక 'వై దిస్ కొలవెరి'. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'డార్లింగ్' సినిమా 'హను-మాన్' కంటే పెద్ద విజయం సాధించాలి" అని అన్నారు. నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ "ప్రేక్షకులకు కావాల్సిన కంప్లీట్ ఎంటర్టైన్‌మెంట్ ఈ సినిమా" అని చెప్పారు. దర్శకుడు అశ్విన్‌రామ్ మాట్లాడుతూ "ఈ సినిమా కపుల్స్‌కి, లవర్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది" అని చెప్పారు.

ఎమోషన్స్, యాక్షన్ మెప్పించాయి

చిరంజీవి



కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'భజే వాయువేగం' చిత్రం టీజర్‌ను శనివారం చిరంజీవి ఆవిష్కరించారు. 'విశ్వంభర' సెట్‌లో చిత్రబృందం చిరంజీవిని కలిసింది. 'నా అభిమాని, తమ్ముడు లాంటి కార్తికేయ నటించిన 'భజే వాయువేగం' చిత్రం టీజర్‌తోపాటు టైటిల్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. ఎమోషన్స్‌తో పాటు యాక్షన్ అంశాలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా ఘన విజయం అందుకోవాలి' అని ఈ సందర్భంగా చిరంజీవి ఆకాంక్షించారు. డ్రగ్స్ కేసులో పోలీసుల ఇన్వెస్టిగేషన్, తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగిన టీజర్ ఆద్యంతం అలరించింది. యాక్షన్ సీక్వెన్స్‌ల్లో కార్తికేయ విజృంభించారు. ఆయనకు జోడీగా ఐశ్వర్య మీనన్ నటిస్తున్నారు. రాహుల్ టైసన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రశాంత్‌రెడ్డి చంద్రపు దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మిస్తోంది. త్వరలో మేకర్స్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్, కపిల్ కుమార్. సినిమాటోగ్రఫీ: ఆర్. డి. రాజశేఖర్

ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధం...

ఛోటా కే నాయుడుకు దర్శకుడు హరీశ్ శంకర్ హెచ్చరిక



'ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధం... మీ పిలుపు కోసం ఎదురు చూస్తుంటాను' అంటూ సినిమాటోగ్రాఫర్ ఛోటా కే నాయుడుకు దర్శకుడు హరీశ్ శంకర్ సవాల్ విసిరారు. పదే పదే తనను లక్ష్యంగా చేసుకొని విమర్శలకు దిగుతున్నారంటూ ఛోటా కే నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓ లేఖను హరీశ్ శంకర్ విడుదల చేశారు. వయసులో పెద్దవారు అని గౌరవిస్తున్నానంటూనే ఆయన ఛోటాపై వ్యంగాస్త్రాలు సంధించారు. "రామయ్యా వస్తావయ్యా' సినిమా ఫ్లాప్ అయినా ఆ నింద మీపై మోపలేదు. ఆ సినిమా తీసి పదేళ్లు దాటిపోయింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా పలు ఇంటర్వ్యూల్లో మీరు కావాలని పదే పదే నా ప్రస్తావన తెచ్చి అవమానిస్తున్నారు. మీపైన ఉన్న గౌరవంతో ఇన్నాళ్లు భరించాను. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయండి. కాదూ కూడదు మళ్లీ కెలుక్కుంటాను అంటే ఎక్కడైనా, ఏ వేదికమీదైనా, నేను సిద్ధం' అని హరీశ్ శంకర్ హెచ్చరించారు. "రామయ్యా వస్తావయ్యా' షూట్‌లో కెమెరా డిపార్ట్‌మెంట్‌లో హరీశ్ శంకర్ జోక్యం చేసుకున్నారు. అది సబబు కాదని వారించినా ఆయన వినలేదు" అని ఛోటా కె నాయుడు విమర్శించడమే ఈ వివాదానికి కారణమైంది.



ఓటుకు రూ. ఐదువేలు

సాయికుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం'. 'ఫర్ ఓట్' అనేది ఉపశీర్షిక. వినయ్, అరుణ్, దీప్తి వర్మ, ఆమని కీలకపాత్రలు పోషించారు. సూర్య దర్శకుడు. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఎన్నికల్లో గెలిచేందుకు వ్యూహాలు పన్నే రాజకీయ నాయకుడిగా సాయికుమార్ కనిపించారు. తను పోటీ చేసే నియోజవర్గంలో ఒక్కో ఓటుకు రూ. 5వేలు చొప్పున మొత్తం రూ. 100 కోట్లు పంచేందుకు ఆయన ఎలాంటి ప్రయత్నం చేశారనేది ఆసక్తికరంగా అనిపించింది. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వరరెడ్డి, వహీద్ షేక్, కే పేరుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ రుఫుస్. సినిమాటోగ్రఫీ: నని ఐనవెల్లి

పైసా వసూల్ సినిమా అవుతుంది

విశాల్



విశాల్, ప్రియా భవానీ నటించిన చిత్రం 'రత్నం'. విశాల్‌తో 'భరణి', 'పూజ' చిత్రాలు చేసిన డైరెక్టర్ హరి ఈ సినిమాను తెరకెక్కించారు. కార్తీకేయన్ సంతానం నిర్మించారు. ఈ నెల 26న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సంద్భంగా విశాల్ మీడియాతో ముచ్చటించారు. "యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. ఇందులో కేవలం మాస్ ఎలిమెంట్స్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకునే అంశాలు చాలా ఉన్నాయి. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు మంచి సంగీతం ఇచ్చారు. ఇందులోని కంటెంట్, డైలాగ్స్ వల్ల అందరికీ ఇది స్ట్రయిట్ తెలుగు సినిమాలాగే అనిపిస్తోండటం సంతోషంగా ఉంది. హరి సినిమాల్లో హీరో పాత్ర కంటే హీరోయిన్‌కే అధిక ప్రాముఖ్యత ఉంటుంది. ఇందులో ప్రియా భవానీ శంకర్ పాత్ర తీరు అందరినీ ఆకట్టుకుంటుంది. మీరు పెట్టే డబ్బులకు సరిపడా వినోదం ఇస్తాం. కచ్చితంగా పైసా వసూల్ సినిమా అవుతుంది" అని చెప్పారు.

హరోం హరకు ప్యాకప్



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'హరోం హర'. 'ది రివోల్ట్' అనేది ట్యాగ్‌లైన్. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తయినట్టు మేకర్స్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సెట్‌లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసిన వీడియోను చిత్రబృందం సోషల్ మీడియాలో షేర్ చేసింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చిత్తూరు జిల్లా కుప్పంలో 80వ దశకంలో జరిగిన సంఘటనల ఆధారంగా 'హరోం హర' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మాళవిక శర్మ కథానాయికగా నటిస్తున్నారు. సునీల్ కీలకపాత్ర పోషిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు.


మరో సినిమా చేద్దాం అన్నారు

మహేంద్రనాథ్ కూండ్ల



వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'శబరి'. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. అనిల్ కాట్జ్ దర్శకుడు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. "నిర్మాతగా నా సినిమా జర్నీని ప్రారంభించేందుకు చూస్తున్న సమయంలో దర్శకుడు అనిల్ ఈ కథ చెప్పారు. ఒక బిడ్డ కోసం తల్లి పడే తపనను సైకలాజికల్ థ్రిల్లర్‌గా దర్శకుడు చెప్పారు. ఇందులోని భావోద్వేగాలు అందరినీ కట్టిపడేస్తాయి. ఈ సినిమా కథను నాకంటే ముందే వరలక్ష్మి శరత్‌కుమార్ విని ఓకే చేశారని దర్శకుడు చెప్పారు. ఆమె వండర్‌ఫుల్ నటి. నిర్మాతలను వరలక్ష్మి శరత్‌కుమార్ ఎప్పుడూ ఇబ్బంది పెట్టరు. ఆమెతో ఈ సినిమాతో మంచి రిలేషన్ బిల్డ్ అయ్యింది. 'శబరి' తర్వాత మరో సినిమా చేద్దాం అని ఆమె అనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని చెప్పారు.

బెస్ట్ ఓటీటీ షోలు తెలుగులో



ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ మినీ టీవీ ప్రేక్షకులకు సరికొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది. వివిధ భాషల్లో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన షోల తెలుగు, తమిళ డబ్బింగ్ వెర్షన్లను అందుబాటులోకి తెచ్చింది. 'రక్షక్, ఇండియాస్ బ్రేవ్స్, ఫిజిక్స్‌వాలా' లాంటి 200కు పైగా షోలతో పాటు పలు హాలీవుడ్ చిత్రాల డబ్బింగ్ వెర్షన్లు ఇందులో ఉచితంగా చూడొచ్చు అని ఆ సంస్థ తెలిపింది. వీటితో పాటు కొరియన్, టర్కీష్, మాండరిన్ షోలను సైతం వినియోగదారులు వీక్షించవచ్చు అని అమెజాన్ కంటెంట్ హెడ్ అమోఘ్ దుసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
361 (7 మ్యాచ్‌లు)	13 (7 మ్యాచ్‌లు)

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x బెంగళూరు	మ.3.30 గం. నుంచి
పంజాబ్ x గుజరాత్	రాత్రి 7.30 గం. నుంచి

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (సి) స్టబ్స్ (బి) కుల్దీప్ 89, అభిషేక్ శర్మ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 46, మార్‌క్రమ్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 1, క్లాసెన్ (బి) అక్షర్ 15, నితీశ్ కుమార్ (సి) వార్నర్ (బి) కుల్దీప్ 37, షాబాజ్ (నాటౌట్) 59, సమద్ (సి) నోకియా (బి) ముకేశ్ 13, కమిన్స్ (రనౌట్) 1, వాషింగ్టన్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 266/7; వికెట్ల పతనం: 1-131, 2-133, 3-154, 4-154, 5-221, 6-250, 7-256; బౌలింగ్: ఖలీల్ 3-0-51-0, లలిత్ 2-0-41-0, నోకియా 3-0-31-0, కుల్దీప్ 4-0-55-4, ముకేశ్ 4-0-57-1, అక్షర్ 4-0-29-1.

ఢిల్లీ: పృథ్వీ షా (సి) సమద్ (బి) వాషింగ్టన్ 16, వార్నర్ (సి) కమిన్స్ (బి) భువనేశ్వర్ 1, ఫ్రేజర్ (సి) క్లాసెన్ (బి) మార్కండే 65, పోరెల్ (స్టంప్) క్లాసెన్ (బి) మార్కండే 42, స్టబ్స్ (సి) షాబాజ్ (బి) నితీశ్ 10, పంత్ (సి) నటరాజన్ (బి) నితీశ్ 44, లలిత్ (బి) నటరాజన్ 7, అక్షర్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 6, నోకియా (బి) నటరాజన్ 0, కుల్దీప్ (ఎల్బీ) నటరాజన్ 0, ముకేశ్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు: 8, మొత్తం: 19.1 ఓవర్లలో 199 ఆలౌట్; వికెట్ల పతనం: 1-16, 2-25, 3-109, 4-135, 5-154, 6-166, 7-199, 8-199, 9-199, 10-199; బౌలింగ్: వాషింగ్టన్ 2-0-46-1, భువనేశ్వర్ 4-0-33-1, కమిన్స్ 4-0-35-0, నటరాజన్ 4-1-19-4, మార్కండే 2-0-26-2, షాబాజ్ 1-0-22-0, నితీశ్‌కుమార్ 2.1-0-17-2.


నితీశ్ కుమార్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 37)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
హైదరాబాద్	7	5	2	0	10	0.914
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	7	4	3	0	8	0.529
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
ముంబై	7	3	4	0	6	-0.133
ఢిల్లీ	8	3	5	0	6	-0.477
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	7	2	5	0	4	-0.251
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర.రే: నెట్ రన్‌రేట్

టాస్ గెలిచిన ప్రత్యర్థి సన్‌రైజర్స్‌కు బ్యాటింగ్‌కు ఆహ్వానించడం.. కసితీరా చితక్కొట్టించుకోవడం పరిపాటయ్యింది. ఇప్పటికే 277, 287 పరుగుల రికార్డు స్కోర్లతో మోతెక్కించిన రైజర్స్ ఈసారి 266 పరుగులతో కాస్త శాంతించింది. కానీ ఆరంభంలో హెడ్, అభిషేక్ విధ్వంసం చూస్తే స్కోరు 300-350 కూడా సాధ్యమయ్యేలా అనిపించింది. ఎందుకంటే.. ఓవర్‌కు 20 పరుగుల చొప్పున పవర్‌ప్లేలోనే 125 పరుగులతో వామ్మో అనేలా ఆడారు. మధ్య ఓవర్లలో నెమ్మదించినా.. చివరకు ఎస్‌ఆర్‌హెచ్ అలవోకగా 250 దాటేసింది. ఇక డీసీ ఛేదనలో ఫ్రేజర్ ఒక్కడే ఆకట్టుకోగా, కెప్టెన్ పంత్ తన బ్యాటింగ్ తీరుతో నిరాశపర్చడంతో ఓటమి తప్పలేదు

రన్‌రైజర్స్

మరోసారి 250పైగా స్కోరు

ఢిల్లీపై ఘనవిజయం
పోరాడిన ఫ్రేజర్
నటరాజన్‌కు 4 వికెట్లు
హెడ్, షాబాజ్, నితీశ్ సూపర్ ఇన్నింగ్స్


హెడ్ (32 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో 89)

న్యూఢిల్లీ: సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి మరో విధ్వంసకర ప్రదర్శన. ఈసారి ఆ జట్టు బ్యాటర్లకు ఢిల్లీ క్యాపిటల్స్ బలైంది. తమ చివరి మ్యాచ్‌లో గుజరాత్‌ను 89 పరుగులకే ఆలౌట్ చేసిన డీసీ బౌలర్లను ట్రావిస్ హెడ్ (32 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో 89), అభిషేక్ శర్మ (12 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 46) తమ ఊచకోతతో చేష్టలుడిగేలా చేశారు. ఆ తర్వాత రికార్డు ఛేదనలో డీసీ ఆరంభం బాగున్నా.. ముగింపులో తేలిపోయింది. పేసర్ నటరాజన్ (4/19) కెరీర్ బెస్ట్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో 67 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన హైదరాబాద్ 10 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. ఈ జట్టుకిది వరుసగా నాలుగో విజయం. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 266 పరుగులు చేసింది. షాబాజ్ అహ్మద్ (29 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 59 నాటౌట్), నితీశ్ కుమార్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) సహకరించారు. కుల్దీప్‌నకు 4 వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.1 ఓవర్లలో 199 రన్స్‌కు ఆలౌటైంది. ఫ్రేజర్ (18 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 65), అభిషేక్ (22 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 42) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా పంత్ (44) ఫర్వాలేదనిపించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హెడ్ నిలిచాడు.

ఫ్రేజర్ ఒక్కడే..: కష్టసాధ్యమైన ఛేదనలో ఢిల్లీకి మెరుపు ఆరంభమే లభించింది. యువ బ్యాటర్ ఫ్రేజర్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో రైజర్స్‌కు వణుకు పుట్టించాడు. కానీ వికెట్లు కాపాడుకోలేకపోవడం డీసీని దెబ్బతీసింది. వాస్తవానికి 12 ఓవర్ల దాకా పోటీలోనే ఉన్నా ఛేదన వైపు సాగలేకపోయింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ పృథ్వీ షా వరుసగా 4 ఫోర్లతో స్పిన్నర్ సుందర్‌కు స్వాగతం పలికాడు. కానీ ఐదో బంతికే దొరికిపోయాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ వార్నర్ (1).. భువీకి చిక్కాడు. ఈ స్థితిలో ఫ్రేజర్-పోరెల్ జోడీ చెలరేగింది. ముఖ్యంగా మూడో ఓవర్‌లో ఫ్రేజర్ 4,4,6,4,6,6తో 30 పరుగులతో డీసీని జోష్‌లో నింపాడు. అలాగే ఐదో ఓవర్‌లో అతడి 4,6.. పోరెల్ 4,4తో మరో 20 రన్స్ వచ్చాయి. 15 బంతుల్లోనే ఫ్రేజర్ ఫిఫ్టీ పూర్తి చేయడం విశేషం. వీరి ధాటికి పవర్‌ప్లేలో జట్టు 88/2 స్కోరుతో నిలిచింది. కానీ ఏడో ఓవర్‌లో ఫ్రేజర్ హ్యాట్రిక్ సిక్సర్లు బాదినా.. మార్కండే అతడిని అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత నెమ్మదిగా ఢిల్లీ పోటీలో నుంచి తప్పుకోసాగింది. పోరెల్ 8వ ఓవర్‌లో 4,4,6,4తో 22 రన్స్ సాధించి రన్‌రేట్ తగ్గకుండా చూశాడు. కానీ మార్కండే మరోసారి షాకిస్తూ పోరెల్ వికెట్ తీయడంతో రైజర్స్ ఆధిపత్యం చూపింది. క్రీజులో హిట్టర్లు పంత్, స్టబ్స్ (10) ఉండడంతో సంచలన ఫలితం వస్తుందని ఆశించినా నిరాశే ఎదురైంది. 9-15 ఓవర్ల మధ్య వీరి నుంచి కనీసం ఒక్క సిక్సర్ కూడా రాలేదు. ముఖ్యంగా పంత్ భారీ షాట్లు ఆడడంలో ఇబ్బందిపడ్డాడు. స్టబ్స్‌ను నితీశ్, లలిత్ (7)ను నటరాజన్ అవుట్ చేయగా 166/6తో డీసీ పోరు నామమాత్రమే అయ్యింది. 19వ ఓవర్‌లో నటరాజన్ 3 వికెట్లు తీయగా, చివరి ఓవర్ తొలి బంతికి పంత్‌ను నితీశ్ అవుట్ చేయడంతో ఢిల్లీ ఆలౌటైంది.

బౌలర్ల దిమ్మతిరిగేలా..: 19, 21, 22, 21, 20, 22.. తొలి ఆరు ఓవర్లలో సన్‌రైజర్స్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సాగించిన విధ్వంసమిది. ఐపీఎల్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని ఆటతీరుతో ఈ ఇద్దరూ బ్యాట్లతో చెలరేగిన విధానం అద్భుతః అనిపించింది. ఈ దెబ్బకు పవర్‌ప్లేలోనే రైజర్స్ 125 పరుగులు సాధించి ఔరా అనిపించేలా చేసింది. బౌలర్ ఎవరైనా ఆకాశం వైపు చూడడంతోనే సరిపోయింది. చక్కటి బ్యాటింగ్ వికెట్‌తో పాటు బౌండరీల విస్తీర్ణం కూడా తక్కువగానే ఉండడంతో ఈ ఇద్దరూ పండగ చేసుకున్నారు. కానీ పవర్‌ప్లే తర్వాత రైజర్స్ మెరుపు ఇన్నింగ్స్‌ను డీసీ బౌలర్లు కట్టడి చేయగలిగారు. తొలి ఓవర్‌లోనే హెడ్ 6,4,4,4తో జరుగబోయే ఊచకోతను ఢిల్లీ బౌలర్లకు గుర్తుచేశాడు. రెండో ఓవర్‌లో తను 6,6,4 బాదగా.. మూడో ఓవర్‌లో నోకియాను 4,4,0,4,4,6తో బెదరగొట్టాడు. అటు 16 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. మరో ఎండ్‌లో స్పిన్నర్లు లలిత్, కుల్దీప్‌లను లక్ష్యంగా చేసుకుని అభిషేక్ అలవోకగా సిక్సర్లు కొట్టడంతో స్కోరు 5 ఓవర్లలోనే రికార్డు స్థాయిలో 103కి చేరింది. ఇక ఆరో ఓవర్‌లో హెడ్ 4,4,4,4,0,6 బాదడంతో ఈసారి పేసర్ ముకేశ్ బలయ్యాడు. మరోవైపు ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ (13 బంతుల్లో) హాఫ్ సెంచరీని అభిషేక్ అధిగమిస్తాడనిపించింది. కానీ ఏడో ఓవర్‌లో అతడిని కుల్దీప్ అవుట్ చేయడంతో ఈ పరుగుల తుఫాన్ నుంచి డీసీకి అతి పెద్ద రిలీఫ్ లభించింది. అదే ఓవర్‌లో మార్‌క్రమ్ (1) వికెట్‌ను కూడా తీశాడు. స్పిన్నర్ అక్షర్ తర్వాతి ఓవర్‌లో రైజర్స్‌కు ఒక్క బౌండరీ కూడా ఇవ్వలేదు. కుల్దీప్ మరో ఓవర్‌లో డేంజరస్ హెడ్ వికెట్ తీయడంతో ఢిల్లీ సంబరాల్లో మునిగింది. అలాగే క్లాసెన్ (15) తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో రైజర్స్ 131/0 నుంచి 151/4కి చేరింది. ఈ దశలో మరో వికెట్ కోల్పోకుండా నితీశ్, షాబాజ్ కుదురుగా ఆడారు. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలతో ముందుకు సాగడంతో 14.5 ఓవర్లలోనే స్కోరు 200కి చేరింది. ఈ దశలో కుల్దీప్ మరోసారి మ్యాజిక్ చూపుతూ జోరు మీదున్న నితీశ్‌ను అవుట్ చేశాడు. దీంతో ఐదో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత షాబాజ్ చెలరేగి 19వ ఓవర్‌లో రెండు, సమద్ ఓ సిక్సర్‌తో 20 పరుగులు వచ్చాయి. ఇక ఆఖరి ఓవర్‌లో సమద్ (13), కమిన్స్ (1) వెనుదిరిగినా షాబాజ్ 4,4,6తో 28 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసి జట్టును 260 పరుగులు దాటించాడు.

1

ఐపీఎల్‌లోనే కాదు.. టీ20 ఫార్మాట్‌లోనే పవర్‌ప్లేలో అత్యధిక స్కోరు (125) చేసిన జట్టుగా సన్‌రైజర్స్. అలాగే ఈ లీగ్ తొలి పది ఓవర్లలో ఎక్కువ పరుగులు (158/4) చేసిన జట్టుగానూ నిలిచింది. ఐపీఎల్ చరిత్రలో అతి వేగంగా వంద పరుగులు (5 ఓవర్లలో) పూర్తి చేసిన జట్టు కూడా ఇదే.

రైజర్స్ తరపున వేగం (16 బంతుల్లో)గా 50 పరుగులు చేసిన బ్యాటర్‌గా అభిషేక్‌తో సమంగా నిలిచిన హెడ్. అలాగే పవర్‌ప్లేలో ఎక్కువసార్లు (3) 50+ స్కోర్లు సాధించిన రెండో బ్యాటర్‌గా హెడ్.

ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఎక్కువ సార్లు (3) 250+ స్కోర్లు చేసిన జట్టుగా సర్రేతో సమంగా నిలిచిన రైజర్స్

ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో తమ అత్యధిక సిక్సర్ల (22) రికార్డును మరోసారి సమం చేసిన రైజర్స్.


అన్షు
రీతిక

వినేశ్.. చలో పారిస్

రీతిక, అన్షు కూడా..
భారత్‌కు మూడు ఒలింపిక్ బెర్త్‌లు
ఆసియా రెజ్లింగ్ క్వాలిఫయర్స్

బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళా రెజ్లర్లు అదరగొట్టారు. ఏకంగా మూడు పారిస్ బెర్త్‌లు పట్టేశారు. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ (50కి), రీతిక (76కి.), అన్షు మాలిక్ (57కి.) తమతమ విభాగాల్లో ఫైనల్‌కు చేరడం ద్వారా పారిస్ విశ్వక్రీడల 'టిక్కెట్' ఖాయం చేసుకున్నారు. కాగా..వరల్డ్ చాంపియన్‌షిప్స్ ద్వారా అంతిమ్ పంఘల్ (53కి.) ఇంతకుముందే విశ్వక్రీడలకు క్వాలిఫై అయ్యింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ప్రస్తుత, మాజీ అధ్యక్షులపై చేస్తున్న పోరాటం తన సత్తాకు అడ్డురాదని స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ నిరూపించింది. 50 కి. విభాగంలో తిరుగులేని ప్రదర్శన చేస్తూ ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా టైటిల్ ఫైట్‌కు చేరింది. 29 ఏళ్ల వినేశ్ వరుసగా మూడో ఒలింపిక్స్ బరిలో దిగనుండడం విశేషం. రియో (2016), టోక్యో (2020) క్రీడల్లో ఆమె తలపడిన సంగతి తెలిసిందే. శనివారం..తొలి బౌట్‌లో కొరియా ప్రత్యర్థి మిరాన్ చియాన్‌ను ఒక నిమిషం 39 సెకన్లలోనే చిత్తు చేసిన వినేశ్..ఆపై క్వార్టర్‌ఫైనల్లో కంబోడియాకు చెందిన మనంగ్ దిత్‌ను కేవలం 67 సెకన్లలోనే మట్టి కరిపించి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. సెమీస్‌లో 19 ఏళ్ల కజక్ రెజ్లర్ లారా గనికిజి తొలుత ఫొగట్‌ను ఒకింత ప్రతిఘటించింది. కానీ తన అనుభవాన్ని రంగరించిన భారత స్టార్ వినేశ్ ప్రత్యర్థిని చిత్తు చేసి టైటిల్ ఫైట్‌కు చేరింది. ఇక..57 కేజీల క్వార్టర్స్‌లో కల్మిరా (కిర్గిస్థాన్)పై నెగ్గిన అన్షు.. సెమీస్‌లో లేలోఖోవ్ (ఉజ్బెక్)ని ఓడించింది. 76 కిలోల మొదటి రౌండ్‌లో వాంగ్ (కొరియా)పై సునాయాసంగా నెగ్గిన రీతిక..తదుపరి దవానసన్ (మంగోలియా)ను ఓడించింది. గ్రూప్ చివరి బౌట్‌లో జువాంగ్ (చైనా)పై, సెమీఫైనల్లో చాంగ్ (తైపీ)పై రీతిక విజయం సాధించింది. 62 కేజీలలో..మాన్సీ అహ్లావత్ సెమీఫైనల్లో పరాజయంతో త్రుటిలో పారిస్ బెర్త్ కోల్పోయింది. తొలి రోజు పోటీల్లో బరిలో దిగిన భారత రెజ్లర్లలో నిషా దహియా (68కి.) మాత్రమే సెమీస్‌కు చేరలేపోయింది.

భారత్‌కు నాలుగు స్వర్ణాలు



టోక్యో: ఆసియా పారా కనోయింగ్ స్ప్రింట్‌లో భారత అథ్లెట్లు నాలుగు స్వర్ణాలతో అదరగొట్టారు. జైదీప్ (వీఎల్3 పురుషుల 200 మీ.), పూజా ఓజా (కేఎల్3 మహిళల 200 మీ.), ప్రాచీ యాదవ్ (కేఎల్2 మహిళల 200 మీ.), సురేందర్ కుమార్ (వీఎల్1 పురుషుల 200 మీ.) పసిడి పతకాలు సాధించారు. షబానా (కేఎల్3 మహిళల 200 మీ.), రజని (కేఎల్2 మహిళల 200 మీ.), సోనాల్‌బెన్ (కేఎల్1 మహిళల 200 మీ.), యష్ కుమార్ (వీఎల్1 పురుషుల 200 మీ.), గజేంద్ర సింగ్ (వీఎల్2 పురుషుల 200 మీ.) రజతాలు దక్కించుకొన్నారు. కేఎల్3 మహిళల 200 మీ. విభాగంలో సంగీత రాజ్‌పుత్ కాంస్యం సొంతం చేసుకొంది.

అదరగొట్టిన మను, అనిష్

న్యూఢిల్లీ: ఒలింపిక్ సెలెక్షన్ ట్రయల్స్-1 రెండో రోజు పోటీల్లో మను భాకర్, అనిష్ భన్వాలా అదరగొట్టారు. శనివారం ఇక్కడి కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన 25 మీటర్ల పిస్టల్ విభాగంలో మను 583 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. మొత్తం 10 రౌండ్లలో మను ఏడింట్లో 5/5 స్కోరు చేసి సంచలనం సృష్టించింది. మను టాప్‌లో నిలవగా, రిథమ్ సంగ్వాన్, అభిద్నాయ పాటిల్ తర్వాతి రెండు స్థానాలను దక్కించుకున్నారు. తొలి రోజు పోటీల్లో హోరెత్తించిన హైదరాబాద్ షూటర్ ఇషాసింగ్ రెండో రోజు ఏడో రౌండ్లో నిష్క్రమించింది. పురుషుల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో అనిష్ 578 పాయింట్లతో టాప్‌లో నిలవగా, విజయ్‌వీర్ సిద్ధు 2వ, ఆదర్శ్ సింగ్ 3వ స్థానాలను దక్కించుకున్నారు.

60 గంటలపాటు ఏకధాటిగా ఆడి..



చెస్‌లో నైజీరియా ఆటగాడు టుండే రికార్డు ఫీట్

న్యూయార్క్: మారథాన్ చెస్ ఆడిన నైజీరియా చెస్ చాంపియన్ టుండే అనాకొయా సరికొత్త గిన్నిస్ రికార్డును నెలకొల్పాడు. న్యూయార్క్‌లోని టైమ్‌స్క్వేర్ వద్ద టుండే ఏకధాటిగా 60 గంటపాటు చెస్ ఆడాడు. అతడికి ప్రత్యర్థిగా అమెరికా చెస్ చాంపియన్ షాన్ మార్టినెజ్ వ్యవహరించాడు. ఈ క్రమంలో 2018లో నార్వే ప్లేయర్లు హల్వర్డ్ హగ్ ఫ్లాటిబో-సుజుర్ ఫెర్కింగ్‌స్టాడ్ 56 గంటల 9 నిమిషాల 37 సెకన్ల రికార్డు బద్దలైంది. అయితే, ఈ ఫీట్ గురించి గిన్నిస్‌బుక్ అధికారులు ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఆఫ్రికా చిన్నారుల విద్యకు విరాళాలు సేకరించడం కోసం టుండే రికార్డు ఫీట్‌కు ఉపక్రమించాడు.

రాహుల్, రుతురాజ్‌లపై జరిమానా

లఖ్‌నవూ: స్లో ఓవర్ రేట్ కారణంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్-చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్లు రాహుల్, రుతురాజ్‌లపై జరిమానా పడింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇద్దరికీ ఇదే తొలి తప్పిదం కావడంతో చెరి రూ.12 లక్షల ఫైన్‌తో సరిపెట్టారు. మరోవైపు పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై బ్యాటింగ్ కోచ్ పొలార్డ్, బ్యాటర్ టిమ్ డేవిడ్‌లపైనా జరిమానా విధించారు. డగౌట్ నుంచే వీరు క్రీజులోని బ్యాటర్లకు డీఆర్‌ఎస్ తీసుకోవాలని సిగ్నల్ ఇవ్వడంతో ఇద్దరి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధిస్తున్నట్టు అడ్వైజరీ కమిటీ పేర్కొంది.

రెండో టీ20లో పాక్ గెలుపు

రావల్పిండి: న్యూజిలాండ్‌తో రెండో టీ20లో పాకిస్థాన్ ఏడు వికెట్లతో నెగ్గింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత న్యూజిలాండ్ 18.1 ఓవర్లలో 90 పరుగులకే కుప్పకూలింది. మార్క్ చాప్‌మన్ (19) టాప్ స్కోరర్. అఫ్రీది 3, ఆమిర్, అబ్రార్ చెరి రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆతిథ్య జట్టు 12.1 ఓవర్లలో 92/3 స్కోరు చేసి నెగ్గింది. రిజ్వాన్ 45 రన్స్ చేశాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో పాక్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షంతో రద్దయింది.

బిజినెస్

వజ్రానికి పసిడి పోటు!

వజ్రాభరణాలపైనా బంగారం ధరల పెరుగుదల ప్రభావం

- 15 శాతం వరకు తగ్గిన డైమండ్ జువెలరీ విక్రయాలు
- అమ్మకాలు పెంచుకునేందుకు వర్తకుల కొత్త ప్రయత్నాలు
- 18 క్యారెట్లకు బదులు 14 క్యారెట్ల ఉత్పత్తులపై దృష్టి



ఇటీవలి కాలంలో అనూహ్యంగా పెరిగిన పసడి ధర వజ్రాభరణాల డిమాండ్‌కూ గండికొట్టిందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. కొనుగోలుదారులపై భారం పెరగకుండా ఉండటంతో పాటు విక్రయాల పునరుద్ధరణ కోసం నగల వర్తకులు వజ్రాభరణాల తయారీకి ఉపయోగించే బంగారం స్వచ్ఛతను తగ్గిస్తున్నట్లు తెలిసింది. 22, 18 క్యారెట్లకు బదులు 14 క్యారెట్ల బంగారంతో చేసిన డైమండ్ జువెలరీని అందుబాటులోకి తేవడంపై ఆభరణ వర్తకులు దృష్టిసారించారు. అంతేకాదు, బంగారం నగల కొనుగోలుకు వచ్చిన వారిలోనూ చాలా మంది ఇప్పుడు 22 క్యారెట్లకు బదులు 18 క్యారెట్ల మోడళ్ల కోసం వాకబు చేస్తున్నారు. వేగంగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు డైమండ్ నగల గిరాకీపైనా ప్రభావం చూపాయని జెమ్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) వైస్ చైర్మన్ కిరీట్ బన్సాలీ అన్నారు ఈ ఫిబ్రవరి వరకు వృద్ధి పథంలో పయనించిన వజ్రాభరణాల డిమాండ్.. గోల్డ్ రేట్ల పెరుగుదలతో గడిచిన ఒకటిన్నర నెలలో 15 శాతం వరకు తగ్గిందన్నారు.

దాంతో కల్యాణ్ జువెలర్స్, మలబార్ వంటి ప్రముఖ రిటైల్ ఆభరణ విక్రయ కంపెనీలు 14 క్యారెట్ల బంగారంతో కూడిన డైమండ్ జువెలరీతో పాటు 18 క్యారెట్ల స్వర్ణాభరణాల ఉత్పత్తులను అధికంగా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిసింది. "బంగారం ధరల అనూహ్య పెరుగుదలతో కొనుగోలుదారుల వైఖరిలోనూ గణనీయ మార్పులొచ్చాయి. వారిప్పుడు పసిడిని పెట్టుబడి సాధనంగా.. అధిక ధరల కాలంలో తమ ఆదా సొమ్ము విలువను పెంచే మార్గంగా చూస్తున్నారు"ని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ అన్నారు. 14 క్యారెట్ల బంగారంతో కూడిన వజ్రాభరణానికి డిమాండ్ పెరగడానికి గోల్డ్ రేట్ల పెరుగుదలతో పాటు ఈ స్వచ్ఛత ఆభరణానికి మన్నిక ఎక్కువ కావడం కూడా మరో కారణమని అహమ్మద్ పేర్కొన్నారు. కాబట్టి రోజువారీగా ధరించేందుకూ పనికొస్తుందని అన్నారు.

18 క్యారెట్ల ఆభరణంలో 75 శాతం బంగారం ఉంటుంది. 14 క్యారెట్ల ఆభరణంలో ఈ వాటా 58 శాతం. అంటే, ఈ రెండింటి మధ్య స్వచ్ఛత వ్యత్యాసం 17 శాతం. కాబట్టి, బంగారం రేట్లు భారీగా పెరిగిన నేపథ్యంలోనూ 14 క్యారెట్ బంగారంతో తయారు చేసిన వజ్రాభరణాలను కస్టమర్లకు అందుబాటు ధరల్లో విక్రయించేందుకు వీలుంటుందని డబ్ల్యూహెచ్‌పీ జువెలర్స్ భాగస్వామి ఆదిత్య పేతే అన్నారు. మన దేశంలో 22, 18తో పాటు 14 క్యారెట్ల బంగారం ఆభరణాలనూ హాల్‌మార్కింగ్ చేసుకునే వీలుంటుంది కాబట్టి వీటిని కొనుగోలు చేయడం వల్ల నష్టం ఉండదని ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.17,622 కోట్లు

ఒక్కో షేరుకు రూ.19.5 డివిడెండ్

ముంబై: మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో హెచ్‌డీఎఫ్ బ్యాంక్ ఏకీకృత నికర లాభం త్రైమాసిక ప్రాతిపదికన 2.11 శాతం పెరిగి రూ.17622.38 కోట్లకు చేరుకుంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో బ్యాంక్ లాభం రూ.17,257.87 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ4లో స్టాండ్‌ఎలోన్ నికర లాభం సైతం స్వల్ప పెరుగుదలతో రూ.16,511.85 కోట్లకు ఎగబాకింది. గత ఏడాది జూలైలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన మాతృసంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌ను తనలో విలీనం చేసుకుంది.

- క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) రూ.29,080 కోట్లకు , ఇతర ఆదాయం రూ.18,170 కోట్లకు చేరుకుంది. బ్యాంక్ మొత్తం ఆస్తులపై నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) 3.44 శాతంగా నమోదైంది.
- డిసెంబరు 31 నాటికి 1.26 శాతంగా నమోదైన బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు ఈ మార్చి 31 నాటికి 1.24 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 0.31% నుంచి 0.33 శాతానికి పెరిగాయి.
- గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.19.5 డివిడెండ్‌ను ప్రకటించింది.
- గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ మొండి బకాయిలను పూడ్చుకోవడంతో పాటు ఇతర అవసరాల కోసం రూ.13,500 కోట్ల కేటాయింపులు జరిపింది.
- 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి బ్యాంక్ లాభం రూ.64,060 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం రూ.1,57,770 కోట్లకు పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	397
వరంగల్	392	గోదావరి	397
చిత్తూరు	493	విశాఖపట్నం	411

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	131
వరంగల్	118	విజయవాడ	131
కరీంనగర్	118	గుంటూరు	131
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	131
కర్నూలు	118	చిత్తూరు	134
విశాఖపట్నం	118		

పబ్లిక్ ఇష్యూకి ప్రీమియర్ ఎనర్జీస్

రూ.1,500 కోట్ల సమీకరణకు సన్నాహాలు

Premier Energies

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సోలార్ సెల్ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా రూ.1,500 కోట్ల విలువైన కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు 2.82 కోట్ల షేర్లను విక్రయించనున్నట్లు డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ పేర్కొంది. ఓఎఫ్ఎస్‌లో భాగంగా సౌత్ ఏషియా గ్రోత్ ఫండ్ 2 హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ 2.38 కోట్ల షేర్లు, సౌత్ ఏషియా ఈబీటీ ట్రస్ట్ 1.53 లక్షల ఈక్విటీ షేర్లు, ప్రమోటర్ చిరంజీవ్ సింగ్ సలూజా 43 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్‌లో భాగంగా కంపెనీ రూ.300 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఒకవేళ ప్రీ-ఐపీఓ ద్వారా నిధులు సమీకరిస్తే కొత్త ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరించే మొత్తం రూ.1,168 కోట్లకు తగ్గనుంది. ఈ ఇష్యూకి కోటక్ మహీంద్రా క్యాపిటల్, జేపీ మోర్గాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.

హైదరాబాద్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటు: పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ అనుబంధ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టడంతో పాటు 4గిగావాట్స్ సోలార్ పీవీ టాప్‌కాన్ (టన్నెల్ ఆక్సైడ్ ప్యాసివ్డ్ కాంట్రాక్ట్) ఏర్పాటుకు అవసరమైన నిధులు అందించటం సహా హైదరాబాద్ 4 గిగావాట్ల సోలార్ పీవీ టాప్‌కాన్ మాడ్యూల్ తయారీ కేంద్రం ఏర్పాటుకు వెచ్చించనుంది. మిగిలిన మొత్తాలను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది.

1995లో ఏర్పాటైన ప్రీమియర్ ఎనర్జీస్ సమీకృత సోలార్ సెల్, మాడ్యూల్ తయారీదారుగా ఉంది. ప్రస్తుతం కంపెనీ 2 గిగావాట్స్ సెల్స్ ఉత్పత్తి సామర్థ్యంతో పాటు 3.36 గిగావాట్స్ మాడ్యూల్స్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. అంతేకాకుండా ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా ఈపీసీ సొల్యూషన్స్, ఓ అండ్ ఎం సర్వీసులను అందిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో మొత్తం ఐదు ప్లాంట్స్‌ను నిర్వహిస్తోంది.

కొత్త మార్కెట్లపై గోద్రేజ్ జెర్సీ దృష్టి

రిటైల్ కార్యకలాపాల విస్తరణపై నజర్

హైదరాబాద్: గోద్రేజ్ జెర్సీ.. కొత్త మార్కెట్లలోకి కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. కంపెనీ రిటైల్ ఉత్పత్తులను మరింత మంది వినియోగదారులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో కార్యకలాపాలను విస్తరించాలని చూస్తున్నట్లు గోద్రేజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి తెలిపారు. ఇందులో భాగంగా దక్షిణాది రాష్ట్రాల్లోని గ్రామీణ మార్కెట్లపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించినట్లు చెప్పారు. అంతేకాకుండా కంపెనీ పోర్ట్‌ఫోలియోలోని కొత్త ఉత్పత్తులతో పాటు మరికొన్నింటిని ఉత్తరాది రాష్ట్రాల్లో విడుదల చేయనున్నట్లు సూరి పేర్కొన్నారు.

రిటైల్ మార్కెట్లో కంపెనీ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో రూ.10 ధరతో కూడిన మిల్క్ షాట్స్‌తో పాటు వివిధ రకాలైన ఫ్లేవర్లతో కూడిన బాదం మిల్క్‌ను విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. వాల్యూ యాడెడ్ విభాగంలో కొత్త ఉత్పత్తుల కోసం ఈ మధ్యనే కొత్త ఉత్పత్తి లైన్‌ను ప్రారంభించామన్నారు. వినియోగదారులకు మరింత చేరువ కావాలన్న యోచనతో వివిధ సైజులతో పాటు అందుబాటు ధరల్లో ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు చెప్పారు. కాగా కంపెనీ దేశవ్యాప్తంగా రోజుకు 12-13 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుండగా అందులో 7.5 లీటర్ల వరకు విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రోజుకు 2 లక్షల లీటర్ల వరకు విక్రయాలు చేపడుతున్నట్లు సూరి పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో కంపెనీ మార్కెట్ వాటా 10-12 శాతంగా ఉందన్నారు. బాదం మిల్క్, పెరుగు ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని ఆయన తెలిపారు. కాగా నాలుగు రకాల్లో తీసుకువచ్చిన ఫ్లేవర్డ్ పెరుగుకు కూడా ఆదరణ లభిస్తోందన్నారు. గోద్రేజ్ అగ్రోవెట్ అనుబంధ సంస్థ అయిన గోద్రేజ్ జెర్సీ హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది.



అబ్ కీ బార్?

కర్ణాటకలో చెంబు రాజకీయం



'కేంద్రం కర్ణాటకకు ఇచ్చింది ఖాళీ చెంబు' అంటూ ఓ వార్తా పత్రికకు ఇచ్చిన ప్రకటన

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటకలో చెంబు రాజకీయం జోరుగా సాగుతోంది. ప్రధాని మోదీ కర్ణాటకకు ఖాళీ చెంబు ఇచ్చారంటూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కవిటీ ప్రకటనలు (అడ్వర్టయిజ్‌మెంట్స్) విడుదల చేసింది. కర్ణాటకకు ప్రధాని మోదీ ప్రభుత్వం ఇచ్చిన కానుక 'చెంబు' అంటూ... కరువు, వరదల పరిహారం చెంబు, రైతుల ఆదాయం రెట్టింపు చెంబు, అందరి ఖాతాలకు రూ.15లక్షలు జమ చెంబు.. అని ఆ ప్రకటనల్లో పేర్కొంది. తాము కట్టిన వంద రూపాయల పన్నులో రూ.13 వాపసు చేయడం చెంబేనని, రాష్ట్రం నుంచి ఎన్నికైన 25 మంది బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఇచ్చిన కానుక చెంబేనని పేర్కొంది. వీటిపై బీజేపీ రాష్ట్ర నేతలు తీవ్రంగా స్పందించారు. చెంబు పేరుతో అధికార కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. కాగా, నగరంలో శనివారం మోదీ ఎన్నికల ప్రచారసభ జరిగే ప్యాలెస్ మైదానానికి సమీపంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా నేతృత్వంలో చెంబులతో ర్యాలీ చేశారు. సీఎం సిద్దరామయ్య ఇదే విషయమై మాట్లాడుతూ, కర్ణాటకకే కాకుండా దేశమంతటికీ ప్రధాని చెంబు ఇచ్చారన్నారు.

ఓటు వేయడం మరవకండి: జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఈ సాధారణ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పోగొట్టుకోవద్దని భారత చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ దేశ పౌరులకు ఉద్బోధించారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య దేశంలో ఇది పౌరుల ప్రధాన కర్తవ్యం అని పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం ఎన్నికల సంఘం చేపట్టిన "మై వోట్... మై వాయిస్" కార్యక్రమానికి పంపిన వీడియోలో ఈమేరకు సందేశం ఇచ్చారు. పౌరులుగా ఓటు వేయడం మన అత్యంత ప్రధానమైన బాధ్యత.. అని తెలిపారు. "దేశం కోసం ప్రతి ఐదేళ్లకు ఐదు నిమిషాలు మాత్రమే మీరు వెచ్చించాలి... మనం ఆ పని చేయలేమా..?" అని ప్రశ్నించారు.

మొరాదాబాద్ బీజేపీ అభ్యర్థి మృతి

లఖ్‌నవూ, ఏప్రిల్ 20: ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కున్వర్ సర్వేశ్ కుమార్ సింగ్ (72) శనివారం మరణించారు. ఈ నినియోజకవర్గానికి శుక్రవారమే ఎన్నికలు జరిగాయి. గత కొంతకాలంగా గొంతునొప్పితో బాధపడుతున్న ఆయన శుక్రవారమే చికిత్స నిమిత్తం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. ఆయన అయిదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా పనిచేశారు.

కేజ్రీవాల్ ఇన్సులిన్‌ను ఎప్పుడో ఆపేశారు

- మాత్రలే వేసుకుంటున్నారు: తిహాడ్ జైలు అధికారులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్..అరెస్టు కావడానికి కొద్ది నెలల ముందు నుంచే ఇన్సులిన్ తీసుకోవడాన్ని మానేశారని తిహాడ్ జైలు అధికారులు తెలిపారు. కేవలం మెటఫార్మిన్ మాత్రలు మాత్రమే తీసుకుంటున్నారని చెప్పారు. ఆయన శరీరంలో సుగర్ లెవెల్స్ మరీ ఆందోళనకరంగా లేవన్నారు. తెలంగాణకు చెందిన ఓ ప్రయివేటు డయాబెటిస్ వైద్యుని పర్యవేక్షణలో ఆయన చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) వి.కె.సక్సేనాకు శనివారం సమర్పించిన నివేదికలో ఈ విషయాలను పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. డయాబెటిస్‌తో బాధపడుతున్న తనకు ఇన్సులిన్ ఇప్పించేలా జైలు అధికారులను ఆదేశించాలని కేజ్రీవాల్ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్జీకి అధికారులు నివేదిక పంపడం ప్రాధాన్యతను సంతరించుకొంది.

శరత్ రెడ్డి బీజేపీకి రూ.60 కోట్లిచ్చారు: సంజయ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన శరత్‌రెడ్డి నుంచి బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.60 కోట్లు తీసుకుందని 'ఆప్' రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఆరోపించారు. దీనిపై ఈడీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ కేసులో ఈడీ చార్జిషీటులో శరత్ రెడ్డిని కీలక వ్యక్తిగా పేర్కొనడాన్ని గుర్తుచేశారు. అతను అరెస్టైన తర్వాత 2022 నవంబరు 15న బీజేపీకి విరాళంగా రూ.5 కోట్లు ఇచ్చారని పేర్కొన్నారు. 6 నెలల పాటు జైలులో ఉన్న తర్వాత అతనికి 2023 మే 8న బెయిల్ వచ్చిందని, తర్వాత కొన్ని రోజుల్లోనే అతను బీజేపీకి మరో రూ.50 కోట్లు విరాళం ఇచ్చారని ఆరోపించారు. అరెస్టుకు ముందు కూడా అతను 2022లో పలు దఫాలుగా రూ.5 కోట్లు బీజేపీకి ముట్టజెప్పారని పేర్కొన్నారు. కాగా, సిసోడియా బెయిల్ పిటిషన్‌పై తీర్పును రౌస్ అవెన్యూ కోర్టు 30వ తేదీకి రిజర్వు చేసింది.

మెదడు ఆరోగ్య సంరక్షణపై టాస్క్‌ఫోర్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిల్లో మెదడు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ టాస్క్‌ఫోర్స్'ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు రెండో ప్రధాన కారణం నాడీ వ్యవస్థ రుగ్మతలే అని, ఏటా 90 లక్షల మంది ఈ కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోగ్యశాఖ పేర్కొంది. భారత్‌లో గత మూడు దశాబ్దాలుగా చేపట్టిన అనేక అధ్యయనాల్లో ఈ కారణంగానే గుండెపోటు, మూర్ఛ, పార్కిన్సన్స్(వణుకుడు రోగం), చిత్త వైకల్యం లాంటి వ్యాధులు వస్తున్నట్లు తేలిందని వెల్లడించింది. అందువల్ల నాడీ సంబంధిత రుగ్మతల గుర్తింపు, నివారణ, అవగాహన తదితర అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేసేందుకు నేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

డైమిథైల్ ఈథర్‌గా కార్బన్ డై ఆక్సైడ్..!

హైదరాబాద్, ఏప్రిల్ 20: కార్బన్ డయాక్సైడ్ (సీవో2)ను డైమిథైల్ ఈథర్‌గా మార్చేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు రెండు జాతీయ సంస్థలు చేతులు కలిపాయి. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, బీహెచ్ఈఎల్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. సీవో2ను సంగ్రహించి, డైమిథైల్ ఈథర్‌గా మార్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయనున్నాయి. సీవో2 నుంచి తయారు చేసిన డైమిథైల్‌ను ఎల్పీజీతో మిశ్రమంగా ఉపయోగిస్తారు. దీనివల్ల కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుంది.

ఎలక్టోరల్ బాండ్లు మళ్లీ తెస్తాం: నిర్మల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: రాబోయే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తే అన్ని భాగస్వామ్య పక్షాలతో విస్తృత సంప్రదింపుల తర్వాత ఎలక్టోరల్ బాండ్లను ఏదో ఒక రూపంలో తిరిగి తీసుకురావాలని బీజేపీ భావిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు రద్దు చేసిన వివాదాస్పద రాజకీయ నిధుల పథకంపై తన విశ్వాసాన్ని ఆమె పునరుద్ఘాటించారు. "భాగస్వామ్య పక్షాలతో ఇంకా చాలా సంప్రదింపులు జరపాల్సి ఉంది. అందరికీ ఆమోదయోగ్యమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి ఏం చేయాలో ఆలోచించాలి. పారదర్శకతను కొనసాగించడంతో పాటు ఇందులోకి నల్లధనం ప్రవేశించే అవకాశాలను పూర్తిగా తొలగించాలి' అని నిర్మల పేర్కొన్నారు. ఈ పథకంలోని కొన్ని అంశాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని సీతారామన్ అంగీకరించారు. నిర్మల వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఇప్పటికే రూ.4లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న తర్వాత కూడా ఇంకా దోపిడీని కొనసాగించాలని చూస్తున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధం, చట్ట విరుద్ధం అని సుప్రీంకోర్టు ప్రకటించిన బాండ్ల విధానాన్ని మళ్లీ వెనక్కు తెస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శక్తిమంతులంతా ఏకమైంది నన్ను దించడానికే



బెంగళూరులో మోదీ ఎన్నికల ప్రచారం

కాంగ్రెస్ పాకుడు తీగ.. ఆసరా ఇచ్చిన పార్టీలను మింగేస్తుంది

అమేఠీలాగే వయనాడ్ నుంచీ రాహుల్ పరారే!.. మహారాష్ట్ర, కర్ణాటకల్లో మోదీ ప్రచారం

బెంగళూరు-ఆంధ్రజ్యోతి/నాందేడ్/పర్భణీ, ఏప్రిల్ 20: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. యూపీలోని కంచుకోట అమేఠీ మాదిరిగానే కేరళలోని వయనాడ్ నుంచీ ఆయన పారిపోవడం ఖాయమని ఎద్దేవాచేశారు. శనివారం ఆయన మహారాష్ట్రలోని నాందేడ్, పర్భణీ, కర్ణాటకలోని చిక్కబళ్లాపుర, బెంగళూరుల్లో జరిగిన ఎన్నికల సభల్లో ప్రసంగించారు. 'ఇండీ' కూటమి భాగస్వాములైన కాంగ్రెస్, వామపక్షాలు కేరళలో పరస్పరం కుస్తీలు పడుతున్నాయని, అవమానించుకుంటున్నాయన్నారు. రాహుల్‌ను తాను కూడా అనని మాటలను(అమూల్ బేబీ) ఆ రాష్ట్ర సీఎం విజయన్ అంటున్నారని.. వయనాడ్‌లో ఈ నెల 26న పోలింగ్ ముగిశాక రాహుల్ కోసం కాంగ్రెస్ మరో సురక్షితమైన సీటు చూడాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు (అమేఠీ, రాయ్‌బరేలీ స్థానాలకు కాంగ్రెస్ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు). దేశంలో నాలుగో వంతు సీట్ల కోసం విపక్ష కూటమి భాగస్వాములు పరస్పరం కొట్లాడుకుంటున్నాయని..జూన్ 4న ఫలితాల ప్రకటన తర్వాత జుట్లు జుట్లు పట్టుకుంటాయన్నారు. తొలిదశలో 102 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బూత్ స్థాయిలో బీజేపీ విశ్లేషించుకుందని.. ప్రజలు ఏకపక్షంగా ఎన్డీయేకే ఓట్లేశారని తేలిందని చెప్పారు. కాంగ్రెస్ తన ఓటమిని అంగీకరించేసిందన్నారు. తనను ప్రధాని పదవి నుంచి దించివేయడానికి దేశ విదేశాల్లోని పెద్దపెద్ద, శక్తిమంతమైన వాళ్లంతా ఏకమయ్యారని మోదీ విమర్శించారు. అయితే నారీశక్తి, మాతృశక్తి ఆశీస్సులు, సురక్షాకవచంతో ఇలాంటి సవాళ్లను దాటుకుంటూ ముందుకుపోతానని తెలిపారు. కాంగ్రెస్ పాకుడు తీగలాంటిదని.. ఆసరా ఇచ్చిన పార్టీలను కబళిస్తుందని ధ్వజమెత్తారు. ప్రస్తుత ఎన్నికలు ప్రభుత్వ ఏర్పాటు కోసం మాత్రమే కాదని.. దేశాన్ని స్వావలంబన కలిగిన అగ్రరాజ్యంగా మలచడం కోసమని చెప్పారు. 'దేశ విభజనకు కాంగ్రెసే కారణం. కశ్మీరు సమస్యను సృష్టించిందీ ఆ పార్టీయే. 370 అధికరణ సాకుతో అక్కడ భారత రాజ్యాంగాన్ని అనుమతించలేదు. 2019లో ఆ అధికరణను రద్దుచేశాం. ముంబై పేలుళ్ల దోషి యాకూబ్ మెమన్ సమాధిని అలంకరించడంలో కాంగ్రెస్, నకిలీ శివసేన (ఉద్ధవ్ శివసేన) నిమగ్నమయ్యాయి' అని విరుచుకుపడ్డారు. విపక్ష ఇండీ కూటమికి నాయకుడేలేడని.. భవిష్యత్తు విజన్ కూడా లేదని విమర్శించారు. వారిదంతా స్కాముల చరిత్రగా పేర్కొన్నారు. మూడో దఫా ప్రధానినైతే.. ఇంతవరకు ఇల్లు, గ్యాస్ కనెక్షన్, కుళాయి నీరు అందనివారికి కచ్చితంగా అందిస్తానని.. ఇది 'మోదీ గ్యారెంటీ' అని చెప్పారు. 3 కోట్ల మంది డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేసేందుకు ఉద్దేశించిన 'లఖ్‌పతీ దీదీ' స్కీం సహా గత పదేళ్లలో మహిళా సంక్షేమానికి తన ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. కర్ణాటకలో అవినీతి తారస్థాయికి చేరిందని.. దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, ఓ విద్యార్థినిని కళాశాలలోనే హత్య చేశారని, భజన చేస్తే దాడులు చేస్తున్నారని విమర్శించారు. చిక్కబళ్లాపుర సభలో తనతో వేదిక పంచుకున్న మాజీ ప్రధాని, మిత్రపక్షం జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడను మోదీ ప్రశంసించారు. 90 ఏళ్ల వయసులో కూడా ఉత్సాహం, నిబద్ధతతో పనిచేస్తున్నారని.. ఆయన తనకు స్ఫూర్తి అని తెలిపారు.

కమలం గూటికి ప్రియాంక సహాయకుడు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: కీలకమైన సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమైన తర్వాత కూడా కాంగ్రెస్ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్.. హస్తం పార్టీని విలవిల్లాడేలా చేస్తోంది. తాజాగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ సహాయకుడు తాజిందర్ బిట్టు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కార్యదర్శిగా, ఏఐసీసీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన శనివారం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సమక్షంలో కమలం గూటికి చేరిపోయారు. దీనికి ముందు పార్టీ ప్రాథమిక సభ్యత్వం, ఏఐసీసీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం.. ఫేస్‌బుక్ పోస్టులో మాత్రం.."బరువెక్కిన హృదయంతో పార్టీతో నాకున్న 35ఏళ్ల అనుబంధాన్ని వీడుతున్నా"అని పేర్కొన్నారు. దివంగత ఎంపీ సంతోఖ్ చౌధరి సతీమణి కరమ్‌జిత్ కౌర్ కూడా కాంగ్రెస్ వీడి బీజేపీ బాటపట్టారు. మధ్యప్రదేశ్‌లోనూ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ఎమ్మెల్యే హరివల్లభ్ శుక్లా సహా పలువురు సీనియర్లు పార్టీకి గుడ్‌బై చెప్పి కమలం గూటికి చేరారు. ఇటీవల అనేక మంది హైప్రొఫైల్ నేతలు పార్టీని వీడారు. అహ్మదాబాద్ తూర్పు నియోజకవర్గం లోక్‌సభ టికెట్ ఇచ్చాక కూడా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రోహన్ గుప్తా పార్టీకి గుడ్‌బై చెప్పారు.

మోదీ అవినీతి స్కూల్‌ను మూసేస్తాం

- రాహుల్ గాంధీ వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో నరేంద్రమోదీ అవినీతి స్కూల్‌ను నడుపుతున్నారని, తాము అధికారంలోకి రాగానే దాన్ని శాశ్వతంగా మూసేయిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ స్కూల్‌లో అవినీతి శాస్త్రం అనే సబ్జెక్టులోని ప్రతి అధ్యాయాన్ని ఆయనే బోధిస్తున్నారంటూ శనివారం ట్వీట్ చేశారు. వ్యాపార సంస్థలపై దాడులు చేయడం ద్వారా విరాళాలెలా సేకరించాలి? అవినీతిపరుల అవినీతిని వాషింగ్ మెషిన్‌తో ఎలా ప్రక్షాళన చేయొచ్చు? ఏజెన్సీలను రికవరీ ఏజెంట్లుగా మార్చడం ద్వారా బెయిల్-జైల్ ఆట ఎలా ఆడాలన్న పాఠాలను మోదీ బోధిస్తారని ఆరోపించారు.

రాహుల్ 7 విజయన్

- కేరళలో 'ఇండియా' పోరు తీవ్రం
- సీఎంపై కాంగ్రెస్ నేత విమర్శలు
- దీటుగా సమాధానం ఇచ్చిన కామ్రేడ్



తిరువనంతపురం, ఏప్రిల్ 20: ఇండియా కూటమిలో మిత్రపక్షాలైన కాంగ్రెస్-వామపక్షాల మధ్య కేరళలో మాత్రం రాజకీయ వేడి ఓ రేంజ్‌లో సాగుతోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, కేరళ సీఎం పినరయి విజయన్‌ల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు వారం ముందు నుంచి వీరి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. "సీఎం పినరయి విజయన్‌ను ఈడీ, సీబీఐలు ఎందుకు ప్రశ్నించడం లేదు"అని శుక్రవారం రాహుల్ చేసిన వ్యాఖ్యలు.. విజయన్‌కు మంటపుట్టించాయి. దీంతో సీఎం విజయన్.. రాహుల్‌పై నిప్పులు చెరిగారు. అశోక్‌చవాన్ మాదిరిగా తాము భయపడబోమని కౌంటర్ ఇచ్చారు. కొజికోడ్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో విజయన్ మాట్లాడుతూ.. "వామపక్ష నేతలు జైలుకు వెళ్లేందుకు సైతం వెనుకాడరు. మీ నాయనమ్మ (ఇందిరా గాంధీ)ఎంతో మంది కమ్యూనిస్టు దిగ్గజాలను ఏడాదిన్నరకుపైగా జైల్లోపెట్టింది. అయినా అశోక్ చవాన్ మాదిరిగా మావాళ్లు ఏడవలేదు"అని బదులిచ్చారు. గతంలో మహారాష్ట్రకు చెందిన కాం గ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్.. హస్తం పార్టీని వీడి బీజేపీ గూటికి చేరారు. దీనిని ప్రస్తావిస్తూ అప్పట్లో రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. "జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆయన(అశోక్ చవాన్) బాధపడ్డారు. మా అమ్మ (సోనియా) ముందు కన్నీరు పెట్టుకున్నారు"అని పేరు చెప్పకుండా వ్యాఖ్యానించారు. అయితే.. రాహుల్ వ్యాఖ్యలను చవాన్ కొట్టిపారేశారు. ఇవి నిరాధారమని, తాను ఏడవాల్సిన అవసరం లేదన్నారు. కాగా మోదీ ప్రభుత్వం సీఏఏ సవరణ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడు రాహుల్ మౌనంగా ఎందుకున్నారని విజయన్ ప్రశ్నించారు. వయనాడ్ నుంచి పోటీచేస్తున్న సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై పోటీ చేసే స్థాయి రాహుల్‌కు ఉందా అని సీఎం ప్రశ్నించారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య మాటల పోరు తీవ్రమైంది. ఈ క్రమంలోనే విజయన్‌పై ఆరోపణలున్నా సీబీఐ, ఈడీలు ఎందుకు ప్రశ్నించడంలేదని రాహుల్ అన్నారు.

విజయన్ రాజీపడ్డారు: ప్రియాంక

"సీఎం విజయన్ రాజీపడ్డారు. అందుకే బీజేపీని వదిలేసి, రాహుల్‌పై ఏకపక్షంగా విరుచుకుపడుతున్నారు"అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పతనంతిట్టలో పర్యటించిన ఆమె విజయన్‌పై విమర్శలు చేశారు. పలు కుంభకోణాలు, బంగారం స్మగ్లింగ్ వంటి తీవ్ర కేసుల్లో విజయన్ పేరు వెలుగుచూసినా బీజేపీనేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆయన విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు.

తొలిదశలో 65.5 శాతం పోలింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: లోక్‌సభ తొలిదశ ఎన్నికల్లో 65.5 శాతం పోలింగ్ నమోదైంది. తొలిదశలో శుక్రవారం దేశవ్యాప్తంగా 102 నియోజకవర్గాలలో ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. తమిళనాడులో మొత్తం 39 నియోజకవర్గాలు, రాజస్థాన్‌లో 12, యూపీలో 8, మధ్యప్రదేశ్‌లో 6 స్థానాలతో పాటు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తొలిదశలో ఎన్నికలు జరిగాయి. లక్షద్వీప్‌లో అత్యధికంగా 83.88 శాతం పోలింగ్ నమోదైంది. బిహార్‌లో అతితక్కువగా 48.5% మాత్రమే పోలింగ్ నమోదైంది. తమిళనాడులో 72.09% పోలింగ్ నమోదైనట్టు శుక్రవారం ప్రకటించిన ఎన్నికల సంఘం అధికారులు దానిని 69.46%గా శనివారం సవరించారు. కాగా, ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో 19న జరిగిన పోలింగ్ చెల్లదని, మళ్లీ నిర్వహించాలన్న ఈసీ ఆదేశాలతో సోమవారం మళ్లీ పోలింగ్ జరగనుంది.

మస్క్ భారత పర్యటన రద్దు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టెస్లా సీఈవో, మైక్రోబ్లాగింగ్ సంస్థ ఎక్స్ చీఫ్ ఈలాన్ మస్క్ భారత పర్యటన రద్దయింది. ఈ విషయాన్ని మస్క్ స్వయంగా ఎక్స్‌లో ప్రకటించారు. ఆది, సోమవారాల్లో ఆయన భారత్‌లో పర్యటించాల్సి ఉంది. ప్రధాని మోదీతో కూడా సమావేశానికి షెడ్యూల్ ఖరారైంది. ఈ సందర్భంగా ఆయన భారత్‌లో 2-3 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఎంట్రీ-లెవల్ కార్ల తయారీ సంస్థ ఏర్పాటుపై ప్రకటన చేయాల్సి ఉండగా.. ఉన్నఫళంగా తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నెల 23న(మంగళవారం) అమెరికాలో టెస్లా ప్రథమ త్రైమాసిక పురోగతి సమావేశం సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. త్వరలో భారత్‌కు వస్తానని మస్క్ తన పోస్టులో పేర్కొన్నారు. నిజానికి మస్క్ పెట్టుబడులను ప్రకటిస్తే.. మేకిన్ ఇండియా, ఉపాధికల్పన పరంగా గొప్ప పురోగతి ఉంటుందని మోదీ సర్కారు భావించింది. ఎన్నికల సమయంలో యువతను పెద్ద ఎత్తున ఆకట్టుకునే అవకాశాలుంటాయని రాజకీయవర్గాలు అభిప్రాయపడ్డాయి. కానీ, ఎన్నికల వేళ భారత్‌కు వెళ్లడం సరికాదని అమెరికా ప్రభుత్వ వర్గాలు చెప్పడం వల్లే.. మస్క్ తన పర్యటనను ఉన్నఫళంగా రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో పరిస్థితులపై అమెరికా ఇటీవల నిరసన స్వరం వినిపిస్తోంది.

మోదీ ఓడిపోతారని తెలిసే

లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ ప్రధానిగా ఉండరని తెలిసినందువల్లే మస్క్ తన పర్యటనను రద్దు చేసుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ అన్నారు. "జరగబోయేదేమిటో మస్క్ తెలుసుకుని ఉంటారు. ఇండియా కూటమి కొత్త ప్రధాని మస్క్‌ను త్వరలో ఆహ్వానిస్తారు. విద్యుత్తు వాహనాలకు మరింత ప్రోత్సాహం ఉంటుంది' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

కన్నడనాట హోరాహోరీ!

దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు కంచుకోట

- బీజేపీకి దక్షిణాదిలో బలమున్న ఏకైక రాష్ట్రం
- ఉనికి కోసం జేడీఎస్ ఆరాటం



(బెంగళూరు-ఆంధ్రజ్యోతి)

కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల సమరం హోరాహోరీగా సాగుతోంది. మొత్తం 28 నియోజకవర్గాలకు రెండు విడతలుగా పోలింగ్ జరగనుంది. ఈనెల 26న 14 నియోజకవర్గాలకు, మే 7న మరో 14 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగనుంది. కాంగ్రెస్ పార్టీ సొంతంగా అన్ని స్థానాల్లో బరిలో ఉండగా.. బీజేపీ-జేడీఎస్ పొత్తుతో ముందుకెళ్తున్నాయి. బీజేపీ 25, జేడీఎస్ 3 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రాబల్యం కలిగిన లింగాయత సామాజికవర్గం నేత యడియూరప్ప ద్వారా బీజేపీ రాజకీయాలు కొనసాగిస్తోంది. జేడీఎస్‌తో పొత్తు వల్ల రెండో బలమైన సామాజికవర్గం ఒక్కలిగల మద్దతు కూటమికి కలిసివచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్‌లో సీఎం సిద్దరామయ్య బీసీ నేతగా గుర్తింపు కలిగి ఉన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఒక్కలిగ సామాజికవర్గానికి చెందినవారు. బీజేపీకి లింగాయత, ఒక్కలిగల మద్దతు ఉండగా కాంగ్రెస్‌కు బీసీ, ఒక్కలిగలతోపాటు మైనారిటీలు అండగా ఉన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు రెండు పార్టీలకూ ప్రతిష్ఠాత్మకమే. కాంగ్రెస్‌కు అనుకున్నన్ని స్థానాలు దక్కకపోతే ముఖ్యమంత్రి మార్పు, బీజేపీకి సీట్లు తగ్గితే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు వంటి పరిణామాలు ఉంటాయనే చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్‌లో కలహాలు..

కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక కంచుకోట అనే పేరుంది. ఒకప్పుడు దేశమంతటా కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం ఉన్నా, మాజీ ప్రధాని ఇందిరాగాంధీని చిక్కమగళూరు నుంచి గెలిపించడం దీనికి తార్కాణం. రాష్ట్రం నుంచి మరో కీలక ఎన్నికల్లో బళ్లారి నుంచి బీజేపీ నేత సుష్మాస్వరాజ్‌పై సోనియాగాంధీ విజయం సాధించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత కలహాలను తమకు అనుకూలంగా మార్చుకుని సత్తాచాటేందుకు బీజేపీ ఎత్తుగడలు వేస్తోంది. బీజేపీకి దక్షిణాదిలో ఆధిపత్యం ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే. ప్రస్తుతం 28 మంది సిటింగ్ ఎంపీలలో 25 మంది బీజేపీ వారే. కాంగ్రెస్, జేడీఎస్‌లకు ఒక్కో ఎంపీ ఉన్నారు. మండ్య నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన సినీ నటి సుమలత బీజేపీకి మద్దతిస్తున్నారు. మొత్తంగా 28 స్థానాల్లో బీజేపీకి 26 మంది ఎంపీలున్నారు.

మోదీ ప్రచార హోరు..

గత కొన్ని సంవత్సరాలుగా జేడీఎస్ ప్రాబల్యం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం బీజేపీతో చేతులు కలపడం ద్వారా జేడీఎస్ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ ప్రచారంలో మోదీ కీలకంగా మారారు. ఇప్పటికే మోదీ ఆరు బహిరంగసభలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఇటీవల హిందువులపై చోటు చేసుకున్న సంఘటనలను, హుబ్బళ్లిలో విద్యార్థిని దారుణహత్యను బీజేపీ తన ప్రచారాస్త్రాలు తెరపైకి తెస్తోంది. మోదీ శనివారం ఎన్నికల ప్రచార సభలో కూడా ఇవే అంశాలను ప్రస్తావించారు. ఇదిలా ఉండగా, ఈసారి ఎన్నికల్లో రెబెల్స్ తీవ్ర ప్రభావం చూపుతున్నారు. బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్ప శివమొగ్గలో స్వతంత్రంగా పోటీ చేయడం, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పోటీ చేస్తున్న ధారవాడలో ఆరు లక్షలకుపైగా ఓటర్లు కల్గిన లింగాయత సామాజికవర్గానికి చెందిన మఠాధిపతి దింగాలేశ్వరస్వామి పోటీ చేయడం బీజేపీకి ఇబ్బందిగా మారింది. కాంగ్రెస్ పార్టీలోనూ రెబెల్స్ బెడద వెంటాడుతోంది. కాగా, మూడు సంస్థలు నిర్వహించిన ఎన్నికల సర్వేల్లో విభిన్నమైన ఫలితాలు వెలువడ్డాయి.

కలిసివచ్చిన 5 గ్యారెంటీలు..

కాంగ్రెస్ పార్టీకి శాసనసభ ఎన్నికల్లో ఐదు గ్యారెంటీల హామీలు బాగా కలసివచ్చాయి. వాటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. దీంతో, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన స్థానాలు వస్తాయని పలు సర్వేలు అంచనా వేస్తున్నాయి. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 'పే సీఎం', 40% కమీషన్ వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా బీజేపీని దెబ్బకొట్టింది. ఇప్పుడు.. కేంద్రం కర్ణాటకకు అన్నింటా ఖాళీ చెంబు చూపుతోందని వ్యంగాస్త్రాలు సంధిస్తూ ప్రకటనలిస్తోంది.

ఆరోగ్య బీమా.. 65 ఏళ్లు దాటినా



హెల్త్ ఇన్సూరెన్స్ వయో పరిమితి రద్దు.. ఐఆర్‌డీఏఐ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఆరోగ్య బీమా రంగంలో పాలసీదారుల ప్రయోజనానికి పెద్ద పీట వేస్తూ 'భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సాధికారిక సంస్థ' (ఐఆర్‌డీఏఐ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం అమలులో ఉన్న 65 ఏళ్ల వయో పరిమితిని తొలగించింది. తద్వారా ఇకపై 65 ఏళ్లకు పైబడిన వారు కూడా ఆరోగ్య బీమా చేసుకోవటానికి వీలవుతుంది. ఏప్రిల్ 1 నుంచే ఈ కొత్త నిర్ణయం అమల్లోకి వస్తుందని ఐఆర్‌డీఏఐ తెలిపింది. ఇక మీదట అన్ని వయసుల వారికి సరిపోయే ఆరోగ్య బీమా పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలు తీసుకొస్తాయని ఆశిస్తున్నామని పేర్కొంది. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు అవసరమైన సేవలను అందించాలని, బీమా చెల్లింపులకు (క్లెయిమ్స్‌కు) సంబంధించి వారి కోసమే ప్రత్యేకంగా కొన్ని విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించింది. క్యాన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు, ఎయిడ్స్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కూడా ఆరోగ్య బీమా పథకాలను అందించాలని, ఆ వర్గాలకు ఇన్సూరెన్స్ నిరాకరించటం ఇక మీదట కుదరదని బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది. ఆరోగ్య బీమా తీసుకున్న తర్వాత అన్ని వ్యాధులకూ అది వర్తించటానికి ప్రస్తుతం అమలులో ఉన్న 48 నెలల వెయిటింగ్ పీరియడ్‌ను 36 నెలలకు ఐఆర్‌డీఏఐ తగ్గించింది. పాలసీదారు తన జబ్బుల గురించి వెల్లడించినా, వెల్లడించకపోయినా.. బీమా తీసుకున్న 36 నెలల తర్వాత అన్ని జబ్బులకూ బీమా ఇవ్వాల్సిందేనని ఇన్సూరెన్స్ కంపెనీలను ఆదేశించింది. ప్రస్తుతం ఆస్పత్రిలో తీసుకున్న చికిత్స వ్యయాన్ని భరించేలా ఆరోగ్య బీమా పథకాలు ఉంటున్న విషయం తెలిసిందే. దీని బదులుగా నిర్ణీత వ్యాధులకు నిర్ణీత బీమా సొమ్ము కంపెనీలు అందించాలని, తద్వారా పాలసీదారులకు తమ వద్ద ఉన్న బీమా పథకం గురించి ముందే స్పష్టత ఉంటుందని ఐఆర్‌డీఏఐ తెలిపింది. ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ మార్పు దిశగా క్రమంగా కార్యాచరణ చేపట్టాలని పేర్కొంది. ఆరోగ్య బీమాపై మారటోరియం వ్యవధిని కూడా ఇప్పుడున్న 8 ఏళ్ల నుంచి ఐదేళ్లకు తగ్గించింది. అంటే, ఐదేళ్లపాటు ప్రీమియం చెల్లిస్తే బీమా పథకంలోని అన్ని సేవలనూ పాలసీదారులకు కంపెనీ అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఐఆర్‌డీఏఐ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐఆర్‌డీఏఐ తీసుకున్న నిర్ణయాలపై బీమా రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయాలతో దేశంలో మరింత సమ్మిళిత ఆరోగ్య సేవలకు అవసరమైన వాతావరణం నెలకొంటుందని, ఇన్సూరెన్స్ కంపెనీలు వైవిధ్యపూరిత సేవలు అందించటానికి వీలు కలుగుతుందన్నారు.



అబ్ కీ బార్?



రాజకీయ కక్షతోనే విపక్ష సీఎంల అరెస్ట్: ఉత్తమ్

మేళ్లచెర్వు, ఏప్రిల్ 20: రాజకీయ కక్షతోనే ప్రతిపక్షాలకు చెందిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో పాటు పశ్చిమబెంగాల్‌కు చెందిన పలువురు మంత్రులను సీబీఐ, ఈడీ అరెస్ట్ చేసిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం, మేళ్లచెర్వు మండల కేంద్రాల్లో శనివారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రశ్నించిన వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర స్వతంత్ర సంస్థలను ప్రయోగించి కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్నారు.



సీపీఐ నాయకులతో చర్చిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తాం

» బీజేపీని అడ్డుకుంటాం: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

» ప్రజాస్వామ్యాన్ని బీజేపీ కూనీ చేస్తోంది: భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మతోన్మాద బీజేపీని తెలంగాణలోకి రాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌తో కలిసి నడుస్తామని చెప్పారు. శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి ఎన్నికల్లో మద్దతుపై సీపీఐ నేతలతో చర్చించారు. అనంతరం ఇరుపార్టీల నాయకులు మీడియాతో మాట్లాడారు. కూనంనేని మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని నిర్ణయించేవన్నారు. భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, సీఎం రేవంత్ రెడ్డి సంప్రదింపుల కోసం తనను సీపీఐ కార్యాలయానికి పంపారని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు తెలపాలని సీపీఐని అభ్యర్థించానన్నారు. లౌకికవాద పార్టీలతో కలిసి రాజ్యాంగాన్ని కాపాడేందుకు 'ఇండియా' కూటమి పనిచేస్తుందని తెలిపారు.

అక్షింతలు పంచారు.. అభివృద్ధిని మరిచారు

» ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసిన బీజేపీ : సీతక్క

జన్నారం, ఏప్రిల్ 20: బీజేపీ నాయకులు శ్రీరాముని అక్షింతలను గ్రామ గ్రామాన పంచారు కానీ అభివృద్ధిని మాత్రం మరిచిపోయారని రాష్ట్ర మహిళా. శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. ఏ రోజూ ప్రజా సమస్యలను వారు పట్టించుకోలేదని ఆరోపించారు. శనివారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలు, ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రోజు కూలీ రూ.400 అందిస్తామని తెలిపారు. కాగా, ఇంద్రవెల్లి ఘటనకు 43ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఇంద్రవెల్లిలో ఉన్న అమరవీరుల స్థూపానికి సీతక్క నివాళులర్పించారు.



ఇంద్రవెల్లిలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

కేసీఆర్ బీజేపీలో చేరడం తథ్యం

» ఒక్క ఎమ్మెల్యే కూడా ఆయన్ను నమ్మట్లేదు: పొంగులేటి

మెదక్, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీజేపీలో చేరడం తథ్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి పొంగులేటి మాట్లాడారు. నాలుగు నెలల క్రితం తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదని విమర్శించారు. 20మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమని, ఏ ఎమ్మెల్యే కూడా ఆయనను నమ్మే పరిస్థితి లేదని పొంగులేటి స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలనూ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని మంత్రి దామోదర రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు.

కూతురి కోసం ఎంపీ స్థానాల తాకట్టు!

కేసీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 20: తన కూతురు కవిత విడుదల కోసం ఎంపీలను గెలిపించి, బీజేపీకి తాకట్టు పెట్టాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. వేములవాడలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని తెలిపారు. మరోమారు అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని మార్చాలని మోదీ చూస్తున్నారని, అదే జరిగితే నియంతృత్వం పెరిగిపోతుందని హెచ్చరించారు. బండి సంజయ్ మతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

కేడీని దించేశాం.. ఇక మోదీనే!

(మొదటిపేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. 'కాంగ్రెస్ పార్టీని ఖాళీ చేస్తానని, 20 మంది టచ్‌లో ఉన్నారని కేసీఆర్ అంటున్నడు.. నువ్వు ఖాళీ చేయడానికి అదేమైన రెండు లీటర్ల ఫుల్‌బాటిల్ అనుకుంటున్నవ.. 20 పెగ్గులేస్తే ఖాళీ అవడానికి అది ఫుల్‌బాటిల్ కాదు. ఇక్కడ కాపలా ఉన్నదెవడు? బిడ్డా.. టచ్‌చేసి చూడు. మాడి మసైపోతావు. మర్యాదగా ఉండడానికి నేనేమైనా జైపాల్‌రెడ్డి, జానారెడ్డి అనుకున్నవా? మా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో బట్టలూడదీసి రోడ్లమీద ఉరికిచ్చి కొట్టిస్తా. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతావా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబరులో కేడీని గద్దె దించామని ఇప్పుడు మోదీని బొందపెడతామని చెప్పారు.

పేదలు, మహిళలు ఆనందంగా ఉండొద్దా..

125 రోజుల్లో 35 కోట్ల మంది ఆడబిడ్డలు ఉచితంగా బస్సు ప్రయాణం చేశారని, తమ అమ్మగారింటికి, అత్తగారింటికి, జాతర్లకు తృప్తిగా పోయివస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మహిళల ఆనందాన్ని చూడలేక వాళ్ల కళ్లల్లో జీడి పోసుకుంటున్నారని మండిపడ్డారు. పేదలకు వైద్యం అందించకుండా అడ్డుపడటానికి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్‌ను మోదీ, కేసీఆర్‌లు రూ.1200 చేశారని చెప్పారు. తాము ఆడబిడ్డలను ఆదుకునేందుకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. పేదవాళ్లకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు ఇవ్వడాన్ని కూడా ఓర్చుకుంటలేరని.. మోదీ, కేసీఆర్ కడుపులు మండుతున్నాయని దుయ్యబట్టారు. గతంలో వైఎస్ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లను డబ్బా ఇళ్లని విమర్శించిన కేసీఆర్ అనే దద్దమ్మ, సన్నాసి మెదక్ జిల్లాలో ఎన్ని ఇళ్లు ఇచ్చాడో చెప్పాలని ప్రశ్నించారు. కమీషన్లు ఇచ్చిన వాళ్లకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ద్వారా రూ.22,500 కోట్లతో 4 లక్షల ఇళ్లను అందజేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

మెదక్ చర్చి, ఏడుపాయల దుర్గమ్మ సాక్షిగా..

మెదక్ చర్చి, ఏడుపాయల వనదుర్గమ్మ సాక్షిగా వచ్చే పంద్రాగస్టు లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేసే బాధ్యత తానే తీసుకుంటానని రైతులకు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. వచ్చే వానాకాలంలో పండించే వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి, కొనుగోలు చేస్తామని చెప్పారు. మామ, అల్లుళ్లు కలిసి మెదక్‌లో ఏం చేశారని ప్రశ్నించారు. అయ్య పేరు, మామ పేరు చెప్పి అధికారంలోకి రాలేదని, నీలాంటి వాళ్లను తొక్కుకుంటూ వచ్చామని రేవంత్ అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని బండ కేసి కొట్టాలని, రైతులను చంపిన బీజేపీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ మెదక్ ప్రాంతానికి చేసిందేమీ లేదని రేవంత్ అన్నారు. ఆయన పనైపోయిందని, లేవలేకుంటా పడ్డారని దుయ్యబట్టారు. కారేమో కార్ఖానాకు పోయిందని, తుక్కు కింద తూకం పెట్టి అమ్మాల్సిందేనని ఎద్దేవా చేశారు.



మెదక్ రోడ్‌షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

వాళ్లిద్దరికీ ఓటేస్తే మురిగిపోయినట్లే..

మెదక్ లోకసభ స్థానం నుంచి ముదిరాజ్ బిడ్డ నీలం మధుకు టికెట్ ఇచ్చామని, గెలిపించాలని రేవంత్ కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ఒక ఖాసీం రజ్వీ అని, మల్లన్నసాగర్‌లో 14 గ్రామాలను ముంచిన దుర్మార్గుడని ఆరోపించారు. కలెక్టర్‌గా ఉండి 50 వేల ఎకరాలు గుంజుకొని వందలాది మంది రైతుల కుటుంబాల మీద కేసులు పెట్టించాడన్నారు. నిజాం రాజుకు ఖాసీం రజ్వీ ఎలాగో.. కేసీఆర్‌కు వెంకట్రామారెడ్డి అలాగే గులాంగిరి చేసి ప్రజలను ఇబ్బంది పెట్టాడని గుర్తుచేశారు. కేసీఆర్‌కు బువ్వ లేనప్పుడు బుక్కెడు బువ్వ పెట్టిన మదన్‌రెడ్డిని కాదని కోట్లు కొల్లగొట్టిన వ్యక్తికి టికెట్ ఇచ్చారని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు దుబ్బాక ఉప ఎన్నికలో ఎన్నో హామీలు ఇచ్చి ఎగ్గొట్టినందుకు ఓడగొట్టారని వివరించారు. తనను గెలిపిస్తే కేంద్రం నుంచి వేల కోట్లు తెస్తానని చెప్పిన రఘునందన్ ఎన్ని వేల కోట్లు తెచ్చాడో చెప్పాలని సవాల్ విసిరారు. వీరిద్దరికీ ఓట్లేస్తే మురిగిపోయినట్లేనన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కోరారు. 1980లో మెదక్ ఎంపీగా గెలిచిన ఇందిరాగాంధీ.. ప్రధానమంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇక్కడ అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసి, లక్షలాది మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. ఆమె మెదక్ ఎంపీగా ఉన్నప్పుడే తుదిశ్వాస విడిచారని విచారం వ్యక్తం చేశారు. మెదక్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఇందిరమ్మ రుణం తీర్చుకోవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. గత 25 ఏళ్లుగా బీజేపీ, బీఆర్ఎస్‌లను ఇక్కడ గెలిపిస్తే ఒక్క పరిశ్రమను కూడా తేలేదని ఆరోపించారు.

కాగా, ప్రచారంలో భాగంగా భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పర్యటించనున్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.

అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి

నామినేషన్ దాఖలు చేయని నీలం మధు

మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు శనివారం తన నామినేషన్ సమర్పించడానికి అట్టహాసంగా ఏర్పాట్లు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు సైతం హాజరయ్యారు. అయితే ప్రణాళికాలోపం కారణంగా మధు నామినేషన్ దాఖలు చేయలేకపోయారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారు. సీఎం రోడ్ షో తర్వాత నామినేషన్ దాఖలు చేయాలని భావించారు. కానీ, ఆయన ఆలస్యంగా రావడంతో రోడ్‌షో పూర్తయ్యేసరికి సమయం మించిపోయింది. ఇప్పటికే ఈ నెల 18న నీలం మధు తరఫున మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ నామినేషన్ దాఖలు చేశారు.

గుజరాతోళ్లే.. గొప్పోళ్లా!?

26 సీట్లు గెలిపించిన గుజరాత్‌కు 7 మంత్రి పదవులు..

27 సీట్లు ఇచ్చిన కర్ణాటకకు ఒక్కటేనా? : రేవంత్

హైదరాబాద్, బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ ప్రజలు 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని 26 సీట్లలో గెలిపించారని, అనంతరం ఆ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ఏడుగురికి కీలక పదవులు దక్కాయని, అవే ఎన్నికల్లో కర్ణాటక ప్రజలు 27 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే దక్కిన కేంద్ర మంత్రి పదవి ఒక్కటంటే ఒక్కటేనని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇది కన్నడ ప్రజలను అవమానించినట్లు కాదా అని నిలదీశారు. 'యూపీకి కూడా 12 అత్యంత కీలకమైన మంత్రి పదవులు లభించాయి. గుజరాత్, యూపీల్లోనే సమర్థులైన నాయకులు ఉన్నరా? కర్ణాటక, తెలంగాణల్లో లేరా? మన రెండు రాష్ట్రాలకు కేంద్ర మంత్రి పదవులు ఒక్కొక్కటి మాత్రమేనా? తెలుగు, కన్నడ మాట్లాడే ఎంపీలు కలిసి 70 మంది ఉంటే.. కేంద్రంలో దక్కేది రెండే మంత్రి పదవులా? గుజరాత్‌కు మాత్రం ఏడు ఇస్తరా? ఏం! వాళ్లే పెద్ద మొనగాళ్లా? మనం రాజ్యాలు ఏలలేమా? ప్రభుత్వాలను నడపలేమా?' అంటూ బెంగళూరులోని కన్నడ, తెలుగు ప్రజలను రేవంత్ ప్రశ్నించారు. బెంగళూరు సెంట్రల్ అభ్యర్థి మన్సూర్‌ఖాన్ తరఫున మహదేవపురలో శనివారం రాత్రి బహిరంగ సభలో రేవంత్ ప్రసంగించారు. కొద్దిసేపు కన్నడలో మాట్లాడి ఆకట్టుకున్నారు. మహదేవపురతో పాటు పలు ప్రాంతాల్లో రోడ్‌షోలు నిర్వహించారు. కర్ణాటక నుంచి 20 మంది కాంగ్రెస్ ఎంపీలను గెలిపించాలని, తెలంగాణ నుంచి 14 మందిని గెలిపిస్తామన్నారు. తద్వారా కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఎలా ఏర్పాటు కాదో చూద్దామన్నారు. బెంగళూరు ఐటీ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు అభివృద్ధి చేయడంతో లక్షలమంది తెలుగు వాళ్లు వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.

బీజేపీకి ఎందుకు ఓటేయాలి?

ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలని చెప్పి పదేళ్లలో 7.21 లక్షల ఉద్యోగులు ఇచ్చినందుకు, నిరుద్యోగం 62 శాతానికి చేరినందుకు, రైతులపై కాల్పులు జరిపినందుకు మోదీ నేతృత్వంలోని బీజేపీకి ఓటేయాలా అని రేవంత్ ప్రశ్నించారు. యెడియూరప్ప బీజేపీ ఎలక్షన్ కమిషన్ సభ్యుడైతే, ఆయన కుమారుడు విజయేంద్ర బీజేపీ కర్ణాటక శాఖ అధ్యక్షుడని, మరో కుమారుడు రాఘవేంద్ర ఇప్పుడు ఎంపీగా పోటీ చేస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి బీజేపీ వాళ్లా కుటుంబ రాజకీయాల గురించి మాట్లాడేది అని ప్రశ్నించారు. రాజీవ్‌గాంధీ అనంతర కాలంలో ప్రధాని పదవి అవకాశం వచ్చినా కూడా సోనియా, రాహుల్ తీసుకోలేదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికలు రెండు పరివార్‌ల మధ్య జరుగుతున్నాయని.. ఈవీఎం, ఈడీ, ఐటీ, సీబీఐ, అదానీ, అంబానీలు మోదీ పరివార్ అయితే.. సోనియా, రాహుల్, ఖర్గే, సిద్ధరామయ్య, శివకుమార్ తదితరులు తమ పరివారమన్నారు.

అవినీతి గురించి బీజేపీ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. 'దేవెగౌడ, కుమారస్వామి దేశంలోనే అత్యంత అవినీతిపరులంటూ ఏడాది కిందట మాట్లాడిన మోదీ వారితో పొత్తు ఎట్లా పెట్టుకున్నడు?' అంటూ ప్రశ్నించారు.

కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

ఎవరైనా అడ్డం వస్తే ఊర్కునేది లేదు.. మెదక్ సీటును రాహుల్‌కు గిఫ్ట్‌గా ఇద్దాం

కాంగ్రెస్ సభలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, అడ్డుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే ఊర్కునేది లేదని మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. మెదక్‌లో శనివారం లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ సందర్భంగా జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సభలో జగ్గారెడ్డి ప్రసంగిస్తూ.. సుమారు 40 ఏళ్ల కిందట దివంగత ఇందిరాగాంధీ మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచి, దేశప్రధానిగా కొనసాగారని గుర్తు చేశారు. అలాంటి చరిత్ర ఉన్న మెదక్ సీటును ఈ సారి గెలుచుకుని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి గిఫ్ట్ ఇద్దామని, ఈ దిశగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కష్టపడి పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే అమలు చేసి తీరుతుందని చెప్పారు. ఇందుకు నిదర్శనమే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఐదింటిని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రైతులకు రూ.2లక్షల రుణ మాఫీని పంద్రాగస్టు లోపు అమలు చేయనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.



మెదక్‌లో శనివారం జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డితో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

77 మూడో రోజు నామినేషన్లు

శనివారం మరో సెట్ దాఖలు చేసిన ఈటల

బీఆర్ఎస్ తరఫున కరీంనగర్‌లో వినోద్, జహీరాబాద్‌లో అనిల్

మూడు రోజుల్లో 156 మంది నుంచి 194 నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు భారీగా వస్తున్నాయి. మూడో రోజు, శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 65 మంది అభ్యర్థుల నుంచి 77 నామినేషన్లు ఎన్నికల సంఘానికి అందాయి. శనివారం నామినేషన్ వేసిన వారిలో స్వతంత్ర అభ్యర్థులు 15 మంది వరకు ఉన్నారు. మల్కాజిగిరి స్థానానికి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ శనివారం తన తరఫున మరో సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఇది కాక, మల్కాజిగిరి స్థానానికి శనివారం మరో ఆరు నామినేషన్లు వచ్చాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల స్థానానికి ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక, కరీంనగర్ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తోపాటు మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జహీరాబాద్‌లో బీఆర్ఎస్ తరఫున గాలి అనిల్ కుమార్ నామినేషన్ సమర్పించారు. కాగా, ఇదే స్థానం నుంచి మరో ఐదుగురు అభ్యర్థులు కూడా నామినేషన్ వేశారు. మెదక్ ఎంపీ స్థానానికి వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్రులు నుంచి కలిపి తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. నిజామాబాద్ సెగ్మెంట్‌కు మూడో రోజు ఏడుగురు నామినేషన్ పత్రాలు అందించారు. ఖమ్మం స్థానానికి రెండు, వరంగల్ సెగ్మెంట్‌లో ఎంసిపిఐయు, ధర్మసమాజ్ పార్టీ తరఫున ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ వేయగా, మరో ఇద్దరు ఇండిపెండెంట్లు నామినేషన్ వేశారు. మహబూబ్‌నగర్ స్థానానికి ఏఐఎంఐఎం పార్టీ తరఫున షేక్ మున్నా, ధర్మ సమాజ్ పార్టీ తరఫున జి.రాకేష్ నామినేషన్లు దాఖలు చేశారు. పెద్దపల్లి స్థానానికి ఐదుగురు స్వతంత్రులతోపాటు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా కట్కూరి సందీప్ నామినేషన్లు సమర్పించారు. నల్లగొండ స్థానానికి ఏడుగురు అభ్యర్థులు పది సెట్ల నామినేషన్లు సమర్పించగా, భువనగిరి స్థానానికి ఐదుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన గురువారం నుంచి శనివారం నాటికి మూడు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 156 మంది అభ్యర్థులు ఒక్కొక్కరు ఒకటి, రెండు చొప్పున మొత్తం 194 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు.

బోయినపల్లికి స్థిరాస్తుల్లేవు..



కరీంనగర్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్‌కు స్థిరాస్తులేవీ లేవు. ఆయన అందజేసిన అఫిడవిట్ ప్రకారం.. వినోద్‌కుమార్ పేరిట రూ. 1,53,57,859, ఆయన సతీమణి బి.మాధవి పేరుతో రూ.7,48,63,235 విలువైన చరాస్తులు ఉన్నాయి. వినోద్‌కుమార్ సతీమణి పేరిట రూ. 4,89,40,000, ఉమ్మడి కుటుంబం కింద రూ.1,15,00,000 విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. వినోద్ కుమార్‌కు రూ.56,24,968, సతీమణి మాధవికి రూ.8,36,901 రుణాలున్నాయి.

బండి సంజయ్‌పై 41 కేసులు



కరీంనగర్‌లో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న బండి సంజయ్‌కుమార్‌పై రాష్ట్రంలోని వివిధ పోలీసుస్టేషన్లలో 41 కేసులు ఉన్నాయి. అఫిడవిట్‌లో ఆ కేసుల వివరాలతోపాటు తన ఆస్తి, అప్పుల వివరాలు వెల్లడించారు. బండి సంజయ్ పేరిట రూ.65,70,000, ఆయన సతీమణి బి.అపర్ణ పేరుతో రూ.47,05,000 విలువైన చరాస్తులు ఉన్నాయి. బండి సంజయ్‌కు రూ.2,30,000 బ్యాంకు రుణాలు ఉండగా ఆయన సతీమణికి రూ.11,10,000 రుణాలున్నాయి. బండి సంజయ్ చేతిలో రూ.5 లక్షలు, ఆయన సతీమణి వద్ద రూ.లక్ష నగదు ఉంది. బ్యాంకులో బండి సంజయ్ పేరుపై రూ.23.5 లక్షలు, ఆయన సతీమణి పేరుపై రూ.3.67 లక్షలు ఉన్నాయి. బండి సంజయ్ పేరిట ఓ టయోట ఫార్చ్యునర్, సుజుకీ సియాజ్ కార్లు, స్ప్లెండర్ బైక్ ఉన్నాయి.

గాలి అనిల్ ఆస్తి 82కోట్ల పైమాటే



జహీరాబాద్‌లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్(49).. తమ దంపతులకు రూ.82.46 కోట్ల విలువైన స్థిరచరాస్తులు ఉన్నాయని తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అనిల్‌కు రూ.21.97 లక్షల విలువైన చరాస్తులు ఉండగా ఆయన భార్య సంధ్య పేరిట రూ.1.13కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. అనిల్ పేరిట రూ.31.05కోట్లు, ఆయన సతీమణి పేరిట రూ.50.07కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. హత్నూర మండలం సాదుల్లానగర్‌లో రూ.2కోట్ల విలువైన ఫాంహౌస్ ఉంది.అనిల్ చేతిలో రూ.50వేల నగదు, బ్యాంకులలో 20 తులాల బంగారం ఉంది. భార్య పేరిట రూ.75లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయి. అనిల్‌కు రూ.3.16 కోట్ల రుణాలు ఉన్నాయి. అనిల్‌పై వేర్వేరు పోలీసుస్టేషన్లలో ఆరు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.



సిటింగ్‌లను మారిస్తే గెలిచేవాళ్లం

» పార్టీ ఓటమికి అప్పటి మంత్రులే బాధ్యులు

» మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'రాజకీయాల్లో ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేం. మేం పార్టీ మారుతామనే ప్రచారం అవాస్తవం. అసెంబ్లీ ఎన్నికలప్పుడు సిటింగ్ ఎమ్మెల్యేల్లో 30 నుంచి 35 మంది ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చి ఉన్నట్లయితే బీఆర్ఎస్ అధికారంలో కొనసాగేది. వారిని మార్చకపోవడంవల్లే పార్టీకి అధికారం దూరమైంది. మంత్రులుగా పనిచేసిన వారే పార్టీ అధికారానికి దూరం కావడానికి కారణం' అని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నల్లగొండ జిల్లా ఉరుమడ్లలో శనివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో 11 స్థానాల్లో బీఆర్ఎస్ ఓడిపోవడానికి సుఖేందర్‌రెడ్డే కారణమని దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. తనకు అన్ని పార్టీల నేతలతో సంబంధాలుంటాయని, తనని ఎవరైనా కలుస్తుంటారని, అంత మాత్రాన పార్టీ మారుతామని ప్రచారం చేయడం సరి కాదన్నారు. ఎన్నికల్లో గెలుపోటముల తర్వాత, సమీక్షలు నిర్వహించాలని, బీఆర్ఎస్‌లో సమీక్షలు నిర్వహించకపోవడమే పెద్దలోపమని అభిప్రాయపడ్డారు. తన కుమారుడు అమిత్‌రెడ్డిని ఎంపీగా పోటీ చేయించాలని, హరీశ్, కేటీఆర్ సూచించారని, కానీ జిల్లా పార్టీ నేతల్లో సమన్వయం లేకపోవడంవల్లే తప్పుకున్నట్లు తెలిపారు.

రేవంత్ కంటే రెండు ఆకులు ఎక్కువే చదివా

» దుబ్బాకలో ఓడితే మెదక్‌లో పోటీ చేయొద్దా?: రఘునందన్

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ దోచుకున్న సొమ్మును పేదలకు పంచుతామని చెప్పిన రేవంత్.. ఎంతమందికి ఆ సొమ్ము పంచారో చెప్పాలని బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మెదక్‌లో సీఎం రేవంత్ మాట్లాడిన మాటలు సత్యదూరమన్నారు. కొడంగల్‌లో ఓడిన రేవంత్ మల్కాజ్‌గిరిలో గెలవలేదా, తాను దుబ్బాకలో ఓడితే మెదక్‌లో పోటీ చేయకూడదా అని ప్రశ్నించారు. ఇందిరహయాంలోనే ఇక్రిశాట్, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్ వచ్చాయని రేవంత్ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రేవంత్ కంటే తాను రెండు ఆకులు ఎక్కువే చదివానని పేర్కొన్నారు. గత పదేళ్లలో కేంద్రం చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు.



బాల్య జ్ఞాపకాలు గుర్తొచ్చి.. చకచకా చెట్టెక్కేసి..

మామిడి చెట్టుపై నుంచి జూపల్లి ప్రసంగం

కొల్లాపూర్, ఏప్రిల్ 20: బాల్యం అందమైనది.. మళ్లీ తిరిగిరానిది! మరి.. ఆ మధుర స్మృతులు గుర్తొస్తే ఎవరి మనసు భావోద్వేగంతో ఉప్పొంగదు? మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్నికల ప్రచార బిజీలోనూ కాసేపు తన బాల్యదశలోకి వెళ్లి మురిసిపోయారు. నాటి జ్ఞాపకాలను ప్రజలతో పంచుకున్నారు. బాల్యదశలో తాను చెట్లులెక్కేవాణ్నని చెబుతూ చకచకా చెట్టెక్కేశారు! ఆ చెట్టు మీద నుంచే ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి తరఫున కొల్లాపూర్‌లో శనివారం జూపల్లి ప్రచారం నిర్వహించారు. బోడబండతండాలో మామిడి చెట్టును చూసి తన బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తన చిన్నప్పటి సంగతులను ప్రజలకు చెబుతూనే ఆ చెట్టెక్కి ప్రజలను ఆశ్చర్యపరిచారు. మైక్ తీసుకొని చెట్టు మీద కూర్చుని మాట్లాడారు. కొడంగల్‌లోనే తన అన్న డాక్టర్‌గా పని చేసే వారని, దీంతో తాను కూడా పాఠశాల విద్యలో కొంత అక్కడే చదివానని చెప్పారు. అప్పట్లో వార్షిక పరీక్షల టైంలో మిత్రులమంతా కలిసి రోడ్ల పక్కన ఉండే చెట్లు ఎక్కి చదువుకున్నామని గుర్తుచేసుకున్నారు.

కేసీఆర్ @ 21 రోడ్‌షోలు

» 17 రోజుల పాటు లోక్‌సభ ఎన్నికల ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 24న నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ప్రారంభ కానున్న ఆయన ప్రచార పర్వం.. వచ్చేనెల 10న సిద్దిపేటలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభతో ముగుస్తుంది. 17 రోజులపాటు ఆయన 21 రోడ్‌షోలలో పాల్గొంటారు. శనివారం రాత్రి 11 గంటల వరకు జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కూడా కేసీఆర్‌తోపాటు ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారు. కేసీఆర్ రోడ్‌షోలు సాయంత్రం వేళల్లో నియోజకవర్గ కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో కొనసాగనుంది. ఈ నెల 24న సాయంత్రం 5.30కు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, రాత్రి 7 గంటలకు సూర్యాపేటలో కేసీఆర్ రోడ్‌షో నిర్వహిస్తారు. 25న భువనగిరి, 26న మహబూబ్‌నగర్, 27న నాగర్‌కర్నూల్, 28న వరంగల్, 29న ఖమ్మం, 30న తల్లాడ, కొత్తగూడెం, వచ్చేనెల 1న మహబూబాబాద్, 2న జమ్మికుంట, 3న రామగుండం, 4న మంచిర్యాల, 5న జగిత్యాల, 6న నిజామాబాద్, 7న కామారెడ్డి, 8న నర్సాపూర్, పటాన్‌చెరు, 9న కరీంనగర్, 10న సిరిసిల్లలో కేసీఆర్ రోడ్‌షోలు ఉంటాయి. 10వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సిద్దిపేటలో జరిగే బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగిస్తారు.

మేడిగడ్డ పునరుద్ధరణకు ఏం చేయాలో చెప్పండి

» జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి తెలంగాణ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వానాకాలం రానున్న నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై తగిన సిఫారసులు చేయాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీని తెలంగాణ కోరింది. ఈమేరకు ఎన్‌డీఎస్‌ఏకు లేఖ రాసింది. ఎన్‌డీఎస్‌ఏ కోరిన సమాచారం హార్డ్ కాపీలతో పాటు సాఫ్ట్ కాపీల రూపంలో అందించిన నీటిపారుదల శాఖ అధికారులు తాజాగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన మధ్యంతర చర్యలపై తగిన సిఫారసులు చేయాలని నివేదించారు. రానున్న వర్షాకాలంలో గోదావరికి భారీగా వరద వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బ్యారేజీల రక్షణపై అధికారులు దృష్టి పెట్టారు.

17 మందిని పట్టుకుని చంపారు!

» మావోయిస్టు ప్రతినిధి మంగ్లీ పేరుతో లేఖ

చర్ల, ఏప్రిల్ 20: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా బీనాగూడ అడవుల్లో.. అబూజ్‌మడ్ వద్ద ఈనెల 16న జరిగిన ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ శనివారం తీవ్రంగా స్పందించింది. నార్త్ సబ్-జోనల్ బ్యూరో ప్రతినిధి మంగ్లీ పేరుతో ఈ మేరకు మీడియాకు ఓ లేఖ విడుదలైంది. నిజానికి తొలుత జరిగిన కాల్పులు-ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు చనిపోయారని, ఆ తర్వాత 17 మంది నిరాయుధులను కాల్చి చంపారని మంగ్లీ ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 25న నారాయణ్‌పూర్, కాంకేర్ జిల్లాల బంద్‌కు పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు.

అగ్నిమాపక శాఖను మరింత పటిష్ఠం చేస్తాం

» అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తుల నుంచి ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించేందుకు అవసరమైన ఆధునిక పరికరాలను ఎప్పటికప్పుడు సమకూర్చుకుంటున్నామని, తమ శాఖలో ఇప్పటికే టెక్నాలజీ పరంగా ఎన్నో మార్పులు చేశామని అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. వచ్చే రెండు నెలల్లో 39 ఆధునిక ఫైర్ ఇంజన్లు, 18 వినీ ఫైర్ ఇంజన్లు, వర్షాకాలంనాటికి వరదలు, ముంపు ప్రాంత ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఉపయోగపడే 20 బోట్లు సమకూర్చుకుంటామన్నారు. ఈ నెల 14న ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవం ముగింపు కార్యక్రమం శనివారం మాదాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అగ్నిమాపక శాఖ వారోత్సవంలో రాష్ట్రవ్యాప్తంగా 40 వేల మందికి అవగాహన కల్పించామన్నారు. నివాస సముదాయాలు, పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని.. బహుళ అంతస్తులు, పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు ఫైర్ మాక్‌డ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలని నాగిరెడ్డి సూచించారు.

కేసీఆర్ నాటకాలాడుతున్నారు: షబ్బీర్ అలీ

బీబీపేట/హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు తమకు టచ్‌లో ఉన్నారంటూ మాజీ సీఎం కేసీఆర్ నాటకాలాడుతున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల నుంచి ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారని.. ఈ భయంతోనే ఆయన అసత్య ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. శనివారం కామారెడ్డి జిల్లాలోని బీబీపేటలో కాంగ్రెస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్ మాటిమాటికి ప్రభుత్వాన్ని పడగొడతామంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతిస్తున్నారు. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేవంత్‌కు టచ్‌లో ఉన్నారు.. వారంతా త్వరలోనే కాంగ్రెస్‌లో చేరతారు. ఎన్నికల తర్వాత కేసీఆర్ జైలు పాలవడం ఖాయం' అని వ్యాఖ్యానించారు.

చల్లబరిచి.. నష్టపరిచి!

(మొదటి పేజీ తరువాయి)

నష్టం జరిగింది. కోత దశలో వరిపంట నేలకొరిగింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ఫలితంగా నేడోరేపో కాంటా అవుతుందనుకున్న రైతులు ఆందోళనలో పడిపోయారు. మామిడి కాయలు రాలిపోవడంతో ఆ రైతులు, తోటలు కొన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. కొన్నిచోట్ల చెట్లు కూకటి వేళ్లతో కూలి రోడ్లకు అడ్డంగా పడ్డాయి. విద్యుత్తు స్తంభాలు కూలిపోవడంతో పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు గంటల తరబడి అంతరాయం కలిగింది. పలుచోట్ల ఇళ్లలో విద్యుత్తు ఉపకరణాలు పాడైపోయాయి. పిడుగుపాట్లకు, ఈదురుగాలులకు విద్యుత్తు వైర్లు తెగిపడటంతో కొన్నిచోట్ల మూగజీవాలు బలయ్యాయి. వరంగల్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, జనగామ జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. జనగామ జిల్లా నర్మెటలో 4.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా కందుకూరులో 4సెం.మీ, వికారాబాద్ జిల్లా పద్దేమూల్‌లో 1.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. అప్పటిదాకా మండుతున్న ఎండ క్షణాల్లో మాయమై ఉరుములు, మెరుపులతో వాన దంచికొట్టడంతో కొనుగోలు కేంద్రాల్లోని రైతులకు పంటను కాపాడుకునేందుకు సమయమే దొరకలేదు. చాలాచోట్ల ఆరబోసిన ధాన్యం, కుప్పలుగా పోసిన ధాన్యం తడిసిపోయింది. కుప్పలపై కప్పేందుకు టార్పాలిన్లను సిబ్బంది అందుబాటులో ఉంచలేదు. వనపర్తి జిల్లా చిట్యాల మార్కెట్ యార్డులో 2వేల బస్తాల ధాన్యం తడిసిపోయింది. మెదక్ జిల్లా నిజాంపేట్ మార్కెట్‌యార్డులో, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో, శాస్త్రినగర్ కొనుగోలు కేంద్రంలో, జగిత్యాల జిల్లా కథలాపూర్ కొనుగోలు కేంద్రంలో, కోరుట్ల, రాయికల్, ఇబ్రహీంపట్నంలోని కేంద్రాల్లో, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర, చిట్యాల మార్కెట్ యార్డులో, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట-భూంపల్లి, మిరుదొడ్డి, సిద్దిపేట రూరల్, తొగుట, నారాయణరావుపేట, కుకునూరుపల్లి, చిన్నకోడూరు, దౌల్తాబాద్, మద్దూరు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. వికారాబాద్ జిల్లాలోని పలుమండలాల్లో వరిపంట నేలకొరింది. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్, కోమటిపల్లి గ్రామాల్లో నువ్వు, వరిపంటలు నేలకొరిగాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో వడగళ్లవానకు వరిపంటకు, మామిడి తోటలకు తీవ్ర నష్టం జరిగింది. వికారాబాద్ జిల్లా కొత్తపల్లి, మాల్, తమ్మలోనిగూడ, నందివనపర్తి, తాటిపర్తి తమ్మలోనిగూడ, కొత్తపల్లి, నజ్జిక్‌సింగారం, ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లిలో ఈదురుగాలులకు కృష్ణయ్య అనే వ్యక్తి ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. జిల్లాలోని కిషన్‌పల్లిలో మల్లేశ్, వెంకటయ్య, శ్రీనివాస్ అనే వ్యక్తులకు చెందిన పశువుల కొట్టాలు కూలిపోయాయి. వికారాబాద్ జిల్లా మదన్‌పల్లి నుంచి ధారూర్ మండలం నాగారం వెళ్లేదారిలో చెట్లు విరిగి రోడ్లమీద పడ్డాయి.


జనగామ జిల్లా చిలుపూర్ మండలం కృష్ణాజీగూడెంలో తడిసిన ధాన్యం


రంగారెడ్డి జిల్లా మాల్‌లో కూలిన కొట్టం

జిల్లాలోని పీసీఎం తండాలో ఓ చెట్టు కూలి పాఠశాల భవనమ్మీద పడింది. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం మారంపల్లి, నూత్‌పల్లి, గంగారం, డొంకేశ్వర్, నడుకుడ గ్రామాల్లో విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. జనగామ జిల్లా ఉప్పుగల్లులో చెట్టు కూలి విద్యుత్తు వైర్లు తెగడంతో ఐదు స్తంభాలు పడిపోయాయి. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి, అక్కన్నపేట-భూంపల్లి, నారాయణరావుపేట మండలాల్లో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్, మాందాపూర్ గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి.

రైతువారీగా పంట నష్టం వివరాల సేకరణ: తుమ్మల

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి, ఇతర పంటలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులంతా సమన్వయం చేసుకోవాలన్నారు. పంటలు తడవకుండా కాపాడుకునేందుకు ఇప్పటికే 2లక్షలకు పైగా టార్పాలిన్ కవర్లను రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. రాష్ట్రంలో రెండ్రోజులుగా కురుస్తున్న అకాల వానలతో నారాయణపేట, కామారెడ్డి, నిజామాబాద్, నాగర్‌కర్నూలు, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రాథమిక నివేదిక ప్రకారం దాదాపు 2,200 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, ఇందులో వరి, మొక్కజొన్న పంటలతో పాటు ఉద్యానవన పంటలకు నష్టం కలిగిందని పేర్కొన్నారు. పంటనష్టం కలిగిన ప్రాంతాలను వెంటనే సందర్శించి పూర్తిస్థాయిలో ఒక్కో రైతు వారీగా నష్టం వివరాలను వెంటనే సేకరించాలని అధికారులను ఆదేశించారు. కాగా రాష్ట్రంలో వరిపంట కోతలు ఊపందుకున్న నేపథ్యంలో వచ్చే రెండు, మూడు వారాలు జాగ్రత్తగా ఉండాలని, అకాల వర్షాలు కురిసే సమయంలో పంట నష్టాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు.

ఉష్ణోగ్రతలు తగ్గేదేలే

పలుచోట్ల వర్షంపడ్డా కూడా కొన్నిచోట్ల ఎండలు మాత్రం దంచికొట్టాయి. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు భారీగానే నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలచప్రాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం జిల్లా వైరాలో, భద్రాద్రి జిల్లా గరిమెల్లపాడులో 43.7, గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 43.3 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా పెద్దవీడులో 43.2 డిగ్రీలు, సూర్యాపేటలో 43 డిగ్రీలు, వనపర్తి జిల్లా కొత్తకోటలో 42.9 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరులో 42.5 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా బంట్వారంలో 39.6 డిగ్రీలు, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో 39.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి.

మరో 4 రోజులు వర్షాలు

రాగల నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు వర్షాలకు సంబంధించి యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం మంచిర్యాల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నారాయణపేట్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం మరాట్వాడ నుంచి అంతర్గత కర్నాటక మీదుగా తమిళనాడు వరకు కొనసాగిన ద్రోణి శనివారం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు తెలిపింది. కాగా హైదరాబాద్‌లో మరో రెండ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో వానే వాన

హైదరాబాద్‌లో పొద్దున్నే వాతావరణం చల్లబడి పలుచోట్ల వర్షం పడింది. అయితే పలుచోట్ల గంటన్నరపాటు వర్షం ఆగకపోవడంతో రోడ్లపై మోకాలిలోతులో నీళ్లు నిలిచాయి. ఉప్పల్, రామంతాపూర్, ముషీరాబాద్, కొండాపూర్, రాజేంద్రనగర్, బాచుపల్లి, శేరిలింగంపల్లి హిమాయత్‌నగర్, ఆసిఫ్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ యూసుఫ్‌గూడ,, కృష్ణానగర్ రోడ్ల మీద వర్షపునీరు చేరింది. రాజేంద్రనగర్, చత్రినాక, శాలిబండ, ఐటీ కారిడార్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, అమీర్‌పేటలో ట్రాఫిక్ నిలిచిపోయింది. అయితే చిన్నపాటి వర్షానికే హైదరాబాద్ వ్యాప్తంగా 200కు పైగా ఫీడర్లు ట్రిప్పయ్యాయి. ఫలితంగా ఉప్పల్, రామంతాపూర్, ముషీరాబాద్, వెంగళ్‌రావునగర్, మధురానగర్, అత్తాపూర్‌లో ఉదయం గంట నుంచి రెండు గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కొండాపూర్, రాజేంద్రనగర్, సైఫాబాద్, ఆజాంబాద్, చార్మినార్, సరూర్‌నగర్‌లో విద్యుత్తు వైర్ల మీద చెట్లుకొమ్మలు పడటంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది.

పిడుగులకు మూగ జీవాల బలి

పిడుగులు పడటంతో రంగారెడ్డి జిల్లా యాచారం నజ్దిక్‌సింగారంలో రెండు జెర్సీ ఆవులు.. కొత్తూరు మండలం కొడిచర్లలో ఆవు, లేగదూడ.. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో ఆవు.. కడ్తాల్ మండలం రావిచెడ్‌లో ఆవు మృతిచెందాయి. తలకొండపల్లి మండలం దేవుని పడకల్‌లో విద్యుత్తువైర్లు తెగిపడి రెండు ఆవులు మృతిచెందాయి. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరులో ఓ సెల్‌టవర్ జనరేటర్‌పై పిడుగు పడి మంటలు లేచాయి. చిలుపూర్‌లో పిడుగుపాటుకు ఓ ఇంట్లో ఫ్రిజ్ కాలిపోయింది. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ శివార్లో తెగిపడిన విద్యుత్తు వైర్లకు తగిలి మూడు నక్కలు మృతిచెందాయి.


సిద్దిపేట జిల్లా నారాయణరావు పేట కొనుగోలు కేంద్రంలో పరిస్థితి


పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ శాస్త్రినగర్ కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

ప్రజలపై పన్నుల భారం మోపం

» అదనపు రాబడి మార్గాలను అన్వేషిస్తున్నాం
» ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు ఇస్తున్నాం
» 4 నెలల్లో తీసుకున్న అప్పు 17,615 కోట్లే
» అసలు, వడ్డీ.. 26,374 కోట్లు చెల్లించాం
» ఇప్పటిదాకా 29,370 పోస్టుల భర్తీ
» ఎన్నికల కోడ్ ముగియగానే రుణ మాఫీ
» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాబడుల్లో లీకేజీలను అరికడుతూ ప్రజలపై అదనంగా ఎలాంటి పన్నుల భారం మోపకుండా తమ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. అధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టే వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల రాబడుల్లో ఎలాంటి లొసుగులు లేకుండా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అధికారిక తప్పిదాలు లేకుండా చూడడం, పన్ను ఎగవేతలను అరికట్టడం, పాత బకాయిలను వసూలు చేయడం వంటి చర్యల ద్వారా రాబడులను పెంచడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుత ఉన్నవే కాకుండా... ఇతర రాబడి మార్గాలనూ అన్వేషిస్తున్నామన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు అందిస్తున్నామని, అదే సమయంలో ప్రజా సంక్షేమ పథకాలకు నిధుల చెల్లింపులను ఆపడం లేదని వివరించారు. గత డిసెంబరు నుంచి ఈ ఏప్రిల్ 15 వరకు రూ. 66,507 కోట్లను వ్యయం చేశామని వివరించారు. ఇందులో ఉద్యోగుల వేతనాలకు రూ. 22,328 కోట్లు, ప్రభుత్వ అప్పులకు సంబంధించి అసలు, వడ్డీ చెల్లింపులకు రూ.26,374కోట్లు వెచ్చించామని వెల్లడించారు. రైతు భరోసా కింద రూ.5,575 కోట్లు, చేయూత పథకానికి రూ.3,840 కోట్లు, మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి రూ. 1,125 కోట్లు, గృహజ్యోతి కింద విద్యుత్తు సబ్సిడీకి రూ.200 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.189 కోట్లు, మహాలక్ష్మి(గ్యాస్ సబ్సిడీ) కింద రూ.80 కోట్లు, వ్యవసాయ విద్యుత్తు సబ్సిడీకి రూ.3,924 కోట్లు, బియ్యం సబ్సిడీకి రూ.1,147 కోట్లు, రైతు బీమాకు రూ.734 కోట్లు, డైట్ చార్జీలకు రూ.418 కోట్లు, మధ్యాహ్న భోజనం కింద రూ.52 కోట్లు, అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలకు రూ.69 కోట్లు, హోంగార్డ్స్ వేతనాలకు రూ.186 కోట్లు, డ్వాక్రా మహిళలకు రూ.267 కోట్లు... మొత్తం రూ.66,507 కోట్లను వెచ్చించామని వివరించారు. రైతు భరోసా పథకం కింద 5 ఎకరాల లోపు ఉన్న 64,75,319 మంది రైతులకు రూ.5,575 కోట్లను చెల్లించామన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే రైతు రుణ మాఫీ అమలు చేస్తామని ప్రకటించారు.

లోటు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగించారు


బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు రూ.3,960 కోట్ల లోటుతో ఆర్థిక శాఖను అప్పగించిందని భట్టి విమర్శించారు. అయినా... తాము తక్కువ అప్పులు తీసుకుని, ఎక్కువ మొత్తంలో అసలు, వడ్డీ చెల్లింపులు జరిపామన్నారు. డిసెంబరు నుంచి ఏప్రిల్ 15 వరకు రూ.17,615 కోట్ల అప్పులు తీసుకోగా... గత ప్రభుత్వం చేసిన అప్పులకు సంబంధించి అసలు, వడ్డీల కింద రూ.26,374 కోట్లను చెల్లించామని వివరించారు. మూలధన వ్యయం కింద రూ.7,135 కోట్లను వెచ్చించామన్నారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను కూడా ప్రాధాన్య క్రమంలో చెల్లిస్తున్నామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 11,062 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేశామని భట్టి గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 503 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చిందని, కానీ... తాము మరో 64 పోస్టులను అదనంగా జత చేసి, 563 పోస్టులతో రివైజ్డ్ నోటిఫికేషన్‌ను జారీ చేశామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో 5,378 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, డిసెంబరు 7న తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక... మొత్తం 29,370 పోస్టులను భర్తీ చేసిందని, ఈమేరకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు కూడా అందజేసిందని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల కోసమే యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. త్వరలో కొత్త విద్యుత్ పాలసీ తేనున్నామన్నారు. రానున్న రోజుల్లో కరెంట్ బిల్లులను పెంచబోమన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 21 ఏప్రిల్ 2024

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)- ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎడ్‌సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా బీఈడీ రెగ్యులర్ కోర్సు, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వ/ప్రైవేట్/ఎయిడెడ్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

ఏపీ ఎడ్‌సెట్ నోటిఫికేషన్



అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఏ/ బీఏ(ఓఎల్)/ బీఎస్సీ/ బీఎస్సీ(హోం సైన్స్)/బీకాం/బీసీఏ/బీబీఎం ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. సంబంధిత సబ్జెక్టులో పీజీ/సంబంధిత మెథడాలజీలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు; కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- ఎడ్‌సెట్‌లో మేథమెటిక్స్ ఎంచుకోవాలంటే మేథ్స్ ప్రధాన సబ్జెక్టుగా బీఏ/బీఎస్సీ లేదా ఇంటర్(మేథమెటిక్స్)తోపాటు బీసీఏ లేదా బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. ఫిజికల్ సైన్సెస్ ఎంచుకోవాలంటే ఇంటర్(ఫిజిక్స్, కెమిస్ట్రీ)తోపాటు బీసీఏ లేదా బీఎస్సీ(ఫిజిక్స్, కెమిస్ట్రీ)/బీఎస్సీ(అలైడ్ మెటీరియల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ ఎంపీసీతో పాటు బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా అర్హులే. బయలాజికల్ సైన్సెస్ ఎంచుకోవాలంటే ఇంటర్(బయలాజికల్ సైన్సెస్)తోపాటు బీసీఏ లేదా బీఎస్సీ(బోటనీ/జువాలజీ)/బీఎస్సీ(హోం సైన్స్)/బీఎస్సీ(అలైడ్ లైఫ్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. సోషల్ స్టడీస్ ఎంచుకోవాలంటే ఇంటర్(సోషల్ సైన్సెస్)తోపాటు బీసీఏ లేదా బీఏ/బీఏ(ఓఎల్)/బీకాం/బీబీఎం పూర్తిచేసి ఉండాలి. ఇంగ్లీష్ ఎంచుకోవాలంటే బీఏ(స్పెషల్ ఇంగ్లీష్)/ఎంఏ (ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి. అలైడ్ మెటీరియల్ సైన్సెస్, అలైడ్ లైఫ్ సైన్సెస్ సబ్జెక్టుల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ ఎడ్‌సెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ నుంచి 25; రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 15, టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. మూడో పార్ట్‌లో అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్టుకు సంబంధించిన మెథడాలజీ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులకు వాటినుంచే 100 ప్రశ్నలు ఇస్తారు. ఫిజికల్ సైన్సెస్ సబ్జెక్టుకు ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ఒక్కోదానిలో 50; బయలాజికల్ సైన్సెస్ సబ్జెక్టుకు బోటనీ, జువాలజీల నుంచి ఒక్కోదానిలో 50; సోషల్ స్టడీస్ సబ్జెక్టుకు జాగ్రఫీ నుంచి 35, హిస్టరీ నుంచి 30, సివిక్స్ నుంచి 15, ఎకనామిక్స్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. అన్ని సబ్జెక్టులకూ మొదటి రెండు పార్ట్‌లూ కామన్‌గా ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు. మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రాన్ని(ఇంగ్లీష్ మెథడాలజీ మినహా) ఇంగ్లీష్, తెలుగు/ఉర్దూ మాధ్యమాల్లో ఇస్తారు. ఉర్దూ మాధ్యమంలో ఎగ్జామ్ రాయాలనుకొనేవారు కర్నూలు టెస్ట్ సెంటర్‌ను ఎంచుకోవాలి.

- ఎడ్‌సెట్‌లో అర్హత పొందాలంటే కనీసం 37 మార్కులు (25 శాతం) రావాలి. ఫిజికల్ సైన్సెస్, మేథమెటిక్స్ మెథడాలజీ ఎంచుకొన్న మహిళలకు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఏపీ ఎడ్‌సెట్ 2024కు సంబంధించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.650; బీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **కరెక్షన్ ఆఫ్ ఆన్‌లైన్ అప్లికేషన్:** మే 22 నుంచి 25 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 30 నుంచి
- **ఏపీ ఎడ్‌సెట్ 2024 తేదీ:** జూన్ 8
- **ప్రిలిమినరీ కీ విడుదల:** జూన్ 15
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీహాబిలిటేషన్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ (ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్, కటక్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా సంస్థ నిర్వహిస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం గంటన్నర. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

మాస్టర్ ఆఫ్ ఆక్యుపేషనల్‌థెరపీ(ఎంఓటీ)

ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
స్పెషలైజేషన్‌లు: రీహాబిలిటేషన్, హ్యాండ్ రీహాబిలిటేషన్, డెవలప్‌మెంటల్ డిజెబిలిటీస్, న్యూరాలజీ
అర్హత: రెగ్యులర్ బీఓటీ/బీఎస్సీ(ఆక్యుపేషనల్ థెరపీ) ఉత్తీర్ణులై ఉండాలి.

మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ(ఎంపీటీ)

ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
స్పెషలైజేషన్‌లు: రీహాబిలిటేషన్, మస్క్యులోస్కెలిటల్ కండిషన్స్, పీడియాట్రిక్స్, న్యూరాలజీ
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి రెగ్యులర్ బీపీటీ/బీఎస్సీ(ఫిజియోథెరపీ) ఉత్తీర్ణులై ఉండాలి.

మాస్టర్ ఇన్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ (ఎంపీఓ)

ఈ ప్రోగ్రామ్‌లో 10 సీట్లు ఉన్నాయి.
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీపీఓ/బీఎస్సీ(ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్) పూర్తిచేసి ఉండాలి.

- 2024 సెప్టెంబరు 10 నాటికి అభ్యర్థుల ఇంటర్న్‌షిప్ పూర్తికావాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 4
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** సికింద్రాబాద్, విజయవాడ
- **ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్ పీజీఈటీ 2024 తేదీ:** జూన్ 23
- **ఫలితాలు విడుదల:** జూలై 9
- **సీట్ల అలాట్‌మెంట్, సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్:** ఆగస్టు 9 నుంచి సెప్టెంబరు 30 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** admission.svnirtar.nic.in/



ఆంధ్ర యూనివర్సిటీలో ఎంబీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- 'ఎంబీఏ(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇది సెల్ఫ్ సపోర్టెడ్ ప్రోగ్రామ్. దీనికి నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లాజిస్టిక్స్ కౌన్సిల్ సహకారం అందిస్తోంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 18
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.500
- **సీట్ల అలాట్‌మెంట్:** జూన్ 20
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెద వాల్తేర్, విశాఖపట్నం-530017.
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

అపోలో ఇన్‌స్టిట్యూట్‌లో ఎండీహెచ్‌ఎం



హైదరాబాద్-జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్(ఏఐహెచ్‌ఏ-ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాల)- 'మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్(ఎండీహెచ్‌ఎం)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి మూడు సెమిస్టర్లలో ఒక్కోదానిలో ఏడు పేపర్లు; చివరి సెమిస్టర్‌లో మూడు పేపర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో హాస్పిటల్ విజిట్స్, రెండో సెమిస్టర్‌లో ఆరు వారాల ప్రాజెక్ట్ వర్క్, మూడో సెమిస్టర్‌లో డిజర్టేషన్ వర్క్, చివరి సెమిస్టర్‌లో డిజర్టేషన్-వైవా-నాలుగు నెలల ఇంటర్న్‌షిప్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూం లెక్చర్స్, గెస్ట్ లెక్చర్స్, కేస్ స్టడీస్, ఫీల్డ్ విజిట్స్, ఆడియో విజువల్ ప్రజంటేషన్స్, గ్రూప్ డిస్కషన్స్, సెమినార్‌లు, జాబ్ ట్రెయినింగ్ ఉంటాయి. అభ్యర్థులకు కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

సీట్ల వివరాలు: మొత్తం సీట్లు 64. కన్వీనర్ కోటా కింద 46 సీట్లు ఉన్నాయి. వీటిలో నాలుగింటిని ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి ప్రత్యేకించారు. మేనేజ్‌మెంట్ కోటా కింద 18 సీట్లు ఉన్నాయి.

- స్థానికులకు 85 శాతం సీట్లు నిర్దేశించారు. మిగిలిన 15 శాతం సీట్లకు స్థానికులు సహా స్థానికేతరులందరూ పోటీపడవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని మెడికల్/నాన్ మెడికల్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సర పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఫైన్ ఆర్ట్స్, ఓరియంటల్ లాంగ్వేజెస్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తుంది. పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ అండ్ యూసేజ్, హెల్త్ అండ్ హాస్పిటల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం గంటన్నర. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మే 30
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **ఫలితాలు విడుదల:** జూలై 10
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ప్రిన్సిపాల్, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, అపోలో హెల్త్ సిటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500096.
- **వెబ్‌సైట్:** apolloiha.ac.in

జాబ్ కార్నర్

నిఫ్ట్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 37

వారణాసి/రాయ్‌బరేలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) క్యాంపస్.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న గ్రూప్-సి పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. మెషిన్ మెకానిక్: **5 పోస్టులు**
2. అసిస్టెంట్(అడ్మిన్/ఎఫ్అండ్ఏ): **7 పోస్టులు**
3. అసిస్టెంట్ వార్డెన్(గర్ల్స్): **2 పోస్టులు**
4. నర్స్: **2 పోస్టులు**
5. జూనియర్ అసిస్టెంట్: **12 పోస్టులు**
6. లైబ్రరీ అసిస్టెంట్: **1 పోస్టు**
7. ల్యాబ్ అసిస్టెంట్: **7 పోస్టులు**
8. స్టెనోగ్రాఫర్: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 27 సంవత్సరాలు మించకూడదు
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్/కాంపిటెన్సీ టెస్ట్ తదితరాల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, నిఫ్ట్ క్యాంపస్, దూర్‌భాష్ నగర్, రాయ్‌బరేలి చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 25
వెబ్‌సైట్: www.nift.ac.in



ఎమ్‌టీఆర్‌డీసీలో జేఆర్ఎఫ్

డీఆర్‌డీవో, మైక్రోవేవ్ ట్యూబ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, బెంగళూరు...జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో
అర్హత: సంబంధిత విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎమ్మెస్సీ), బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్‌తో గేట్, నెట్ స్కోర్ ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించరాదు
వేతనం: నెలకు రూ.37,000
ఇంటర్వ్యూ తేదీ: ఏప్రిల్ 23
ప్రదేశం: ఎమ్‌టీఆర్‌డీసీ రిసెప్షన్, భారత్ ఎలక్ట్రానిక్స్ నార్త్ గేట్, జలహళ్లి పోస్ట్ బెంగళూరు.
వెబ్‌సైట్: www.drdo.gov.in/drdo/

జీఎంసీటీహెచ్‌లో సీనియర్ రెసిడెంట్స్

మొత్తం ఖాళీలు: 29

యాదాద్రి భువనగిరి జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ అండ్ టీచింగ్ హాస్పిటల్(జీఎంసీటీహెచ్).. తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. సీనియర్ రెసిడెంట్: **22 పోస్టులు**
2. ట్యూటర్: **7 పోస్టులు**

విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఆప్తాల్మాలజీ తదితరాలు
అర్హత: ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 45 సంవత్సరాలు మించకూడదు
వేతనం: సీనియర్ రెసిడెంట్ పోస్టుకు రూ.92,575, ట్యూటర్ పోస్టుకు రూ.57,700.
ఇంటర్వ్యూ తేదీ: 2024 ఏప్రిల్ 23
ప్రదేశం: ఆఫీస్ ఆఫ్ ద గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, యాదాద్రి భువనగిరి జిల్లా.
వెబ్‌సైట్: yadadri.telangana.gov.in/notice_category/recruitment/

చిట్టి



నీళ్లకు డబ్బు కట్టలేదు!

\- బీర్బల్ పంచాయితీ

అది అక్బర్ రాజ్యం. ఆ సమయంలో సుఖ్‌దేవ్ అనే ఓ రైతు ఉండేవాడు. అతడు కష్టజీవి. నిజాయితీ మనిషి. తన పొలం పక్కన బాలరాజ్ అనే రైతు ఉండేవాడు. అతను టక్కరి. అబద్ధాలు చెప్పటంలో అందెవేసిన చేయి. తన పొలం ఎండిపోతుంటే సుఖ్‌దేవ్ చూడలేకపోయాడు. అప్పు చేసి మరీ తన పక్క చేను యజమాని బాలరాజ్‌తో ఒక బావి కొన్నాడు. డబ్బులన్నీ కూడా ఇచ్చాడు.

వారం తర్వాత 'ఇంకా డబ్బులు కావాల'ని పేదరైతుని వేధించాడు టక్కరి రైతు. పేద రైతు 'నేను ఇవ్వలేను. నీ డబ్బులు ఇచ్చాను' అంటూ గొడవపడ్డాడు. ఇద్దరూ కొట్లాడారు. పంచాయితీ కాస్త బీర్బల్ దగ్గరకు తీసుకెళ్లాడు. బక్క రైతును చూస్తూనే బీర్బల్‌కి విషయం అర్థమైంది.




ఇతను మంచివాడు.. ఆ పక్కరైతు టక్కరని అర్థమైంది. 'అయ్యా.. నేను నా పక్కచేను యజమానితో తన బావిని కొన్నా. డబ్బులిచ్చా. అయినా మళ్లీ డబ్బులు ఇవ్వాలంటున్నాడు' అన్నాడు. ఇంతలోనే బాలరాజ్ కలుగ చేసుకుని 'అయ్యా.. నేను బావిని అమ్మాను. నీళ్లను అమ్మలేదు. దానికి డబ్బులు కావాలి కదా' అన్నాడు. బీర్బల్ ఇక వెంటనే కోప్పడుతూ ఇలా అన్నాడు. 'బాలరాజ్.. బావి నీదే కదా?' అన్నాడు. 'అవును' అన్నాడు అతను. 'బావిని సుఖ్‌దేవ్‌కు అమ్మావ్ కదా. నీళ్లు కూడా నీవే కదా?' అంటూనే.. గట్టిగా 'అవునవును' అంటూ గట్టిగా అరిచాడు.

మరింత కోపాన్ని ప్రదర్శిస్తూ బాలరాజ్‌తో బీర్బల్ ఇలా అన్నాడు- "నువ్వు నీ బావిని అమ్మావు. సరే. ఆ బావిలోని నీళ్లు కూడా నీవే అంటున్నావు కదా? అలాగైతే బావిలోని నీళ్లను తోడుకుని అమ్మాలి కదా. నీళ్లన్నీ తోడించి అతని బావి అమ్మాలి' అన్నాడు. బాలరాజ్‌కు మాటల్లేవ్. 'చూడు బాలరాజ్. నీ నీళ్లను సుఖ్‌దేవ్ తన బావిలో ఉంచుకుంటున్నాడు. కాబట్టి అందుకు అద్దె కట్టాల్సిందే' అన్నాడు గట్టిగా బీర్బల్. చేసేదేమీ లేక బీర్బల్ ముందు తప్పయిందని బాలరాజ్ అంగీకరించాడు. 'నా బుద్ధి గడ్డి తిని ఇలా చేశా. మీ ఇష్టం అయ్యా. ఈ ఒక్కసారి క్షమించండి' అంటూ వేడుకున్నాడు. బీర్బల్ హాస్యచతురత, ఆయన పంచాయితీ చూసి రైతు ఆశ్చర్యపోయి.. నమస్కరించాడు. ధన్యవాదాలు తెలిపాడు.

ఎన్ని పిల్లులు ఉన్నాయి?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి





డైలీ సుడోకు - 287

				3			8	
	5	2			4			
		7	9		2	3		
2				9	3			1
4			7	8				6
		5	4		9	2		
			5			7	3	
	2			1				

సుడోకు - 286 సమాధానం

6	2	9	8	7	3	4	5	1
7	8	5	4	9	1	3	6	2
1	3	4	2	6	5	7	9	8
4	5	2	7	3	6	1	8	9
8	1	6	5	4	9	2	7	3
9	7	3	1	8	2	6	4	5
3	9	8	6	2	4	5	1	7
5	4	7	3	1	8	9	2	6
2	6	1	9	5	7	8	3	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 21 ఏప్రిల్ 2024



ఊరికి దూరంగా విసిరేసినట్లుండే పాడుబడిన బంగ్లా... అందులో ఓ ప్రేతాత్మ...అమావాస్య అర్ధరాత్రి... అటుగా నడిచి వెళుతున్న ఒంటరి పాదచారి... అంటూ మొదలైన పలు దెయ్యం కథలు ఎన్నెన్నో మలుపులు తీసుకున్నా చివరకు బాక్సాఫీసు దగ్గర మాత్రం కాసుల వర్షం కురిపిస్తోంది. గత కొంతకాలంగా హారర్ జానర్‌లో వచ్చిన పలు చిత్రాలు టాలీవుడ్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. దీంతో మేకర్స్ కూడా ఈ తరహా చిత్రాలపై ఫోకస్ పెట్టారు. మరిన్ని దెయ్యం కథలు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

బాక్సాఫీసు వద్ద భూతం హవా



దెయ్యంతో ప్రేమ

దెయ్యానికి బాయ్ ఫ్రెండ్ ఉంటే ఏం జరుగుతుంది? అనే ఆసక్తికరమైన పాయింట్ చుట్టూ అల్లుకున్న కథతో తెరకెక్కిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యూ డేర్' అనేది ఉపశీర్షిక. 'రౌడీబాయ్స్' ఫేం ఆశిష్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకుడు. వైష్ణవీ చైతన్య కథానాయిక. హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగమల్లిడి నిర్మిస్తున్నారు. ప్రేతాత్మ ప్రేమలో పడిన కుర్రాడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో దెయ్యం పాత్రలో కనిపించబోయే హీరోయిన్ ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్. దెయ్యంతో డేటింగ్ అనే సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా కావడంతో ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని క్రియేట్ చేయగలిగింది. ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

మారుతి మార్క్‌తో

'సలార్' 'కల్కి 2898 ఏడీ' చిత్రాలతో జోరుమీదున్నారు ప్రభాస్. ఆయన ఈ సారి తన పంథా మార్చారు. భారీ కమర్షియల్స్‌కు భిన్నంగా ఓ వైవిధ్యమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రభాస్ మారుతి కాంబినేషన్‌లో వస్తున్న 'రాజా సాబ్' చిత్రం హారర్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనుందని తెలుస్తోంది. థ్రిల్లర్ కథాంశంతో సాగే ఈ సినిమాను మారుతి తన మార్క్‌తో తెరకెక్కుస్తున్నారు. పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. మాళవికా మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈసారి మిస్టిక్ థ్రిల్లర్

సాయి దుర్గ తేజ్ అపజయాలకు బ్రేక్ వేయడమే కాదు, బాక్సాఫీసు దగ్గర రూ. 100 కోట్ల వసూళ్లను సాధించింది 'విరూపాక్ష' చిత్రం. కార్తీక్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మిస్టిక్ థ్రిల్లర్ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఇప్పుడు మరోసారి ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతోందీ చిత్రబృందం. విరూపాక్ష దర్శకుడు కార్తీక్ వర్మతో ఆ చిత్ర నిర్మాతలు సుకుమార్, బీవీఎస్ఎన్ ప్రసాద్ మరో హారర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పౌరాణిక గాథ చుట్టూ అల్లుకున్న ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనుందని యూనిట్ తెలిపింది.

సీక్వెల్స్ సైతం

కొత్త చిత్రాలే కాదు ఈ జానర్‌లో ప్రేక్షకాదరణ పొందిన చిత్రాలకు సీక్వెల్స్ కూడా సిద్ధమవుతున్నాయి. గతేడాది అద్భుత విజయాన్ని సాధించిన చిత్రాల్లో 'మా ఊరి పొలిమేర 2' ఒకటి. సత్యం రాజేశ్, గెటప్ శ్రీను, మీనాక్షి భాస్కర్ల ప్రధాన తారాగణంగా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. చేతబడులు, గుప్తనిధుల నేపథ్యంలో సాగే కథలో అనూహ్య మలుపులు ఆకట్టుకున్నాయి. 'మా ఊరి పొలిమేర' సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలూ చక్కని ప్రేక్షకాదరణ అందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా మూడో చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. అలాగే సాయి దుర్గ తేజ్ హీరోగా వచ్చిన 'విరూపాక్ష' చిత్రానికి కూడా కొనసాగింపు ఉంటుందని అప్పట్లో మేకర్స్ తెలిపారు. 2022లో వచ్చిన 'మసూద' చిత్రం బాక్సాఫీసు దగ్గర ఘన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. తిరువీర్, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించారు. ఓ కుటుంబంపై పగబట్టిన ప్రేతాత్మ ఎలాంటి దారుణాలను చేసిందనేది ఒళ్లు గగుర్పొడిచేలా ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ సినిమాకు ప్రీక్వెల్ తీయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా వెల్లడించారు.





జేజమ్మ కథనార్

అనుష్క కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన చిత్రం 'అరుంధతి'. అందులో పిశాచిగా మారిన పశుపతి పాత్రలో సోనూసూద్ సృష్టించిన బీభత్సం ప్రేక్షకులను వెన్నాడింది. ఆ తర్వాత ఇదే జానర్‌లో మరికొన్ని చిత్రాలు చేశారు అనుష్క. కానీ అవేవీ ప్రేక్షకాదరణకు నోచుకోలేదు. ఇప్పుడు మరోసారి హారర్ జానర్‌లో అనుష్క ఓ భారీ చిత్రం చేస్తున్నారు. అయితే ఇది మలయాళ చిత్రం. 'కథనార్: ది వైల్డ్ సోర్సరర్' పేరుతో తెరకెక్కుతోంది. రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. మలయాళంలో అనుష్కకు ఇది తొలి చిత్రం. 9వ శతాబ్దానికి చెందిన కేరళ క్రైస్తవ మత గురువు కడమత్తత్తు కథనార్ జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు వెన్నులో వణుకు పుట్టించేలా ఉన్నాయి. ఓ భూగృహంలోపల దాగి ఉన్న అంతుచిక్కని రహస్యాలు, పిశాచాల దాడుల నేపథ్యంలో టీజర్ ఆసక్తికరంగా సాగింది. రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదలవనుంది. తొలి భాగం ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. నాగచైతన్య, కార్తీక్ దండు కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కూడా ఇదే జానర్‌లో ఉండబోతోంది.






పరభాషల్లోనూ ఆదరణ


తెలుగుతో పాటు పరభాషల్లోనూ హారర్ చిత్రాల హవా కొనసాగుతోంది. ఈ తరహా చిత్రాల్లో హిందీలో వచ్చిన 'స్త్రీ' ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ హారర్ కామెడీకి సీక్వెల్ తెరకెక్కుతోంది. శ్రద్ధాకపూర్, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటిస్తున్నారు. అమర్ కౌశిక్ తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది. ఆగస్టు 30న 'స్త్రీ 2' ప్రేక్షకుల ముందుకొస్తోంది. అలాగే తమిళ హారర్ ఫ్రాంచైజీ 'ఆరణ్మణై' నుంచి మరో చిత్రం వస్తోంది. తమన్నా, రాశీఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం 'ఆరణ్మణై 4'. తెలుగులో 'బాక్' పేరుతో మే 3న విడుదలవుతోంది.







మలయాళ అగ్ర హీరో మోహనల్‌లాల్ తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బరోజ్'. చారిత్రక కథాంశంతో కాల్పనిక గాథగా తెరకెక్కుతోంది. వాస్కోడిగామా చపోయాక ఆయన గుప్తనిధులకు కాపలా కాసే బరోజ్ అనే భూతం కథతో భారీ స్థాయిలో తెరకెక్కుతోంది. మేలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



శృంగారతార సన్నీలియోన్ ప్రధాన పాత్రధారిగా మలయాళంలో ఓ హారర్ చిత్రం తెరకెక్కుతోంది. ఆర్ యువన్ దర్శకత్వం వహిస్తున్న ఈ హారర్ థ్రిల్లర్‌కు 'మందిర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది.



ఎన్టీఆర్ వేగం.. రామ్‌చరణ్ ఆందోళన

'ఆర్ఆర్ఆర్' చిత్రంతో పాన్ ఇండియా స్టార్స్‌గా మారిపోయారు జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్. ఆ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్.మరీ ముఖ్యంగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ను పరిచయం చేసే యాక్షన్ సీక్వెన్స్, వాళ్లిద్దరూ ఒకరితో ఒకరు ముఖాముఖి తలపడే ఇంటర్వెల్ బ్లాక్ పోరాట ఘట్టాలను సినీ ప్రియులు ఇప్పట్లో మరిచిపోలేరు. ఆ రేంజ్‌లో అందరినీ ఆకట్టుకున్న ఆ యాక్షన్ సన్నివేశాల వెనకున్న ఆసక్తికరమైన విషయాల్ని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె సెంథిల్ ఇటీవల మీడియాతో పంచుకున్నారు.

"సినిమాలో జూనియర్ ఎన్టీఆర్‌ను పరిచయం చేసే యాక్షన్ సన్నివేశాలలో ఆయనను నక్క, తోడేలు, పులి వెంటాడుతాయి. ఈ సన్నివేశాలను చిత్రీకరించేటప్పుడు ఆయన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు పరిగెట్టాలో ముందే మార్క్‌చేసి చెప్పేవాళ్లం. కానీ ఆయన కెమెరాకు అందకుండా వాయు వేగంతో పరిగెత్తేసేవారు. దీంతో ఎన్టీఆర్ మూమెంట్స్‌ను క్యాప్చర్ చేయడం కష్టసాధ్యమయ్యేది. అసలు, ఆయనకు ఇంత వేగం ఎలా వచ్చిందని ముక్కునవేలేసుకునేవాళ్లం. ఇదే విషయం ఆయన్ని అడగ్గా.. తను జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ప్లేయర్ అని, అందుకే అలా పరిగెత్తడం సాధ్యమైందని చెప్పారు. దీంతో చేసేది లేక మేము ఆయన వేగానికి తగినట్లు ఏర్పాట్లు చేసుకున్నాము. ఇక ఇంటర్వెల్ బ్లాక్‌లోనూ ఎన్టీఆర్ జంతువులతో దూకే సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ తర్వాత ఆయన రామ్‌చరణ్‌తో పోరాడుతారు. ఈ సన్నివేశంలో మిగిలిన నటులందరూ నిజంగా వారిని జంతువులు తరుముతున్నట్లే నటించాలి. అందుకోసం కార్లకు జంతువుల ముఖాలున్నట్లు డిజైన్ చేశాం. ఈ సన్నివేశాన్ని దాదాపు రెండు నెలలు షూట్ చేశాము. అలాగే, రామ్‌చరణ్ పరిచయ సన్నివేశంలో ఆయన రెండు వేల మంది భారతీయుల్ని కొట్టాల్సిన సందర్భం వస్తుంది. ఒక భారతీయుడు మరో భారతీయుడ్ని అలా కొట్టడం చూసి ప్రేక్షకులు ఏమనుకుంటారో అని రామ్‌చరణ్ మొదట ఆందోళనకు లోనయ్యేవారు. ఆ తర్వాత దర్శకుడు రాజమౌళి నచ్చజెప్పడంతో ఆయన ఆ పాత్రలో లీనమై నటించారు. ఈ సీన్‌ను షూట్ చేయడం కోసం మూడు నెలల పాటు రిహార్సల్స్ చేశాము. ఈ సన్నివేశంలో చరణ్ ఎక్స్‌ప్రెషన్స్ చాలా కీలకం. ఆయన తన భావోద్వేగాల్ని అద్భుతంగా పలికించడంతో థియేటర్లలో ఆ సన్నివేశానికి రెస్పాన్స్ అదిరిపోయింది" అని చెప్పారు.

నా హీరో తెరపైనా.. తెరవెనుకా



బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే నటిస్తున్న తాజా చిత్రం 'సింహమ్ అగైన్'. అజయ్ దేవగణ్‌తో డైరెక్టర్ రోహిత్ శెట్టి తెరకెక్కిస్తోన్న 'సింహమ్' కాప్ యూనివర్స్‌లోని మూడో చిత్రమిది. ఈ సినిమాలో దీపికా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను, ఆమె ఇందులో పోషిస్తున్న పాత్రను దర్శకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. "ఈ లేడీ సింహం, నా హీరో. తెరపైనా..తెరవెనుకా" అని పోస్ట్ చేశారు. ఈ పోస్టర్‌లో అజయ్ దేవగణ్ ట్రేడ్ మార్క్ సింహం మ్యానరిజమ్‌ను ఆమె ఇమిటేట్ చేస్తున్నట్లు చూపించారు. దీపికా ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు.

అది ఒక ఎగ్జైటింగ్ ఐడియా!

సందీప్‌రెడ్డి వంగా



'యానిమల్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు సందీప్‌రెడ్డి వంగా. రణ్‌బీర్ హీరోగా నటించిన ఈ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ చిత్రానికి సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్'ను సందీప్ ఆ సినిమా ఎండ్ టైటిల్స్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా సీక్వెల్ ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుస్తున్నారు. తాజాగా ఆయన ఓ అవార్డు ఫంక్షన్‌లో ఈ సినిమా సీక్వెల్ గురించి మీడియాతో మాట్లాడారు. "2026లో 'యానిమల్-2' షూటింగ్ మొదలుపెడతాను. 'యానిమల్' సినిమా కంటే సీక్వెల్ మరిన్ని రెట్లు వయొలెంట్‌గా, వైల్డ్‌గా ఉంటుంది. ప్రస్తుతానికి ప్రభాస్‌తో తీస్తున్న 'స్పిరిట్' సినిమాపైనే నా దృష్టంతా. భవిష్యత్తులో నా సినిమా హీరోలందరినీ కలిపి సందీప్ రెడ్డి సినిమాటిక్ యూనివర్స్ ప్రారంభించే అవకాశం ఉందో లేదో ఇప్పుడే చెప్పలేను, కానీ అది ఒక ఎగ్జైటింగ్ ఐడియా" అని అన్నారు.



బాలీవుడ్ నటి పరిణీతీ చోప్రా 'అమర్ సింగ్ చమ్కీలా' చిత్రంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కారు. ఇందులో గాయనిగా నటించి అందరినీ ఆకట్టుకున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "కొందరు ఇచ్చిన సలహాల వల్ల నేను నా కెరీర్‌లో తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాను. నేను గతంలో నటించిన కొన్ని పాత్రలు సంతృప్తికరంగా అనిపించలేదు. అందుకే

తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాను

కొంచెం గ్యాప్ తీసుకుని పాత్రల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నాను. నేను ఇండస్ట్రీలోకి ఒంటరిగానే అడుగుపెట్టాను. నా కెరీర్ మొదట్లో నాకు వెంటనే అవకాశాలు రావడానికి ఇండస్ట్రీ పెద్దల సహకారం, ప్రముఖుల పరిచయాలు ఉండేవి కావు. నేను ఇండస్ట్రీ ప్రముఖులు చేసే సినిమాల్లో మంచి అవకాశాలు రావాలని కోరుకుంటున్నా. ప్రతిభకు తగ్గ అవకాశాలు వస్తేనే కదా ఎలాంటి పాత్రలో అయినా రాణించగలమని తెలిసేది" అని చెప్పారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డెడ్ బాయ్ డిటెక్టివ్స్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 25
టిల్లూ స్క్వేర్	తెలుగు చిత్రం	ఏప్రిల్ 26
అమెజాన్ ప్రైమ్		
దిల్ దోస్తీ డైలమా	హిందీ సిరీస్	ఏప్రిల్ 25
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
భీమా	తెలుగు చిత్రం	ఏప్రిల్ 25
క్రాక్	హిందీ చిత్రం	ఏప్రిల్ 26
బుక్ మై షో		
కుంగ్‌ఫూ పాండా 4	యానిమేషన్ మూవీ	ఏప్రిల్ 26
లయన్స్ గేట్ ప్లే		
ది బీ కీపర్	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 26
జియో సినిమా		
ది జినెక్స్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 22
ఆపిల్ టీవీ ప్లస్		
ది బిగ్ డోర్ ప్రైజ్ 2	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 24



